డిసెంబర్
2021

# 188

సంపుటి : 16 సంచిక : 7 వెల రు. 10/-

## ఈ సంచికలో........

అసమ్మతి వ్యక్తీకరణ భారతీయ సంప్రదాయంలో భాగం
సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ నిర్మాణమే నేటి ప్రధాన సమస్య
మతోన్మాదాన్ని ఎదుర్కోవటం ఎలా?
'దేవుళ్ళను' ఆయుధాలుగా వాడుకుంటున్న సంఘ్‌పరివారం
మత విప్లవాలు
చౌదరి తేజేశ్వరరావు గారి అనుభవాలు, జ్ఞాపకాలు: ఒక పరిశీలన
కాప్26: వాతావరణ చర్చల వైఫల్యం
ఎన్‌కౌంటర్ల పేరుతో ప్రజలను కాల్చిచంపుతున్న యుపి పోలీసులు
పారిశ్రామికీకరణ- నగదీకరణ
కార్మిక సంఘాలలో పార్టీ పని -1952

# కార్మిక సంఘాలలో పార్టీ పని - 1952

కమ్యూనిస్టు పార్టీ స్థాపించబడిన నాటి నుండి పార్టీని చట్టబద్ధంగా పనిచేయనిచ్చిన తరువాత మొట్టమొదటి సారిగా కార్మిక సంఘాలలో పనిచేస్తున్న నాయకులతో (ఏ.ఐ.టి.యు.సి ప్రధానమైనది. అయినా మిగతా కార్మిక సంఘాలలోని వారితో కూడా) ఒక అఖిలభారత సదస్సును ఏర్పాటు చేశారు. 1952లో కలకత్తాలో జరిగిన రెండు రోజుల సదస్సుకు 300 మంది ప్రతినిధులు హాజరయ్యారు. కార్మికుల సమస్యల పట్ల పార్టీ వైఖరి, కార్మిక సంఘాలలో పనిచేసేటప్పుడు ఎటువంటి పద్ధతులు అవలంబించాలో ఈ సదస్సులో చర్చించి, కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. ఆ సదస్సులో చేసిన నిర్ణయాలలో కొన్ని భాగాలను ఈ కింద ఇస్తున్నాం:

" మన పోరాటాలు, విజయాలను గురించి కార్యకర్తలు రేఖామాత్రంగా నైనా తెలుసుకుని ఉంటే వారిలో వర్గ చైతన్యం పెరుగుతుంది. అతనొక నమ్మకమైన దృక్పథాన్ని ఇవ్వగలుగుతాడు; కార్మికులకు విజయాలు చేకూర్చగలుగుతాడు; గతకాలపు అనుభవాల సహాయంతో వర్తమానంలో పోరాటాలను నడపగలుగుతాడు. మన చరిత్రను శత్రువులు వక్రీకరిస్తారు; కార్మికులను తప్పుదోవ పట్టిస్తారు. ఈ వక్రీకరణలను మనం సమర్థవంతంగా ఎదుర్కోవాలి.

"కార్మికులు తయారు చేస్తున్న వస్తువుల మార్కెట్ ఎంతుందో కార్మికసంఘ కార్యకర్తలు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి; వాటిమీదున్న ధర తెలుసుకోవాలి; ఆ ధరల పెరుగుదల, తరుగుదలలనూ గమనిస్తుండాలి. ఎందుకంటే ప్రభుత్వం, బూర్జువాలు ధరలు పెరగడానికి కార్మికుల వేతనాలు పెరగడమే కారణమని చెపుతూ వినియోగదారులను కార్మికులకు వ్యతిరేకంగా నిలబెడతారు; తద్వారా పట్టణాలలో ఉన్న కార్మికులకు, పల్లెలలో ఉన్న రైతాంగానికి మధ్య శత్రుత్వం పెరిగేటట్లు చేస్తారు.

"కార్మిక సంఘాలలో పనిచేసే కార్యకర్తలు వారు కార్మికసంఘాలు నడుపుతున్న పరిశ్రమలలోని యంత్రాలను గురించి ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలి; అప్పుడే వారు వేతన సమస్యలు, పనిభారం, పనివేగం, మెరుగైన పీస్‌రేట్లు వగైరా విషయాలు అర్థం చేసుకోగలుగుతారు; యజమానులతో జరిగే చర్చల సందర్భంలో వాటిని సక్రమంగా నివేదించగలుగుతారు. ఈ విషయాలు బాగా బోధించగలిగేవాడు ఆ వృత్తిలో ఉన్న కార్మికులే. మనం వారి నుండి నేర్చుకోవడాన్ని అశ్రద్ధ చేయకూడదు.

"కార్మికసంఘ కార్యకర్తలు పారిశ్రామిక వివాదాల చట్టం అమలు గురించి తెలుసుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి; అన్ని చట్టాలు కార్మికులపై దాడులని, అందువలన వాటి గురించి తెలుసుకోనక్కరలేదని, అన్నింటిపై సాధారణ రూపంలో పోరాడవలసిందేననే భావన ఉంది. చట్టాలలో రెండు రకాలు ఉన్నాయి; ఒక రకం మనం చేసిన పోరాటాల విజయాల వలన ఏర్పడ్డవి; వాటిని పర్యవేక్షించే బాధ్యత, వాటిని అమలు చేయించటం కోసం పోరాడటం కార్మికసంఘాల కర్తవ్యం. కార్మికవర్గ ప్రయోజనాలకు ప్రతికూలంగా ఉన్న చట్టాలకు వ్యతిరేకంగా పోరాటాలు జరపటం ద్వారా కార్మికోద్యమ నిర్మాణం చేయాలి.

"కార్మిక వర్గానికి అవసరమైన సామాజిక అవగాహన కల్పించడంలో, సహాయ సహకారాల్ని అందించడంలో, వారి యోగ క్షేమాలు వంటి అంశాలపై కార్మిక సంఘాల కార్యకర్తలు అశ్రద్ధ చేయకూడదు. సర్వసాధారణంగా ఇటువంటి పనులు చేయడమంటే 'సంస్కరణవాదం' అనే ధోరణి ఇప్పటికీ ఉంది. ఆరోగ్యకరమైన వినోదాలతో పాటుగా సాంస్కృతిక విద్యను అందించవలసిన కర్తవ్యం కార్మిక సంఘాలపై ఉంది.

"కార్మిక సంఘాలలో పనిచేసే కార్యకర్తలకు తాను పనిచేసే కార్మిక సంఘంలో, వృత్తిలో ఉన్న కుల, జాతి పొందికలపై అవగాహన ఉండాలి; వారి అలవాట్లు, సాంప్రదాయాలు తెలుసుకోవాలి; జీవితం పట్ల వారి అవగాహన కూడా తెలియాలి. అదే సమయంలో కులం, జాతి, తెగ, భాషల ఆధారంగా బూర్జువాలు ఎలా విభేదాలను సృష్టిస్తారో తెలుసుకోవాలి.

"పెట్టుబడిదారీ విధాన ప్రభావంతో పరిశ్రమలోకి అడుగుపెట్టిన కార్మికుడు తనతోపాటు పెట్టుబడిదారీ సిద్ధాంతాలను, సంప్రదాయాలను, తెగ, కులం, గ్రామం, మతం పట్ల విధేయతలను కూడా వెంటపెట్టుకుని వస్తాడు. అతని ఆరోగ్య సమస్యలు, కుటుంబ ఇబ్బందులు, ఇతర అవసరాలలో ఇవి అతనికి ఉపయోగపడతాయి. తన కష్టాలకు పరిష్కారం కోసం అతను సంఘం వద్దకు వెళ్ళడానికి ముందు అతను తన పూర్వ సంబంధాలనే వినియోగించుకుంటాడు. మనం ఆతని ఈ సంబంధాలను అంచనా వేయాలి. అదే సమయంలో కొత్త వర్గ వైరుధ్యాలకు విరుద్ధమైన విధేయతల నుండి అతనిని దూరం చేయాలి. కార్మికునిలో ఉన్న కుల, మత, తెగ భావాలను వర్గ దృక్పథం, కార్మికసంఘ సౌభ్రాతృత్వం, కార్మికసంఘాల ఐక్యత వైపు మరల్చాలి. యజమాని కులం, మతం, తెగ, దేశం ఏవైనప్పటికీ కార్మికుడు దోపిడీ చేయబడుతూనే ఉంటాడు.

"ఒక కార్మికురాలిగానే కాకుండా వ్యవస్థలో ఉన్న ఆర్థిక పరిస్థితుల కారణంగా మహిళలు మరిన్ని కష్టాలను ఎదుర్కొంటుంటారు; మన కార్మికసంఘాల నాయకులు వారి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి; సమాన పనికి సమాన వేతనం, శ్రామిక మహిళలకు ఇవ్వాల్సిన మాతృత్వ ప్రయోజనాలు, పిల్లల రక్షణకు చర్యలు వగైరాలపై శ్రద్ధ పెట్టాలి. పని ముగిసిన తరువాత యువ కార్మికులకు అప్రంటీస్ చట్టాలు, విద్య, ఆటలు మొదలైనవి

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...

1. కార్మిక సంఘాలలో పార్టీ పని -1952 ..... 2

2. అసమ్మతి వ్యక్తీకరణ భారతీయ సంప్రదాయంలో భాగం
ఉపిందర్ సింగ్ ....... 4

3. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ నిర్మాణమే నేటి ప్రధాన సమస్య తమ్మినేని వీరభద్రం .......... 7

4. మతోన్మాదాన్ని ఎదుర్కోవటం ఎలా?
ఎస్ వీరయ్య ........ 11

5. 'దేవుళ్ళను' ఆయుధాలుగా వాడుకుంటున్న సంఘ్‌పరివారం
అపూర్వానంద్ ........ 13

6. మత విప్లవాలు ఎంవిఎస్ శర్మ ........ 16

7. చౌదరి తేజేశ్వరరావు గారి అనుభవాలు, జ్ఞాపకాలు: ఒక పరిశీలన
చెరుకూరి సత్యనారాయణ .......... 19

8. కాప్26: వాతావరణ చర్చల వైఫల్యం
ఎస్ వెంకట్రావు .......... 22

9. ఎన్‌కౌంటర్ల పేరుతో ప్రజలను కాల్చిచంపుతున్న యుపి పోలీసులు
వి వెంకటేశన్ .......... 27

10. పారిశ్రామికీకరణ- నగదీకరణ
ఎ కోటిరెడ్డి .......... 31

సంపాదకుడు:
ఎస్. వెంకట్రావు

సంపాదక వర్గం:
పాటూరు రామయ్య
బి.వి. రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్. వీరయ్య
తెలకపల్లి రవి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ఫోన్: ఎడిటర్ : 9490099333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 9490098977**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com

# విజయం

ఏడాదిపాటు మొక్కవోని దీక్షతో పోరాడి, నరేంద్ర మోడీ నిరంకుశ ప్రభుత్వ మెడలు వంచి, మూడు నిరంకుశ చట్టాలను రద్దు చేయించడంలో భారత రైతాంగం సాధించిన ఘన విజయం, 21వ శతాబ్దంలో భారత దేశ వర్గ పోరాటంలో ఒక పెద్ద మైలురాయి. ఈ విజయాన్ని రైతాంగ విజయంగా చెబుతున్నప్పటికీ ఇది కేవలం రైతుల విజయం మాత్రమే కాదు. దానికి వెన్నుదున్నుగా నిలిచిన కార్మికవర్గ విజయం, భారత దేశంలోని ప్రజాతంత్ర శక్తుల విజయం, వెరసి ఇది భారత ప్రజానీకం పాలక వర్గాలపై సాధించిన సమిష్టి విజయం. అయితే ఈ విజయంతో పోరాటం ఆగదనీ, పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకనుగుణంగా కనీస మద్ధతు ధర సాధించేవరకు, కేంద్రం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక విద్యుత్ బిల్లును ఉపసంహరించే వరకు ఏదో ఒక రూపంలో పోరాటం సాగుతుందని రైతునేతలు ప్రకటించారు. ఆ డిమాండ్లు కూడా సాధించినప్పుడే పోరాటానికి సంపూర్ణ విజయం లభిస్తుందనేది కూడా కాదనలేని సత్యం.

భారత స్వాతంత్ర్య పోరాటం తరువాత సుదీర్ఘ కాలం జరిగిన రైతాంగ పోరాట ప్రాముఖ్యతను గురించి అనేక విశ్లేషణలు వచ్చాయి. పోరాటం విజయం సాధించిన తరువాత కూడా అనేకం వస్తున్నాయి. కార్పొరేట్ శక్తుల అనుకూల పత్రికలు నల్ల చట్టాల రద్దు వల్ల నష్టం జరిగిపోతుందని గగ్గోలు పెడుతున్నాయి. ఇప్పటికీ నిర్ణయం ప్రకటించినప్పటికీ వ్యవసాయ సంస్కరణలు కొనసాగించాలని మోడీ ప్రభుత్వానికి సలహాలు ఇస్తున్నాయి. వ్యవసాయ సంస్కరణలంటే వాటి దృష్టిలో భారతీయ వ్యవసాయాన్ని కంపెనీ వ్యవసాయంగా మార్చి స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు అప్పగించడమే.

ఇక నల్ల చట్టాల రద్దును ఆహ్వానించే వారు, రైతు పోరాట విజయాన్ని పండగ చేసుకునే వారు దీని పర్యవసానాలను గురించి పరిపరి విధాలా విశ్లేషిస్తున్నారు. 1990వ దశకంలో మన దేశంలో నూతన ఆర్థిక విధానాల పేరుతో నయా-ఉదారవాద విధానాలు ప్రవేశపెట్టిన తరువాత ఆ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం నిర్ణయాత్మక విజయం సాధించడం ఇదే ప్రథమం. దీని ప్రభావం రానున్న పోరాటాలపై తప్పక ఉంటుంది. అనేక రాజకీయ పరిణామాలకు కూడా ఇది కారణం అవుతుంది. అసంఘటితంగా ఉన్న రైతాంగం సంఘటితమై పాలక వర్గాల కుట్రలు, కుయుక్తులు, నిర్బంధాలు, దుష్ప్రచారాలను ఎదుర్కొన్న తీరు భావి పోరాటాలకు అనేక పాఠాలు నేర్పుతుంది.

ఈ విశ్లేషణలన్నీ ఒకెత్తు, ప్రముఖ ఆర్థిక వేత్త ప్రభాత్ పట్నాయక్ ఉద్యమ విజయంపై చేసిన విశ్లేషణ మరో ఎత్తు. వలస కాలం తరువాత వర్ధమాన దేశాల్లోని వనరులు, వ్యవసాయంపై మరోమారు పూర్తి ఆధిపత్యం సాధించడానికి సామ్రాజ్యం వాదం చేస్తున్న ప్రయత్నాలను తిప్పకొట్టడమే ఈ పోరాటం విజయం ప్రాధాన్యత అని ఆయన విశ్లేషించారు. లాటిన్ అమెరికా దేశాల్లో ప్రజలు సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రభుత్వాలను ఎన్నుకోవడం ద్వారా విజయాలు సాధిస్తే భారత దేశంలో దానికి భిన్నంగా ప్రత్యక్ష పోరాటం ద్వారా సాధించారు.

భారత ప్రజలు సాధించిన ఈ విజయాన్ని నిలుపుకోవాలంటే దేశంలో నయా-ఉదారవాద, మితవాద విధానాలకు ప్రత్యామ్నాయాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది. రైతాంగ పోరాట విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని అటువంటి ప్రజానుకూల ప్రత్యామ్నాయం ఏర్పాటుకోసం పట్టుదలగా పనిచేయడమే నేడు వామపక్ష ప్రజాతంత్ర శక్తులముందున్న ప్రధాన కర్తవ్యం.

ఈ మాసం ముఖ్యాంశం

# అసమ్మతి వ్యక్తీకరణ భారతీయ సంప్రదాయంలో భాగం

**ఉపిందర్ సింగ్**



**(ఉపిందర్ సింగ్ గతంలో ఢిల్లీ యూనివర్శిటిలో చరిత్ర శాఖాధిపతిగా పనిచేసి, ప్రస్తుతం అశోకా యూనివర్శిటిలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మాజీ ప్రధాని మన్‌మోహన్ సింగ్ చిన్న కుమార్తె అయిన ఉపిందర్ సింగ్‌కు చిన్నతనం నుండి పుస్తకాలపై మక్కువ. ఆమె దజను పుస్తకాలను రచించారు. ఆమె రచించిన ప్రాచీన 'భారతదేశం: విభిన్న సంస్కృతులు 'అనే పుస్తకాన్నిఈ మధ్యే ప్రచురించారు. భిన్న మతాలు ఆచరించడం, మతహింస లేదా స్త్రీల పట్ల ఉండే చులకన భావన వంటి విషయాలలో ప్రాచీనకాలానికి, ఈ నాటికి మధ్య పోలికలు ఉండడాన్ని ఈ పుస్తకం చదువుతున్న పాఠకులు గమనిస్తారు. ఉపిందర్ సింగ్‌తో ప్రముఖ పాత్రికేయులు జియా ఉస్ సలాం జరిపిన ఇంటర్వ్యూను మార్చిస్తు పాఠకులకు అందిస్తున్నాం- సంపాదకుడు.)**

**సమకాలీన భారతదేశంలో జరుగుతున్న సంఘటనలకు సంబంధించిన ఉదాహరణలు మీ పుస్తకంలో కనిపిస్తున్నాయి. ఉదాహరణకు పురాతన భారతదేశంలో భిన్న మతాలకు చెందిన వారు సామరస్యంతో జీవించారని, మతహింస కూడా చోటు చేసుకున్నదని చెప్పారు. దానిపై వివరణ ఇస్తారా?**

**జ:** ఈ రోజు జరుగుతున్న ప్రధానమైన సంఘటనలను చూసినప్పుడు గతం మన మదిలో మెదులుతున్నది. గతాన్ని సరైన రీతిలో అవగాహన చేసుకోడానికి శక్తినీ, సమయాన్నీ వెచ్చించ గలిగినప్పుడు, చరిత్రను గురించిన మన అవగాహనలో మార్పు వస్తుంది. ప్రాచీన భారతదేశంలో కొన్ని తీవ్రమైన ఉద్రిక్తతలు, వైరుధ్యాలు ఉన్న పరిస్థితులను నా పుస్తకంలో చిత్రించాను. సామాజిక అసమానతలు, సమానత్వం, కోర్కెలు, నిరాశ, దేవతలను పూజించటం, మహిళలను తక్కువగా చూడటం, హింస, అహింస, చర్చలు, పరస్పరం వ్యతిరేకమైన అభిప్రాయాలతో ఉండటం తదితరాలను గురించి వివరించాను.

దమ్మం, నిజమైన మతాన్ని విస్తరింపచేయటం, చర్చలు, అంగీకారానికి రావటంపై అశోకుని భావాలు చాలా గొప్పవి. కాని బలం ఉన్న రాజులు కూడా మతపరమైన రాజ్యాలను ఏర్పాటు చేయటానికి ప్రయత్నం చేయలేదు. వ్యక్తిగతంగా వారి మతభావాలు ఎలా ఉన్నప్పటికీ మతపరంగా విభిన్నమైన సమూహాలకు సహకారం అందించారు. ఈ విధానం సరైనది, అభినందించదగినది. కానీ హింసకు సంబంధించిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు శ్రీలంకలోని అనురాధపురం నుండి పాండ్యుల సైన్యం బుద్ధుని బంగారు విగ్రహాన్ని తీసుకురావటాన్ని గురించి బౌద్ధగ్రంథం శులవంశలో పేర్కొన్నారు. రాజేంద్ర చోళుని సైన్యం శ్రీలంకపై దాడిచేసినపుడు సాంప్రదాయక నిర్మాణాలు, బౌద్ధ సన్యాసులు నివసించే కేంద్రాలను ధ్వంసం చేశాయి. బంగారం, ఇతర విలువైన లోహాలతో చేసిన విగ్రహాలను దోచుకున్నారు. చోళరాజు రాజేంద్ర వాటిని దోచుకున్న తర్వాత చాళుక్యుల రాజధాని కల్యాణపురాన్ని దగ్ధం చేశారని అక్కడి రాతి దర్వాజాపై లిఖించారు. దేవుళ్ళ విగ్రహాలను దోచుకురావటం, మత నిర్మాణాలను తగులబెట్టటం యుద్ధంలో భాగం అన్న అంశాన్ని మనం గుర్తుంచుకోవాలి.

**మధ్య యుగాలలో ముస్లిం పాలకులు దేవాలయాలకు నష్టం కలిగించిన సంగతి మనకు తెలిసినదే. అలాగే ప్రాచీన కాలంలో భారతదేశంలోని వందలాది బౌద్ధ ఆరామాలను బ్రాహ్మణులు ధ్వంసం చేశారు. అధికారంలో ఉన్నవారి మతం ఇతర మతస్తులపై కఠినంగా వ్యవహరించే సంస్కృతి గల దేశమేనా మనది?**

**జ:** సాధారణంగా అతిశయోక్తులకు, తిరస్కరణలకు మధ్య వాస్తవాలు ఉంటాయి. అనేక ప్రాచీన గ్రంధాలలో మతహింసను గురించి ప్రస్తావించబడింది. ఉదాహరణకు పుష్యమిత్ర శుంగుడు బౌద్ధ కేంద్రాలుగా ఉన్న 84,000 స్థూపాలు ధ్వంసం చేసినట్టు, పాటలీపుత్రంలోని ఒక విహారంలో ఉన్న సన్యాసులందరినీ చంపినట్టు, బౌద్ధ సన్యాసి తలనరికి తెచ్చి ఇచ్చినవారికి వంద బంగారు నాణాలు బహుకరిస్తానని ప్రకటించినట్టు చెప్పబడింది. హూణ పాలకులు తోరమాణ్, మిహిరకులుడు బౌద్ధ సన్యాసులను హింసించేవారని చెప్పారు. పల్లవరాజు మహేంద్రవర్మ జైన మతస్థులను హింసించేవాడని చెప్పారు. ఒక పాండ్యరాజు 8,000 మంది జైనులను కొరత వేయించాడు. శంకరవర్మన్ 64 గుళ్లను దోచుకున్నట్టుగా కల్హణుడి

రాజతరంగిణిలో చెప్పబడింది. క్షేమగుప్తుడు శ్రీనగరలోని బౌద్ధారామాన్ని ధ్వంసం చేసి, ఆ శిధిలాలతో గుడిని కట్టించాడని చెబుతారు. లోహరా వంశానికి చెందిన హర్షుడు గుడులను దోచుకునేవాడనీ, దోచుకున్న సంపదలో విలువైన లోహాలతో చేసిన విగ్రహాలను కరిగించడానికి ఒక అధికారిని కూడా నియమించాడని నమోదు చేయబడింది.

**భారతదేశంలో సగటు పౌరుడికి ఔరంగజేబు గురించి తెలుసుగానీ, పుష్యమిత్ర శృంగుడు, మిహిరకులుడి గురించి ఎందుకు తెలియదు?**

**జ.** చారిత్రిక పురుషులు (ఔరంగజేబుతో సహా) కనిపించేటంత సాధారణంగా ఉండరు. చరిత్రకారులకు ఈ విషయాలన్నీ బాగా తెలుసు. అయితే దిగువస్థాయి ప్రజల వరకు చరిత్ర చేరటం కష్టమైన విషయం. చరిత్రకి కూడా రాజకీయ కోణం ఉంటుంది. ఈ నాడు రాజ్యం చరిత్రకు కొత్త రూపాన్ని ఇచ్చి విద్యారంగం, ప్రజలలో ప్రచారం చేయటం ద్వారా రాజకీయ లబ్ది పొందాలని గట్టి ప్రయత్నం చేస్తున్నది. చరిత్ర, రాజకీయ ప్రచారం రెండూ భిన్నమైన అంశాలు. ఆ రంగంలో నిష్ణాతులైన చరిత్రకారులకు చరిత్రను వదిలేయాలి. అదొక రాజకీయ పార్టీ అజెండాగా ఉండకూడదు.

**ఈ మధ్యకాలంలో మతాన్ని గురించి చేసిన వ్యాఖ్యానాలపై కొందరు వ్యక్తులు తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఒక బట్టల వ్యాపారి ప్రచురించిన దీపావళి ప్రకటనను గురించి నేను మాట్లాడుతున్నాను. ఇదివరకు కూడా మధ్యప్రదేశ్‌లో ఒక వ్యంగ్య కళాకారుడు బిజెపి నాయకునిపై చేసిన వ్యాఖ్యల కారణంగా అరెస్టు చేయబడ్డాడు. మతాన్ని లేదా రాజకీయ నాయకులను విమర్శించడం పట్ల మనం గత చరిత్రలోనూ ఇంతే అసహనంగా ఉన్నామా ?**

**జ:** అన్ని రంగాలలోని ప్రజలు– చిత్ర నిర్మాతలు, రచయితలూ, చరిత్రకారులు, కళాకారులూ దాడికి గురవుతున్నారు. ఇది స్వేచ్ఛాయుతమైన ఆలోచనలకి, సృజనాత్మకతకి అవరోధం కలిగిస్తుంది. అందువలన రచయితలు, కళాకారులూ స్వయంగా నిషేధాన్ని విధించుకునే స్థితికి చేరుకుంటారు. లేదా పాలకుల వ్యతిరేకతను ఎదుర్కోవలసిన స్థితి ఏర్పడుతుంది.

ప్రాచీన భారతదేశంలో మతం ఒక ప్రధానమైన అంశం అయినప్పటికీ, దానిపై వ్యంగ్యాస్త్రాలు సంధించే సంప్రదాయం కూడా ఉండేది. ఉదాహరణకి మత్తవిలాస ప్రహసన, భగవదజుక్కుమ్ ప్రహనాలను తీసుకుందాం. న్యాయ తాత్వికుడు, గౌరవనీయ బ్రాహ్మణుడు అయిన జయంత భట్టు రచించిన అగమదాంబర అనే సంస్కృత నాటకం తీవ్రమైన తాత్విక చర్చలు, మతం పట్ల వ్యంగోక్తులు, వివిధ మతాలకు చెందినవారు ఉన్న రాజ్యాన్ని పరిపాలిస్తున్న తీరును ప్రతిబింబిస్తుంది. క్షేమేంద్ర రచనలలో కూడా చాలా వరకు సామాజిక, మతపరమైన వ్యంగోక్తులు కనిపిస్తాయి.

ప్రాచీన భారతదేశంలో సుదీర్ఘమైన, సజీవమైన తాత్విక చర్చలు జరిగే సంప్రదాయం ఉంది. వివిధ విషయాలపై, ఉదాహరణకు ధర్మం, వాస్తవికత, ఉనికి, నైతికత, సంసార బంధాల నుండి విముక్తి వంటి విషయాల స్వభావంపై గంభీరమైన చర్చలు, వాదోపవాదాలు అసమ్మతుల వ్యక్తీకరణ జరుగుతుండేవి. ఉదాహరణకు మహాభారతాన్ని తీసుకోండి. దానిలో వివిధ అంశాలపై చర్చలు జరిగాయి. దీనిని గుర్తించాలి. ప్రశంసించాలి కూడా. అయితే ఆ చర్చలు ఎల్లప్పుడూ విశాల హృదయంతో, సహనశీలంగా జరిగాయని అనలేం. సాధారణంగా పైచేయి సాధించాలని, గొప్పతనం చాటుకోవాలని, తనకే పట్టుందని నిరూపించుకోవాలని, ప్రత్యర్థి ఆలోచనల కన్నా, లేదా పరిపక్వత కన్నా తనను ఉన్నతునిగా చూపుకోవాలనే లక్ష్యంతో జరిగేవి. రెండో విషయం ఈ చర్చలన్నీ ఉన్నత తరగతులు, ఉన్నత వర్గ పురుషుల మధ్యే జరిగేవి.

**ప్రాచీన భారతదేశంలో సాధారణంగా కులంలోపల జరిగే వివాహాలతో వర్ణాలు ఏర్పడేవి. తమకన్నా ఎక్కువ కులాలు, తక్కువ కులాలలో పెళ్ళి చేసుకోవటానికి మహిళలకు, పురుషులకు వేర్వేరు ప్రమాణాలు ఉండటం ఆసక్తికరమైన విషయం. లింగ సంబంధాలు, సమాజంలో మహిళలకు ఉన్న స్థానాన్ని గురించి ఇది ఏమి సూచిస్తుంది?**

**జ:** ప్రాచీనకాలంలో వర్ణ సంకరాన్ని భయంకరమైనదిగా భావించినప్పటికీ, నాలుగు వర్ణాలూ తప్పనిసరిగా కులంలోనే వివాహం చేసుకోవాలని చెప్పలేదు. ఉన్నత వర్ణంలోని పురుషుడు కింది వర్ణంలోని స్త్రీ ని వివాహం చేసుకోడాన్ని (అనులోమ వివాహాలు) ధర్మ శాస్త్రాలు అంగీకరించాయి. అందుకు విరుద్ధంగా కింది వర్ణంలోని పురుషుడు పై వర్ణంలోని స్త్రీని వివాహం చేసుకోవటాన్ని (ప్రతిలోమ వివాహాలు) అంగీకరించలేదు.

సజాతి వివాహాలతోనే కులం లేదా జాతి కొనసాగుతాయనడం నిజమే. లైంగిక సంబంధాలు, మహిళల పునరుత్పత్తి సమర్థతల పై అదుపు లేకపోతే కుల వ్యవస్థపై నియంత్రణ సాధ్యంకాదు. మహిళలను నియంత్రించాలని, కుటుంబానికే పరిమితం చేయాలని, ఒక పద్ధతి ప్రకారం నడుచుకుంటూ అణకువగా, వినయంగా ఉంచాలని చేసే ప్రయత్నాలు పెరుగుతూ వచ్చాయనే విషయాన్ని ప్రాచీన కాలం నాటి చాలా గ్రంధాలు తెలియచేస్తున్నాయి. ఈ విధానాలకు సరిపోయే విధంగా ఈ రోజు భారతదేశంలో ప్రచారమౌతున్న భావాలు ఉండటం శోచనీయం. అయితే ఇప్పటిలాగానే అప్పుడు కూడా ఈ హద్దులకు కట్టుబడి ఉండని, తమకు నచ్చిన దారిలో పయనించిన మహిళలు ఉన్నారు.

ప్రాచీన భారతదేశంలో 'మహిళల స్థానం' గురించి కేవలం ఒక సాధారణ ప్రస్తావనగా మాట్లాడితే పైపైన చూడటం మాత్రమే అవుతుంది. చరిత్రలో ఒక్క భారతదేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా, అన్ని సమాజాలలోనూ మగవారి ఆధిపత్యం, మహిళల విధేయత కొనసాగాయి. ఏ కాలంలోనూ మహిళలందరూ మూసపోతగా ఒకే స్థాయిలో లేరు. వారి అనుభవాలు, తరగతి, కులం, ఆర్థిక స్తోమత, రాజకీయ పలుకుబడిని బట్టి వారిస్థాయి మారుతూ ఉన్నది. వారు ఎంత వరకు అణచిపెట్టబడి ఉన్నారనేది పైన చెప్పబడిన అంశాలు, కుటుంబ సంబంధాలలో వారి స్థానంపైనా ఆధారపడి ఉండేది.

**సాధారణ పౌరులకు సంబంధించినంతవరకు ఆనాటి ప్రతిలోమ వివాహమే ఈనాటి లవ్ జిహాద్, అంటే దళిత పురుషుడు ఒక ఉన్నత కులం మహిళను వివాహం చేసుకోవడం అని మీరు ఒప్పుకుంటారా?**

**జ:** ఇవి భిన్నమైన విషయాలు. ప్రాచీనకాలం నాటి ప్రతిలోమ వివాహాల ఆలోచన వర్ణం లేదా పారంపర్యంగా వచ్చిన వర్గం ఆధారంగా ఏర్పడ్డది. ఈనాడు వాడుకలో ఉన్న లవ్ జిహాద్ అనేది ఒక దుష్టకల్పన. మతాంతర వివాహాలు జరగకుండా చేయడానికి హిందుత్వవాదులు దీనిని ఈ మధ్యనే ప్రచారంలోకి తీసుకువచ్చారు.

వివాహాన్ని నియంత్రణ చేయడం కోసం సామాజిక హద్దులు నిర్ణయించటం రెండింటిలోనూ మనకు కనిపించే ఒకే ఒక ఆసక్తికరమైన అంశం. అంతేకాదు, రెండింటిలోనూ మహిళలకు ప్రత్యేకమైన గుర్తింపు, స్వతంత్రత లేదు. ఆమె పెళ్లి చేసుకున్న భర్త ద్వారా గాని, కుటుంబం ద్వారా గాని గుర్తింపు పొందాలి. కొందరు ఉన్నతవ్యక్తుల భావన అయిన 'ఆదర్శవంతమైన సమాజం' కోసం మహిళల లైంగిక స్వేచ్ఛ,

పునరుత్పత్తిని నియంత్రించటం చరిత్ర అంతటిలోనూ మనం చూస్తాం.

**మహాభారతం, రామాయణాలలో కులాల ప్రస్తావన ఉంది గాని సంగం కావ్యాలలో లేదు. అటువంటిది దక్షిణ భారతదేశంలో కులం ఇంత పెద్ద ఎత్తున ఎలా విస్తరించింది ?**

**జ:** తమిళ సంగం కావ్యంలోని పద్యాలలో పేర్కొన్న సామాజిక పరిస్థితులకు, ఉత్తర భారతదేశం గురించి సంస్కృత గ్రంథాలలో చెప్పిన వాటికి చాలా తేడాలు ఉన్నాయి. ఈ పద్యాలలో బ్రాహ్మణుల గురించిన ప్రస్తావన ఉంటుంది గాని చాతుర్వర్ణ వ్యవస్థ ప్రభావం కనిపించదు. ప్రాచీన తమిళ సమాజం కుల ప్రాతిపదికన కాకుండా 'కుతి' అని పిలువబడే వారసత్వ సమూహాలపై ఆధారపడి ఉండేది. ఇక్కడ పవిత్రత, అపవిత్రాలు, సామాజికంగా ఉన్నత, దిగువస్థాయి ఉండేవి కాని అంటరానితనం లేదు. కులాంతర వివాహాలపై నిషేధం, సహపంక్తి భోజనాలు చేయకూడదనే ఆచారాలు కనిపించవు. నిజానికి ఆ తరువాతి కాలంలో అంటరాని వారిగా పరిగణించబడిన కులాలు సంగం కావ్యాలలో గౌరవనీయమైన స్థానాన్ని పొందారు.

దక్షిణ భారతదేశంలో మూడు, ఆరు శతాబ్దాల మధ్యకాలంలో కులాలు, అంటరానితనం ప్రవేశించాయి. పల్లవుల కాలంలో, అంటే ఆరు, తొమ్మిది శతాబ్దాల మధ్య ఇవి స్పష్టంగా రూపుదిద్దుకున్నాయి. అంటరానివారికి ఆలయ ప్రవేశం కల్పించరాదని భక్తి ఉద్యమకారులు చెప్పారు. బ్రాహ్మణులకు రాజుల ప్రాపకం పెరగడం, దక్షిణ భారతదేశంలో కులం, అంటరానితనం విస్తరించటం ముడిపడి ఉన్నాయి. అయితే కులం చరిత్ర మొదటి దశకు సంబంధించి పూర్తి సమాచారం లేదు.

**మీరు ప్రాచీన భారతదేశంలోని ఉషా, అతిథి, పృథ్వీ మొదలైన దేవతల గురించి మాట్లాడారు. అయినా వారు కూడా పురుషులు కేంద్రంగానే ఉండేవారు. ఈ అసంబద్ధతను ఎలా చూడాలి? పురుషులు కేంద్ర బిందువుగా ఉండే ఇటువంటి సంప్రదాయం వల్లనే మనం రాధను కృష్ణుడితో కలిపే చూస్తాము గాని ప్రత్యేకమైన దేవతగా చూడడం లేదా ?**

**జ:** భారతదేశంలో స్త్రీ దేవతలను కొలవడం వారి ప్రాధాన్యతను తగ్గించడాన్ని కాక పెరగడాన్ని సూచిస్తుంది. భారతదేశంలో మహిళలలో దైవత్వాన్ని చూడడం అనాదిగా వస్తున్నదే. సామాజిక తరగతులు ఏవైనప్పటికీ, " స్త్రీ దేవతా సంస్కృతి" ప్రజల నమ్మకాలలో, ఆచారాలలో బలంగా నాటుకుని ఉన్నది. మహిళలను దేవతలుగా పూజించే సంస్కృతి కేవలం హిందూమతంలోనే కాక బౌద్ధ, జైన మతాలలో కూడా బలంగా ఉన్నది. హిందు ఆది దేవుళ్ళ సహభాగినులకు ప్రాధాన్యత ఉండడమే కాదు, దుర్గ వంటి స్వతంత్రమైన దేవతలు కూడా ఉన్నారు. అయితే స్త్రీ దేవతా మూర్తులను కొలవడంతో పాటు సమాంతరంగా మహిళల అణచివేత కూడా కొనసాగటం ఆశ్చర్యం కలిగించదు.

ప్రాచీన భారతదేశంలో స్త్రీ, పురుషుల సంబంధాలు క్లిష్టంగా ఉండేవి. మహిళలు గృహ పరిధిలో అణకువగా ఉండాలని, జీవితంలోని వివిధ దశలలో తండ్రి, భర్త, కొడుకుపైన ఆధారపడాలని మనుస్మృతి చెపుతున్నప్పటికీ, భిన్నమైన పరిస్థితులు కూడా ఉన్నాయని ఇతరంగా లభిస్తున్న సమాచారం వెల్లడిస్తున్నది. మహిళలు మతసంస్థలకు భూరి విరాళాలు ప్రకటించినట్లు వందలాది శిలా శాసనాలు తెలుపుతున్నాయి. రాచకుటుంబాలలో మహిళలకు ఎటువంటి ప్రాధాన్యత ఉండేదో 'అర్థశాస్త్రం' వంటి గ్రంథాలలో మనకు కనిపిస్తుంది. అలాగే ప్రభావతి గుప్త, దిద్ద వంటి రాణుల ఉదాహరణలు చూడవచ్చు. మహిళలు సంసార జీవితాన్ని పరిత్యాగం చేసి మతాలలో చేరడం బౌద్ధ, జైన గ్రంథాలలో కనిపిస్తుంది. ఆండాళ్, అక్కమహాదేవి సాంప్రదాయక మహిళల జీవితాన్ని విడనాడి ఉన్నతంగా పరిగణించే ఆధ్యాత్మిక చింతన మార్గాన్ని అనుసరించారు. అందువలన ఇదో కలగాపులగంగా, క్లిష్టంగా కనిపించే చిత్రం. అక్కడ అణచివేతతో పాటు సామరస్యం కూడా ఉన్నది.

**ప్రాచీన భారత గ్రంథాలలో మోహం, ప్రేమ కనిపిస్తాయని మీరు రాశారు. కానీ భారతీయ సంస్కృతి పేరుతో వాలంటైన్స్ డే రోజు ప్రభుత్వానికి అతీతంగా మోరల్ పోలీసింగ్ పేరుతో పర్యవేక్షణచేస్తున్న ఉదాహరణలు లెక్కలేనన్ని ఉన్నాయి. అసలు భారతదేశ సంస్కృతి అంటే ఏమిటి?**

**జ:** మనం "హిందు సంస్కృతి" అని సాధారణంగా చెప్పుకునేది ఒకేవిధమైనది గానీ, వైవిధ్యతలు లేనిది గాని కాదు. ఇందులో వివిధ ప్రవంతులు ఉన్నాయి. ఇది వైవిధ్య భరితమైనది. కొత్తవాటిని నిరంతరంగా తనలో ఇముడ్చుకుంటూ, మారుతూ ఉంటుంది. వివిధరకాల ఆటుపోట్లకు గురైనది కూడా.

ప్రాచీన కాలంలోని ప్రేమ, లైంగికతలను గురించి నా పుస్తకంలోని ఒక ప్రకరణంలో చర్చించాను. తమిళ, ప్రాకృతిక, సంస్కృత సాహిత్యంలో ప్రేమ, కోరికలను వ్యక్త పరచడం గురించి చాలా విపులంగా వర్ణించారు. కామశాస్త్ర కోవిదులు లైంగిక ఆనందాన్ని గురించి కామసూత్రలో విశ్లేషించారు. మానవ శరీరానికి సంబంధించిన వివిధ రూపాలను శిల్పాలలో (ప్రధానంగా గుడులలో కనిపిస్తాయి) శిల్పులు తీర్చిదిద్దారు. ఆనందం మానవ జీవన పరమావధిగా గుర్తించబడింది. దానిని సరైన మోతాదులో పొందాలనీ, ధర్మార్థ మోక్షాలను సమతుల్యంలో అనుసరించాలని సూచించడం జరిగింది. కేవలం దేవునిపై మాత్రమే అవధులు లేని ప్రేమ ఉండడం న్యాయమని భావించేవారు. దేవునికి, భక్తునికి మధ్య ఉన్న ప్రేమ పరస్పరమైనదిగా, లోతైనదిగా, ఘనమైనదిగా, ఉన్నత ఆధ్యాత్మిక లక్ష్యాన్ని చేరడానికి మార్గంగా భక్తి కావ్యాలలో చెప్పారు.

జీవితాన్ని విభిన్నమైన కోణాల నుండి చూసే ఇటువంటి శక్తివంతమైన తాత్విక చింతనలు, కోర్కెలే కష్టాలకు మూలమని, భవబంధాలని, అవే కట్టి పడేస్తాయని, వాటిని వదులుకోవాలని నమ్మే మత సాంప్రదాయాలు కలిసి మనుగడ సాగించడమే ఆసక్తికరమైన అంశం.

**పాలకులు అసహనంతో ఉన్న సమాజంలో క్రూరంగా, అన్యాయంగా పరిపాలించే రాజులు తమకు తామే శత్రువులని కౌటిల్యుడు అనడం ఎంతవరకు సమంజసం? కౌటిల్యుడి పేరును ప్రసార మాధ్యమాలు యధేచ్ఛగా, బాధ్యతరహితంగా వాడుకోవటం నేనీ ప్రశ్న అడగడానికి కారణం.**

**జ:** కౌటిల్యుడి అర్థశాస్త్రం నిజంగానే ఎంతో క్లిష్టమైన గ్రంథం. దానిలోని క్లిష్టమైన అంశాలను సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నారు. క్రూరంగా, అన్యాయంగా పరిపాలించే రాజులు ప్రకృతి కోపం, ప్రజల ఆగ్రహం వలన తగిన శిక్ష అనుభవిస్తారని చెప్పడం ప్రాచీనకాలంలోని సామ్రాజ్యాధిపతులకన్నా ఈ నాటి పాలకులకు బాగా వర్తిస్తుంది. దాదాపు 2,000 ఏళ్ల నాటి గ్రంథంలో ఇంత సూక్ష్మబుద్ధితో ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకోవటం, ఈ నాటికీ మనకు ఆ విషయాలను గురించి చెబుతుండటం అద్భుతమని భావిస్తున్నాను.

**(అనువాదం: కె ఉషారాణి)**

కమ్యూనిస్టు ఉద్యమ ఆటుపోట్లు - శాస్త్రీయ అవగాహన -5

# సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ నిర్మాణమే నేటి ప్రధాన సమస్య



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి

**తమ్మినేని వీరభద్రం**

రెండవ ప్రపంచ యుద్ధంలో అనేక తూర్పు యూరప్ దేశాలలో అతర్యుద్ధం ద్వారా సోషలిస్టు విప్లవాలు విజయవంతమై ప్రపంచ సోషలిస్టు శిబిరం ఏర్పడిన విషయం మనం గత సంచికలో చర్చించాం. అక్టోబర్ సోవియట్ సోషలిస్టు విప్లవం ప్రపంచంలో అనేక విముక్తి పోరాటాలకు స్ఫూర్తి కలిగించింది. తర్వాత జరిగిన అనేక విప్లవోద్యమాలు, విముక్తి పోరాటాలకు అది చోదకశక్తిగా నిలిచింది. పెట్టుబడిదారీ విధానంలో ఊహించలేని విధంగా, వర్గదోపిడీకి అవకాశం లేని వ్యవస్థను అది ప్రపంచం ముందు నిలిపింది. శ్రామికులకు అనేక హక్కులను ప్రసాదించింది. ప్రజలందరికీ తిండి, గుడ్డ, ఇల్లు, విద్య, వైద్యం గ్యారంటీ చేసింది. పురుషులతో బాటు మహిళలను ఉత్పత్తిలో సమాన భాగస్వాములను చేసింది. జాతుల సమానత్వాన్ని అమలు జరిపింది. అలాగే ఎంతో వెనకబడిన ఆర్థికవ్యవస్థ ఆధునిక పారిశ్రామిక రాజ్యంగా అవతరించింది. మిలటరీ రంగంలో అమెరికన్ సామ్రాజ్య వాదులకు దీటుగా ఎదిగింది. ఈ విజయాలన్నీ సోషలిజం ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పాయి.

యుద్ధంలో ఫాసిస్టు శక్తులను ఓడించటంలో సోవియట్ యూనియన్ నిర్వహించిన వీరోచిత పాత్ర, యుద్ధానంతరం సోషలిస్టు శిబిర ఆవిర్భావం ప్రపంచంపైన పెద్ద ప్రభావాన్ని కలిగించింది. ఆ తర్వాత 1949లో చైనా విముక్తి సాధించి సోషలిస్టు పథంలో అడుగు పెట్టింది. ఈ విప్లవం జాతీయ విముక్తి పోరాటాలు సాగిస్తున్న అనేక దేశాల విప్లవ శక్తులకు ఉత్తేజం కలిగించింది. సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా వియత్నాం ప్రజల వీరోచిత పోరాటం, కొరియా ప్రజల తిరుగుబాటు, క్యూబా విముక్తి ప్రపంచ శ్రామికశక్తులకు ఉత్తేజం కలిగించాయి. ఫాసిజం ఓటమి తర్వాత లభించిన ఈ విజయాలు ప్రపంచ వర్గశక్తుల బలాబలాలు సోషలిజం వైపుకు మొగ్గుతున్నాయనే అభిప్రాయాన్ని కలిగించాయి. అందుకే 1957లో, 60లో జరిగిన ప్రపంచ కమ్యూనిస్టు పార్టీల సమావేశాలు ఇది సోషలిస్టు యుగమనే అంచనాలు వేశాయి. తరువాతి కాలంలో కమ్యూనిస్టు ఉద్యమం అనేక తప్పిదాలు చేయటానికి ఈ అతి అంచనాలు కారణమయ్యాయి.

ప్రపంచ కమ్యూనిస్టు దేశాలు చేసిన ఈ తీర్మానాలు పెట్టుబడిదారీ విధానం తన సంక్షోభాల నుండి బయటపడే సామర్థ్యాన్ని తక్కువ అంచనా వేసాయి. మారిన పరిస్థితుల కనుగుణంగా పెట్టుబడిదారీ విధానం తనను తాను మార్చుకోగల శక్తిని ఇంకా కలిగి ఉన్నదనీ, ఉత్పత్తిశక్తుల పెరుగుదలను మరికొంత కాలం కొనసాగించగలదనీ అంచనా వేయలేక పోయాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ శక్తి సామర్థ్యాలను తక్కువ అంచనా వేయటంతోపాటు, సోషలిస్టు వ్యవస్థ నిర్మాణంలో జరిగిన తీవ్రమైన పొరపాట్లు ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి పెద్ద ఎదురుదెబ్బగా పరిణమించాయి. తుదకు 70 సంవత్సరాల సోషలిజం ఓటమిపాలై సోవియట్ యూనియన్, తూర్పుయూరప్ దేశాలలో తిరిగి పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరించబడింది.

సోషలిజం నిర్మించటం అంటే ప్రైవేటు ఆస్తిని క్రమంగా రద్దు చేస్తూ అంతిమంగా ఉత్పత్తి సాధనాలన్నింటిపైనా సమిష్టి యాజమాన్యాన్ని సాధించటమే. అయితే ఈ ప్రక్రియ వేగంగా, సూటిగా జరిగేది కాదు. పైగా రష్యాలాంటి వెనకబడిన వ్యవసాయ అర్థికవ్యవస్థలో వ్యక్తిగత ఉత్పత్తి పద్ధతులను సామూహిక సోషలిస్టు పద్ధతికి మార్చటం ఎంతో కష్టభరితమైనది. పైగా అప్పటికే ఆధునిక సాంకేతికతలను ఎంతో అభివృద్ధి చేసిన ధనిక పెట్టుబడిదారీ దేశాలు సోషలిజాన్ని మొగ్గలోనే తుంచేసే ప్రయత్నంలో ఉన్న నేపథ్యంలో, ఆ దేశాల వ్యతిరేకతను తట్టుకుని అంతర్గత వనరుల ద్వారానే ఈ అభివృద్ధి సాధించటం అంత తేలిక కాదు.

కార్ల్ మార్క్స్ ఊహించినట్లుగా అభివృద్ధి చెందిన ధనిక పెట్టుబడిదారీ దేశాల్లో ఏ ఒక్క దేశంలోనూ సోషలిస్టు విప్లవం సాధించబడలేదు. వెనకబడిన ఆర్థికవ్యవస్థలు గల దేశాలలో సాధించిన సోషలిస్టు విప్లవాలు ధనిక పెట్టుబడిదారీ దేశాల మార్కెటును కొంత కుదించగలిగినా, వాటి ఉత్పాదక సామర్థ్యంపైన ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాయి. పైగా రెండవ ప్రపంచయుద్ధం తర్వాత సాధించిన శాస్త్ర, సాంకేతికాభివృద్ధితో పెట్టుబడిదారీ ప్రపంచం తన మార్కెట్‌ను భారీగా విస్తరించుకోగలిగింది. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధితో పేద దేశాలను దోపిడీ చేయటం తీవ్రమైంది. వలస దేశాలనేకం విముక్తి సాధించినా నయా–వలస విధానంతో ఆ దేశాలను ధనిక పెట్టుబడిదారీ దేశాలు యథేచ్ఛగా దోచుకున్నాయి. అలాగే తమ అభివృద్ధికి అవసరమైన వ్యూహాత్మక మార్పులను పెట్టుబడిదారీ విధానం అనుసరించింది. ముఖ్యంగా సోషలిస్టు శిబిరం ఏర్పడి పెద్దఎత్తున సంక్షేమ విధానాలను అమలు జరుపుతున్న నేపథ్యంలో పెట్టుబడిదారీ దేశాలు కూడా అనేక సంక్షేమ చర్యలకు, పథకాలకు, కార్మిక అనుకూల చట్టాలకు అవకాశం కల్పించాయి. ఆ విధంగా 'సంక్షేమ రాజ్యాలు' ఏర్పర్చి అక్కడి ప్రజలు సోషలిజం వైపు ఆకర్షించబడకుండా నిరోధించగలిగాయి. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న జాతీయ విముక్తి పోరాటాలతో కమ్యూనిస్టుల అనుబంధాన్ని తెంచివేయటటానికి అనేక దేశాలకు రాజకీయ స్వాతంత్ర్యాన్ని ప్రకటించాయి.

ఒకవైపు పెట్టుబడిదారీ శక్తులు మారిన పరిస్థితుల కనుగుణంగా తమను తాము

**❝ ఒకవైపు పెట్టుబడిదారీ శక్తులు మారిన పరిస్థితుల కనుగుణంగా తమను తాము మార్చుకుంటూ దోపిడీ, ఆధిపత్యాలను నిలుపుకోవటానికి ప్రయత్నిస్తుండగా, మరోవైపు సోషలిస్టు శక్తులు అనుభవ లేమితో, తప్పు అంచనాలతో తమ శక్తిని కుదించుకున్నాయి. ఆటంకాలు ఏర్పర్చుకున్నాయి. సామ్రాజ్యవాదులకు దీటుగా ఆయుధశక్తిని సమకూర్చుకోవాల్సిన పరిస్థితి వల్ల ఆర్థిక వనరులలో అధికభాగాన్ని అందుకు కేటాయించాల్సి రావటంతో నిత్యావసర వస్తువుల్ని నాణ్యంగా తయారు చేయటంలో సోవియట్ వెనుకబడింది. ❞**

మార్చుకుంటూ దోపిడీ, ఆధిపత్యాలను నిలుపుకోవటానికి ప్రయత్నిస్తుండగా, మరోవైపు సోషలిస్టు శక్తులు అనుభవ లేమితో, తప్పు అంచనాలతో తమ శక్తిని కుదించుకున్నాయి. ఆటంకాలు ఏర్పర్చుకున్నాయి. సామ్రాజ్య వాదులకు దీటుగా ఆయుధ శక్తిని సమకూర్చుకోవాల్సిన పరిస్థితి వల్ల ఆర్థిక వనరులలో అధికభాగాన్ని అందుకు కేటాయించాల్సి రావటంతో నిత్యావసర వస్తువులను నాణ్యంగా తయారు చేయటంలో సోవియట్ దేశం వెనుకబడింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన లేమి కూడా ఇందుకు కారణమైంది. ఆర్థికవ్యవస్థ సాపేక్షంగా మాంద్యానికి గురైంది. ప్రజల అసంతృప్తి పెరిగింది.

ఈ పరిస్థితిని చక్కదిద్దటానికి సోవియట్ కమ్యూనిస్టు పార్టీ కొన్ని సంస్కరణలకు పూనుకుంది. పెరిస్త్రోయికా, గ్లాస్‌నాస్త్ పేరుతో తేబడిన ఈ సంస్కరణలు 1985లో ప్రారంభించబడి, 1986లో జరిగిన ఆ పార్టీ 27వ మహాసభలో తుదిరూపం పొందాయి. సోషలిస్టు ఆర్థికవ్యవస్థ ప్రతిష్టంబనకు దారితీసిన పొరపాట్లను సరిదిద్దటానికి, అనేక సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేయబడిన సోషలిస్టు చైతన్యాన్ని ప్రజలకందించటానికి, పౌరహక్కులు, ప్రజాస్వామ్యం భగ్నం కావటానికి కారణమైన అధికార దర్పాలను తొలగించటానికి, సోషలిస్టు ప్రజాస్వామ్యాన్ని బలపరచి, సామాజికార్థికాభి వృద్ధిని వేగవంతం చేయటానికి ఈ సంస్కరణలు అవసరమని చెప్పబడింది.

కానీ ఈ సంస్కరణలు ఆ రూపంలో అమలు జరగలేదు. సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 27వ మహాసభలో చేసిన తీర్మానాలకు భిన్నంగా గోర్బచెవ్ నాయకత్వంలో సోవియట్ పార్టీ సోషలిజం నిర్మాణంలో తలెత్తిన సమస్యలకు పెట్టుబడిదారీ పరిష్కారాలు అమలు జరిపింది. సోషలిజం సాధించిన అనేక గొప్ప విజయాలను, గత వీరోచిత చరిత్రను విస్మరించటం, విమర్శించటం ప్రారంభించింది. సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 27వ మహాసభలో "ప్రపంచంలోని ప్రధాన వైరుధ్యాలు నాలుగూ తీవ్రమవుతున్నాయని చెప్పింది (1. సోషలిజానికి – సామ్రాజ్య వాదానికి, 2. సామ్రాజ్యవాదానికి – మూడో ప్రపంచ దేశాలకు, 3. సామ్రాజ్యవాదులకు – సామ్రాజ్యవాదులకు మధ్య, 4. పెట్టుబడిదారీ దేశాలలో పెట్టుబడికి – శ్రమకు మధ్య). ఈ అవగాహనను ఆ మరుసటి సంవత్సరమే తిరగదోడారు. 1988లో 'కొత్త ఆలోచనలు' పేరుతో రూపొందించిన డాక్యుమెంట్‌ను 28వ మహాసభలో ఆమోదింపజేసారు. ఇందులో "మానవతా, ప్రజాస్వామ్య సోషలిజా"న్ని ప్రతిపాదించారు. విశ్వవ్యాప్త మానవ విలువలను వర్గ విలువలకు పోటీగా ప్రతిపాదించారు. సామ్రాజ్యవాదంతో ఘర్షణ కాకుండా కలిసి జీవించాలని ప్రబోధించారు. 28వ మహాసభలో ప్రవేశపెట్టిన కార్యక్రమ డాక్యుమెంట్‌లో ఈ వర్గసంకర విధానం మరింత పరాకాష్టకు చేరింది. దానిలో "ప్రపంచ అభివృద్ధిలో భాగంగా రూపొందిన ఆధునిక నాగరికత వర్గ వైరుధ్యాలను నిరాకరిస్తుంది. పరస్పర వ్యతిరేక వర్గాల భావనను వ్యతిరేకిస్తుంది. పెట్టుబడి, శ్రమ ఘర్షణను, సామాజిక విప్లవాలను అంగీకరించదు" అని పేర్కొన్నారు. ఈ విధంగా సోవియట్ కమ్యూనిస్టు పార్టీ తన విప్లవోద్యమ ఘన చరిత్రకు, సోషలిస్టు విజయాలకు తిలోదకాలిచ్చే వర్గసంకర రాజకీయ ప్రయాణం పూర్తయింది. 70 సంవత్సరాల శ్రామిక వర్గ రాజ్యం ఈ కుట్రలకు బలైంది. ఏ ప్రతిఘటనా లేకుండానే సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాల ప్రభుత్వాలు పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించాయి. ఈ మార్పుతో సహజంగానే అనేక జాతుల సమూహంగా ఉన్న సోవియట్ దేశం అనేక ముక్కలుగా కూడా విడిపోయింది.

సోవియట్ యూనియన్, తూర్పుయూరప్ దేశాలలో జరిగిన ఈ పరిణామాలు సోషలిజం నిర్మించే పద్ధతులకు సంబంధించిన అనేక ప్రశ్నలను ముందుకు తెచ్చాయి. వీటి నుండి సరైన పాఠాలు తీయాలంటే ఈ వైఫల్యాలకు దారితీసిన పరిస్థితులేమిటో, ప్రధాన కారణాలేమిటో మనం పరిశీలించాల్సి ఉంటుంది. అయితే ఒక విషయం మన గమనంలో ఉండాలి. అదేమిటంటే సోషలిజం ఎలా నిర్మించాలనేది ఎక్కడా ఒక రోడ్ మ్యాప్ గీయబడలేదు. సోషలిజం అంటే ప్రైవేటు ఆస్తి లేని ఒక సమాజం అనే నిర్వచనం, ఆ స్థితికి చేరుకోవటానికి కార్మికవర్గ నాయకత్వంలోని ప్రభుత్వం దీర్ఘకాలం కృషి చేయాల్సి ఉంటుందనే సాధారణ అవగాహన మాత్రమే కమ్యూనిస్టు ఉద్యమం కలిగి ఉంది. అందువల్ల సోషలిజం నిర్మించే ప్రయోగంలో కొన్ని తప్పులు దొర్లటం సహజమే కావచ్చు. అయితే ఆ తప్పులను సకాలంలో గ్రహించి దిద్దుకునే సైద్ధాంతిక సామర్థ్యాన్ని కమూనిస్టు పార్టీలు కోల్పోవటం, తుదకు దశాబ్దాల శ్రామికోద్యమాల ఫలితమైన సోషలిస్టు వ్యవస్థ కనీస ప్రతిఘటన లేకుండానే కనుమరుగు కావటం అత్యంత విషాదకర పరిణామం. ప్రస్తుత ప్రపంచంలో సోషలిజాన్ని నిర్మించటంలో ఎదురవుతున్న సమస్యలే కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రధాన ఆటంకంగా ఉన్నాయి. అయితే సోషలిజాన్ని నిర్మించటంలో ఈ దేశాలలో వచ్చిన చేదు అనుభవాలను విశ్లేషించి శాస్త్రీయ నిర్ధారణలకు వచ్చే ప్రయత్నం నేడు జరుగుతోంది.

**సోషలిజంలో ప్రభుత్వ వర్గ స్వభావం :** సోషలిస్టు ప్రభుత్వం కార్మికవర్గ నియంతృత్వంగా ఉంటుంది. అంటే మెజారిటీగా ఉండే శ్రామికుల ఆధిపత్యం, మైనారిటీగా ఉండే దోపిడీ వర్గాలను అదుపులో ఉంచటం. బూర్జువా ప్రజాస్వామ్యంలో ఇందుకు పూర్తిగా విరుద్ధంగా జరుగుతుంది. మైనారిటీగా ఉండే దోపిడీ బూర్జువా వర్గం మొత్తం సమాజంపై నియంతృత్వం చలాయిస్తుంది. అయితే కార్మికవర్గ నియంతృత్వ రూపాలు వివిధ దశలలో మారుతూ ఉంటాయి. అంతర్గత శత్రువులు, బాహ్యంగా సామ్రాజ్యవాదులు సోషలిజాన్ని నాశనం చేసే ప్రయత్నం చేస్తున్నపుడు కార్మికవర్గ ప్రభుత్వ అధికారం మరింత కేంద్రీకృతంగా ఉండాలి. తిరుగుబాటును నిర్దాక్షిణ్యంగా అణచివేయాల్సి ఉ

> **“ సోషలిజంలో ప్రజాస్వామ్యం అనేది అది సృష్టించిన భౌతిక సంపదపైనే ఆధారపడి ఉంటుంది. ఒకవైపున దోపిడీని రద్దు చేయటం, మరోవైపు మానవులందరికీ కనీసావసరాలైన తిండి, గుడ్డ, ఇల్లు, విద్య, వైద్యం అందుబాటులోకి తేవటంపైనే ప్రజాస్వామ్యం మరింతగా విస్తరిస్తుంది. పెట్టుబడిదారీ సమాజంలో ఎవరికైనా ఉత్పత్తి అయిన ఏ వస్తువునైనా కొనుక్కునే స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం ఉంటాయి. కానీ కొనేందుకు ఆర్థికశక్తి ఉండదు. కాని సోషలిజంలో ఆ శక్తి సమకూరటం వల్ల ప్రజాస్వామ్యం అర్థవంతమౌతుంది. ”**

ంటుంది. అయితే ఆ పరిస్థితి మారిపోయాక ఆ రూపం మారాలి. ప్రజాస్వామ్యం, పౌర హక్కులు, స్వేచ్ఛకు గ్యారంటీ ఉండాలి. సోవియట్‌లో అలా కాకుండా అంతర్యుద్ధ కాలంలో అనుసరించిన ప్రభుత్వ రూపాలనే తరువాత కూడా కొనసాగించటం జరిగింది. స్టాలిన్ కాలంలో ఫాసిజం ఓటమి, అంతర్యుద్ధాన్ని అధిగమించటం, వేగవంతమైన పారిశ్రామికాభివృద్ధి లాంటి అనేక ఘన విజయాలు సాధించబడ్డాయి. కానీ తరువాతి కాలంలో ఈ పొరపాటు వల్లనే అనేక నియంతృత్వ చర్యలు కూడా అమలు జరిగాయి. తిరిగి ఈ తప్పులను సరిజేసే పేరుతో బ్రెజ్నేవ్ కాలంలో ప్రభుత్వ స్వభావాన్ని 'ప్రజలందరి ప్రభుత్వం' గా మార్చివేసారు. అది కూడా సరైంది కాదు. ప్రభుత్వం ఉన్నంత కాలం అది ఏ ప్రభుత్వమైనా వర్గ ప్రభుత్వంగానే ఉంటుంది. ప్రభుత్వం అంటేనే కొందరి ప్రయోజనాలను కాపాడేందుకు కొందరిని అణచిఉంచేది అని అర్థం చేసుకోవాలి. మెజారిటీ శ్రామికుల ప్రయోజనాలను కాపాడేందుకు, కొద్దిమందిగా ఉండే బూర్జువావర్గాన్ని అదుపులో ఉంచేందుకు సోషలిస్టు ప్రభుత్వం పనిచేస్తుంది. అందువలన ప్రభుత్వం అనేది ప్రజలందరి ప్రభుత్వంగా ఉండజాలదు.

కార్మికవర్గ నియంతృత్వం అనేది అన్ని దేశాలలో ఒకే రూపంలో అమలు జరపబూనటం పొరపాటు. ఆయా దేశాల పరిస్థితులను బట్టి అది నిర్ణయం కావాలి. కాని సోవియట్ యూనియన్‌లో అమలు జరిపిన రూపాలనే మక్కీకి మక్కీ తూర్పు యూరప్ దేశాల్లో కూడా అమలు జరపటం మరో పొరపాటు. ఈ విధంగా సోషలిస్టు దేశాలలో ప్రజాస్వామ్యం, పౌరహక్కులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వకపోవటం అనే తప్పు జరిగి ప్రజల్లో అసంతృప్తికి కారణమైంది.

కార్మికవర్గ నియంతృత్వం అంటే ఆ వర్గమంతా పాలనలో భాగస్వామ్యం కావటం. వివిధ రూపాలలో ప్రభుత్వ నిర్ణయాలలో, అమలులో ప్రజలను భాగస్వాములను చేయాలి. 'ప్రతి వంటగత్తె కూడా పాలకురాలు' అయి ఉండాలి అని లెనిన్ అన్న మాటకు అర్థం ఇదే. కానీ సోవియట్‌లో అలా జరగలేదు. కార్మికవర్గ అగ్రగామి దళం పేరుతో ప్రభుత్వ పాలనా నిర్ణయాలలో కార్మికవర్గానికి బదులు పార్టీయే పెత్తనం చలాయించటం, పార్టీ స్థానంలో పొలిట్ బ్యూరో, పొలిట్ బ్యూరో స్థానంలో ఒకవ్యక్తి (జనరల్ సెక్రటరీ) చేతిలో అధికారం




నాటి సోవియట్ యూనియన్ మ్యాపు,
దేశపు అధికార చిహ్నం

కేంద్రీకృతం కావటానికి అది దారితీసింది. ఈ పొరపాటు వల్ల ప్రభుత్వానికి, పార్టీకి ప్రజలు దూరమయ్యారు.

**సోషలిస్టు ప్రజాస్వామ్యం-కేంద్రీకృత ప్రజాస్వామ్యం:** సోషలిజంలో ప్రజాస్వామ్యం అనేది అది సృష్టించిన భౌతిక సంపదపైనే ఆధారపడి ఉంటుంది. ఒకవైపున దోపిడీని రద్దు చేయటం, మరోవైపు మానవులందరికి కనీసావసరాలైన తిండి, గుడ్డ, ఇల్లు, విద్య, వైద్యం అందుబాటులోకి తేవటంపైనే ప్రజాస్వామ్యం మరింతగా విస్తరిస్తుంది. పెట్టుబడిదారీ సమాజంలో ఎవరికైనా ఉత్పత్తి అయిన ఏ వస్తువునైనా కొనుక్కునే స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం ఉంటాయి. కానీ కొనేందుకు ఆర్థికశక్తి ఉండదు. కాని సోషలిజంలో ఆ శక్తి సమకూరటం వల్ల ప్రజాస్వామ్యం అర్థవంతమౌతుంది. మనుషుల వ్యక్తిత్వాలు తమకిష్టమైన రీతిలో అభివృద్ధి చెందటానికి అవకాశమేర్పడుతుంది. తమ అభిరుచికి తగిన పనిని ఎంచుకునే స్వేచ్ఛ లభిస్తుంది. ఇలా ఎదిగే మానవులను పాలనలో వివిధ స్థాయిల్లో, వివిధ రూపాలలో భాగస్వాములను చేయాలి. అలా జరగకపోతే సోషలిస్టు వ్యతిరేక ప్రచార దాడికి గురౌతారు. సోవియట్‌లో అదే జరిగింది. తూర్పు యూరప్ దేశాలలో సోషలిస్టు విప్లవాలకు ముందు బూర్జువాల పాలనలో అనేక పౌరహక్కులు, స్వేచ్ఛలు ప్రజలు అనుభవించారు. సోషలిజం అనేది ఈ దేశాలలో అంతకు ముందు ప్రజల అనుభవంలో ఉన్న స్వేచ్ఛ, హక్కులను రక్షించేదిగానూ, వాటిని మరింత అభివృద్ధి చేసేదిగానూ ఉండాలి. కానీ అలా జరగలేదు.

కేంద్రీకృత ప్రజాస్వామ్యం అనేది పార్టీ నిర్మాణంలో కీలకమైన అంశం. అన్యవర్గ ధోరణులను ఎదుర్కొవటానికి ఇది సరైన సాధనం. కానీ కేంద్రీకృతం పేరుతో ప్రజాస్వామ్యం అణచివేయబడితే పార్టీ నాయకుల బ్యూరాక్రటిక్ ధోరణులు పెరుగుతాయి. ఆ దేశాలలో అదే జరిగింది. చివరకు అవినీతి, బంధుప్రీతి కూడా ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. పార్టీ నాయకులు, క్యాడర్ల పేరుతో వారికి ప్రత్యేక

> **“ సోషలిస్టు ఆర్థికవ్యవస్థ నిర్మాణానికి ఆయా దేశాల చారిత్రక, అభివృద్ధి స్థాయిలను బట్టి ఉత్పత్తి సాధనాలను పూర్తిగా సమాజపరం చేయటానికి పట్టే కాలం ఆధారపడి ఉంటుంది. అది సాధారణంగా చాలా దీర్ఘంగా ఉంటుంది. ప్రభుత్వ యాజ మాన్యం లోని పరిశ్రమలు, సంస్థలు, ఉమ్మడి యాజమాన్యాలు, సహకార సంఘాల యాజమాన్యం, చిన్న ఉత్పత్తిదార్ల ప్రైవేటు యాజమాన్యం ఇలా అనేక రూపాలలో ఆర్థిక నిర్వహణ పద్ధతులు అనుసరించాల్సి వస్తుంది. ”**

సౌకర్యాలు, రేషన్లు కేటాయించబడ్డాయి. ఇది ప్రజల నుండి పార్టీని దూరం చేసింది.

**సోషలిస్టు ఆర్థిక నిర్మాణం:** సోషలిస్టు ఆర్థికవ్యవస్థ నిర్మాణంలో ఉత్పత్తి సాధనాలపై ప్రభుత్వ యాజమాన్యం, కేంద్ర ప్రణాళికలు కీలకమైనవి. మొదటిది మనిషిని మనిషి దోపిడీ చేసే పద్ధతిని నిర్మూలిస్తుంది. రెండోది పెట్టుబడిదారీ లక్షణమైన అసమానాభివృద్ధికి బదులు సమతుల్యమైన ఆర్థికాభివృద్ధిని సాధిస్తుంది. సోషలిజంలో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయిగాబట్టి మనుషులు సోమరిపోతులు అవుతారనే తప్పువాదన ఒకటి ఉంది. పనిచేయటానికి పురికొల్పే చోదకశక్తి ఉండాలి కదా? అనేది ప్రశ్న. “శక్తికొద్దీ పని, పనిని బట్టి ఫలితం” అనేది సోషలిస్టు ఆర్థికవ్యవస్థలో ముఖ్య సూత్రం. ఈ సూత్రంలోనే ఆ ‘చోదకశక్తి’ ఉంది. అయితే ఈ సూత్రంలో ఎంత పనిచేస్తే అంత ఆదాయం అనే ప్రోత్సాహకం ఉన్నప్పటికీ ప్రజలలో ఉమ్మడి సోషలిస్టు చైతన్యమూ, నాయకత్వం వహించే కమ్యూనిస్టు పార్టీలో ఈ విషయాలలో ఉండే సైద్ధాంతిక స్పష్టతే నిజమైన చోదకశక్తిగా ఉంటాయి. అవి లోపించటం వల్లే సోవియట్‌లో దుష్పరిణామాలు ఏర్పడ్డాయనేది మనం అర్థం చేసుకోవాలి.

ఒకసారి ఉత్పత్తి సాధనాలపై ప్రభుత్వ యాజమాన్యం, కేంద్రీకృత ప్రణాళిక ఏర్పడినంత మాత్రాన సరిపోదు. సోషలిస్టు నిర్మాణం అనేది దీర్ఘకాలం సాగే ప్రక్రియ. ఆ క్రమంలోని వివిధ దశలలో ఆర్థిక వ్యవహారాల నిర్వహణ రూపాలు మారుతుంటాయి. వాస్తవంగా వెనకబడిన ఆర్థికవ్యవస్థలు గల దేశాలలో విప్లవాలు విజయవంతమైనపుడు ఈ క్రమం మరింత దీర్ఘకాలం సాగుతుంది. ఇలా ఆర్థిక వ్యవహారాల నిర్వహణ పద్ధతులను తగిన సమయంలో మార్చుకోకపోతే ఆర్థికాభివృద్ధి ప్రతిష్టంబనకు గురౌతుంది. సోవియట్ యూనియన్‌లో 70, 80 దశాబ్దాల్లో అదే జరిగింది. సోషలిజం స్థిరపడ్డాక ప్రజల అససరాలు పెరిగాయి. ప్రజల డిమాండ్‌కు తగినట్లుగా వస్తువుల పరిమాణం, నాణ్యతలో మెరుగుదలను సాధించలేకపోయారు. ఫలితంగా ప్రజల అసంతృప్తి పెరిగింది. ఈ పరిస్థితి పొంచి ఉన్న సామ్రాజ్యవాదులకు ‘మంచి మేత’గా ఉపయోగపడింది.

**ఆస్తి రూపాలు:** సోషలిస్టు ఆర్థికవ్యవస్థ నిర్మాణానికి ఆయా దేశాల చారిత్రక, అభివృద్ధి స్థాయిలను బట్టి ఉత్పత్తి సాధనాలను పూర్తిగా సమాజపరం చేయటానికి పట్టే కాలం ఆధాంపడి ఉంటుంది. అది సాధారణంగా చాలా దీర్ఘంగా ఉంటుంది. ప్రభుత్వ యాజమాన్యం లోని పరిశ్రమలు, సంస్థలు, ఉమ్మడి యాజమాన్యాలు, సహకార సంఘాల యాజమాన్యం, చిన్న ఉత్పత్తిదార్ల ప్రైవేటు యాజమాన్యం ఇలా అనేక రూపాలలో ఆర్థిక నిర్వహణ పద్ధతులు అనుసరించాల్సి వస్తుంది. ఎపుడు ఏ మార్పులు చేయాలనేది అప్పటి వర్గశక్తుల బలాబలాలు, అంతర్గత, బాహ్య ప్రతీఘాతశక్తుల ప్రతిఘటనా స్థాయిని బట్టి ఉండాలి. వివిధ దశలలో చేసే నిర్ణయాలు ప్రజలు ఆమోదించేవిధంగా, వారిని భాగస్వాములను చేసే విధంగా జరగాలి. అలా కాకుండా తొందరపడి, చట్టాలతో బంధించి ఆస్తులను సామాజికీకరణ చేస్తే ఆస్తి స్వంతదారుల అసంతృప్తికి, వ్యక్తుల ఉత్పత్తి చొరవ దెబ్బతినటానికి దారితీస్తుంది. మళ్లీ ఆ తప్పులకు పరిష్కారంగా మొత్తం ఆస్తులను ప్రైవేటుపరం చేయటం సోషలిస్టు వ్యవస్థను రద్దు చేసుకోవటమే అవుతుంది. ఈ సంయమనాన్ని పాటించటంలో సోవియట్‌లో జరిగిన పొరపాట్లే ప్రజల అసంతృప్తికి, సోషలిజం రద్దుకు దారితీసాయి.

**ప్లానింగ్ - మార్కెట్:** ప్రభుత్వ జోక్యం లేకుండా, అదుపులేకుండా మార్కెట్ అనేది ఉండదు. నేటి పెట్టుబడిదారీ దేశాలలోని మార్కెట్లు అని చెప్పబడే వాటిపైన కూడా పన్నులు, ద్రవ్య విధానాల ద్వారా ప్రభుత్వాలు జోక్యం చేసుకుంటూనే ఉంటాయి. అవసరమైనపుడు ఆర్థికాభివృద్ధిని పెంచటానికి, అడ్డుకోవటానికి ఆ విధానాలను ఉపయోగిస్తుంటారు. సోషలిజంలో మార్కెట్ అనేది ఉండదనుకోవటం కూడా పొరపాటు. సరుకుల ఉత్పత్తి ఉన్నంత కాలం వాటి మారకం కోసం మార్కెట్ ఉండాల్సిందే. సమస్యేమిటంటే మార్కెట్‌ను, ప్లానింగ్‌ను ఒకదానికి ఒకటి పోటీగా చూపటం. అలా చూడటం పొరపాటు. ఇవి రెండూ ఒకదానికొకటి పోటీ కాకపోగా అవి రెండూ పరస్పరం సహకరించుకున్నపుడే ఆర్థికాభివృద్ధి సక్రమంగా జరుగుతుంది. ఈ అవగాహనకు భిన్నంగా ప్లానింగ్‌ను రద్దు చేసి మార్కెట్ శక్తులకు అభివృద్ధిని వదిలేయటం పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణకే దారితీస్తుంది. సోవియట్‌లో అదే జరిగింది.

సోవియట్ యూనియన్‌లో, తూర్పుయూరప్ దేశాలలో జరిగిన తప్పులు, పొరపాట్లు, వాటిని ఉపయోగించుకుని సామ్రాజ్యవాదం చేసిన దాడులు సోషలిజం దెబ్బతినటానికి కారణమైనాయి. ఈ పరిణామాలు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంపై తీవ్ర ప్రభావం కలిగించాయి. పెట్టుబడిదారీ సిద్ధాంతవేత్తలు ఇనుమడించిన ఉత్సాహంతో అంతర్జాతీయ స్థాయిలో ఇక కమ్యూనిజం పని ఐపోయిందని, ‘పెట్టుబడిదారీ విధానమే శాశ్వతమని’, ‘చరిత్రకు ఇదే అంతం’ అని సిద్ధాంతాలు అల్లారు. చాలా దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు కూడా ఈ పరిణామాలతో ఖంగుతిన్నాయి. కొన్ని సోషల్ డెమొక్రటిక్ పార్టీలుగా మారిపోవటమో, కొన్ని పార్టీలు రద్దుకావటమో కూడా జరిగింది.

సోషలిజానికి తగిలిన ఈ దెబ్బ చాలా తీవ్రమైనదే అయినప్పటికీ చారిత్రకంగా చూసినపుడు అది తాత్కాలిక ఓటమి మాత్రమే. చరిత్రలో ఇలాంటి సంక్షోభాలు సంభవించినపుడల్లా సరైన శాస్త్రీయ విశ్లేషణలతో తప్పులు దిద్దుకొని, ఉద్యమం ముందుకు సాగింది. సృజనాత్మకంగా మార్క్సిస్టు సైద్ధాంతిక సంపదను మరింత పరిపుష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగానూ, మిగిలిన సోషలిస్టు దేశాలలోనూ ఇపుడూ అదే ప్రయత్నం జరుగుతోంది. ఈ సైద్ధాంతిక సమస్యలను భారత కమ్యూనిస్టు పార్టీ ఏ విధంగా చూస్తోంది? భారతదేశంలో సోష లిస్టు సాధన జరిగినపుడు, పై అనుభవాల నేపథ్యంలో ఆ సోషలిజం ఎలా ఉండాలి? అనే విషయాలు వచ్చే సంచికలో చర్చిద్దాం. ❇

ఉద్యమం

# మతోన్మాదాన్ని ఎదుర్కోవటం ఎలా?

**ఎస్ వీరయ్య**



రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు

ఎప్పుడూ ఏదో ఒక రకమైన ఎన్నికలే... ! పై కమిటీ పిలుపులు ఎక్కువై నాయి.... ! వీటికితోడు ప్రజా సంఘాల పిలుపులు.... ఇక స్థానిక సమస్యల మీద పనిచేసేదెప్పుడు? ఇవన్నీ కమ్యూనిస్టు పార్టీ ఎదుగుదలకు ఆటంకమై నాయా?

మతోన్మాదం మీద పోరాటం అంటే ఏమిటి? ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తే నిలువరించ వచ్చా? బూర్జువా పార్టీలు మతోన్మాదాన్ని ఎదుర్కొంటాయా?

ఇప్పుడు వామపక్ష శ్రేణుల్లో జరుగుతున్న చర్చలలో ఈ ప్రశ్నలు కొన్ని. ఇవన్నీ జవాబులు వెతకవల్సినవే.

ఏడాదికి పైగా సాగుతున్న రైతాంగ పోరాటానికి ఎన్నికలు ఆటంకం కాలేదు. పైగా ప్రజాసంఘాలు గానీ, పార్టీలుగానీ ఇచ్చే పిలుపులు ఆ ఉద్యమం చుట్టే తిరిగాయి. అంటే... ఢిల్లీ పరిసరాల్లో రైతాంగం బైటా యింపు పోరాటం దేశ రాజకీయ ఏజెండాను నిర్దేశించింది. అంతెందుకు? తెలంగాణలో నెలల తరబడి సాగిన మహాజన పాదయాత్ర కుగానీ, 40కి పైగా పారిశ్రామిక ప్రాంతాల్లో 22 రోజులు సాగిన కార్మిక గర్జన పాదయాత్రకు గానీ ఇలాంటివేవీ ఆటంకాలు కాలేదు. సుదీర్ఘకాలంగా సాగుతున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటానికి కూడా ఇలాంటివేవీ ఆటంకాలు కాలేదు. అవే ప్రధాన కార్యా చరణగా సాగిన విషయం కూడా గమనించాం. ప్రజా ఉద్యమానికి ఎన్నికలు, పైకమిటీల పిలుపులూ, ప్రజాసంఘాల పిలుపులూ ఆటంకం కాదని ఇవన్నీ తేల్చుతున్నాయి. అంతేకాదు... ఈ పోరాటాలే ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తున్నాయి. ఆయా స్థాయిల్లో ఎజెండాను నిర్దేశిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో ప్రజలను కలవడానికీ, వారితో మమేకం కావడానికీ, ప్రజలను కదిలించడానికీ కార్యకర్తలు, నాయకుల ఆలోచనా విధానం లోనూ, పని విధానంలోనూ ఉన్న లోపాలే ప్రధాన కారణం అని అర్ధం చేసుకోడానికి ఇంతకన్నా రుజువులు అవసరమా !

దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటీకరణ విధానాలు దూకుడుగా అమలు చేస్తున్నారు. ఇందుకోసం, ప్రజల దృష్టిని మరలించడానికి మతాన్ని రాజకీయ సాధనంగా వాడుతున్నారు. ప్రజల మధ్య మతపరమైన విభజన సృష్టించడానికీ, భావోద్వే గాలను ఉసిగొల్పడానికీ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సమస్యను సిపిఐ(ఎం) 21వ అఖిలభారత మహాసభ లోతుగా పరిశీలించింది. సరళీకృత ఆర్ధిక విధానాల మీద రాజీలేని పోరాటం చేయడం ద్వారా మాత్రమే మతోన్మాదుల కుట్రలను నిలువరించ గలమని స్పష్టం చేసింది. విశాఖలో జరిగిన 21వ మహాసభలు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే రొటీన్ మహాసభలు కాదు. 25 సంవత్సరాలపాటు అమలుచేసిన ఎన్నికల ఎత్తుగడలను, ఫలితాలను, పార్టీ నిర్వహించిన ప్రజాపోరాటాలను సమీక్షించిన ప్రత్యేక మహాసభ అది. దేశంలో వామపక్ష ఉద్యమం ఎదుర్కొంటున్న కొన్ని కీలక సమస్యలను పరిష్కరించిన మహాసభ అది. మతోన్మాదం మీద పోరాటం అంటే కేవలం ఎన్నికల పోరాటం మాత్రమే కాదని స్పష్టం చేసింది. సరళీకృత ఆర్ధిక విధానాల మీద రాజీలేని పోరాటం సాగిస్తూనే, సామాజిక, సాంస్కృతిక రంగాలలో కూడా మతోన్మాదాన్ని ఎదుర్కో వాలని చెప్పింది. మతోన్మాదం మీద పోరా టాన్ని కేవలం రాజకీయ రంగానికి పరిమితం చేసి, ఎన్నికల రంగంలో బీజేపీని ఓడించడం మేరకే కుదించడం వల్ల అది మతోన్మాదం మరింత బలపడడానికే దారి తీసింది. బీజేపీని కేంద్రంలో అధికారం లోకి రాకుండా చూడా లని చేసిన ప్రయత్నాలన్నీ కొన్ని తాత్కాలిక ఫలితాలిచ్చినప్పటికీ మతోన్మాదం బలపడింది. సంపూర్ణ మెజారిటీతో బీజేపీ అధికారం చేజిక్కించుకోగల్గింది. ప్రజా సమీకరణ కృషి వెనక్కిపోయి, ఎన్నికల ఎత్తుగడల చుట్టూ తిరగడానికి దారితీసింది. సొంత బలం పెంచుకునే ప్రయత్నాలకు బదులు బూర్జువా పార్టీల మీద ఆధారపడే ధోరణి ప్రబలింది.

బీజేపీ అధికారంలో ఉంటేనే మతోన్మాదం ప్రబలుతుందన్న అభిప్రాయాలు కూడా బలపడుతున్నాయి. అధికారంలోకి రాకముందే వివిధ రూపాలలో మతోన్మాద సంస్థల యంత్రాంగంగానీ, మతోన్మాద భావజాలం గానీ విస్తరించిన విషయం విస్మరి స్తున్నాం. అంతేకాదు, బూర్జువా పార్టీల అవకాశవాద ధోరణులు కూడా ఇందుకు తోడ్పడుతున్నాయి. రాజస్థాన్, ఛత్తీస్ఘడ్ రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది. కానీ కీలకమైన స్థానాలలో ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న అధికారులను నియమించింది. బీజేపీ అధికారంలో లేకుండానే ప్రభుత్వ యంత్రాంగంలో తిష్ట వేయగల్గు తున్నది.

బీజేపీ బలపడేందుకు అనేక పరిస్థితులు దోహదపడుతున్నాయి. ఒకప్పుడు మతకలహాలు సృష్టించి బలపడేందుకు ప్రయత్నించేవారు. ఇప్పుడు మెజారిటీ మతభావాలు బలపడి, పరమత సహనం సన్నగిల్లింది. ద్వేషభావాలు రెచ్చగొట్టడం సులభంగా మారిపోయింది. ఈ ధోరణి ప్రజలలో సాధారణంగా మారిపో యింది. బీజేపీ, మతోన్మాదం బలపడడానికి పరిపక్వంగా ఉన్న వాతావరణమిది. దీనికితోడు లౌకిక పార్టీలుగా చెప్పుకునే బూర్జువా పార్టీల అవకాశవాదం తోడైంది. బీజేపీ నాయకులతో పోటీపడి కాంగ్రెస్, టీఆర్ఎస్, టీడీపీ, వైసీపీ లాంటి పార్టీల నేతలు కూడా గుడులు, గోపురాల నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు. అయోధ్యలో రామాలయ నిర్మాణానికి నిధులు సమకూర్చు తున్నారు. మైనారిటీలకు వ్యతిరేకంగా వైరల్ అవుతున్న ఫేక్ వీడియోలను బూర్జువా పార్టీల శ్రేణులు కూడా పెద్దయెత్తున షేర్ చేస్తున్నారు. స్థానిక కోర్టు తీర్పు పేరుతో అయోధ్యలో బాబ్రీ మసీదును హిందువుల పూజలకు అనుమ తించింది రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నపుడే కదా! పై కోర్టుకు అప్పీలుకు పోకుండా పూజ లకు ద్వారాలు తెరిచిన తర్వాత ఏం జరిగిందో చూస్తూనే ఉన్నాం. కాంగ్రెస్ అగ్రనాయకత్వంలో

> **ఇలాంటి సమయంలో మద్దతు ధరను చట్టబద్ధం చేయాలనీ, విద్యుత్తు సవరణ బిల్లు ఉపసం హరించాలని రైతులు పట్టుదలతోఉండటం మంచి పరిణామం. వర్గ పోరాటాలు, ప్రజా ఉద్యమాలు తీవ్రతరం చేస్తూ, అన్ని రంగాలలో మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలను సమీక రించటం తక్షణ కర్తవ్యంగా సాగాలి.**

ఇప్పటికీ అవే ధోరణులు. గత పార్లమెంటు ఎన్నికలలో మతోన్మాదం మీద సాగిన రాజ కీయ పోరాటమే కీలకం. అయినా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో లౌకికవాదం గురించిన ప్రస్తావన కూడా లేదు. రాహుల్ గాంధీ గుడులు, గోపురాలు తిరిగి, తాను స్వచ్ఛమైన హిందువుగా, బ్రాహ్మణుడుగా రుజువు చేసుకునే ప్రయత్నం చేసారు. బీజేపీ మీద పోటీ చేయటం ద్వారా మతోన్మాద వ్యతిరేక పోరాటానికి ఊపునివ్వవల్సింది పోయి, కేరళలో కమ్యూనిస్టుల మీద పోటీ చేసారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా కూడా బెంగాల్‌లో పర్యటనకు విముఖత ప్రదర్శించారు. యూపీలో బీజేపీ బలంగా ఉన్న స్థానాలు వదిలి, సమాజ్‌వాదీ పార్టీ బలంగా ఉన్న సీట్ల మీదనే ప్రియాంకగాంధీ దృష్టి సారించారు. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఎ ల రద్దుకు అనుకూలంగా సోషల్‌మీడియాలో పోస్టులను తమ పార్టీల శ్రేణులు పెద్దయెత్తున షేర్ చేస్తుంటే కూడా బూర్జువా పార్టీల నేతలు జోక్యం చేసుకోలేదు. నాయకులు కూడా ఆ నిర్ణయాలకు అనుకూలంగానే ప్రైవేటు చర్చలలో స్పందిస్తున్నారు. దాని ఫలితమే తమ పార్టీల శ్రేణుల మీద ఇలాంటి ప్రభావాలు. ఇవన్నీ బీజేపీ బలపడడానికే ఉపయోగపడుతున్నాయి. అంతేకాదు, కాంగ్రెస్ పార్టీ ద్వారా తమ ప్రయోజనాలు నెరవేరనపుడు, బలమైన నాయకులు బీజేపీలోకి ఫిరాయించటం ద్వారా కూడా ఆ పార్టీ బలపడుతున్నది. త్రిపురలో కాంగ్రెస్ పార్టీనే బీజేపీగా మారిపోయింది కదా! కర్ణాటక, మధ్యప్రదేశ్, గోవా, పుదుచ్చేరి లాంటి రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ఫిరాయింపులే బీజేపీ బలపడడానికి ఉపయోగపడ్డాయి.


తెలుగు రాష్ట్రాలలో కూడా ఇలాంటి ధోరణులు గమనిస్తున్నాం. తెలంగాణలో హుజురాబాద్ శాసనసభ ఉప ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు తోడ్పడింది కాంగ్రెస్ ఎత్తు గడలే. బీజేపీకి వ్యతిరేకంగా పోరాటంకన్నా టీఆర్ఎస్ వ్యతిరేక పోరాటమే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తున్నది. కేంద్ర బీజేపీ సర్కారు విధానాలకు వ్యతిరేకంగా 16 పార్టీల పిలుపును కూడా ఇక్కడ టీఆర్ఎస్ వ్యతిరేక వేదికగా మలిచేందుకు ప్రయత్నించింది. కేంద్రం వరిధాన్యం కొనుగోలు చేయాలని ధర్నాచౌక్‌లో టీఆర్ఎస్ నాయకత్వం లో చేసిన ధర్నాను కూడా అపహాస్యం చేయటం లో బీజేపీతో గొంతుకలిపింది. బీజేపీతో పాటు, కాంగ్రెస్ కూడా ధర్నాచౌక్ శుద్ధి కార్యక్రమం చేసింది. రాష్ట్రంలో అధికారంలోకి రావాలన్న యావ తప్ప బీజేపీ ప్రభుత్వ విధానాల మీద పోరాడాలన్న సోయి లేదు. ఈ ప్రయత్నంలో బీజేపీ బలపడకుండా చూడాలన్న స్పృహ లేదు. టీఆర్ఎస్ నాయకత్వం కూడా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ విధానాల మీద పోరాటానికి నికరంగా నిలబటం లేదు. ప్రజల ప్రయోజనాలకన్నా తమ స్వార్ధ రాజకీయ ప్రయోజనాలే మిన్నగా లాలూచీ కుస్తీ నడిపింది. ఇప్పుడు మళ్ళీ కేంద్రం మీద యుద్ధం ప్రకటించింది. ఏమేరకు చిత్తశుద్ధితో నిలబడుతుందో వేచి చూడాలి. ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగుదేశం, వైసీపీల ధోరణి కూడా ఇదే. ప్రజాసమస్యలు పక్కనబెట్టి హిందూ ఆలయాల మీద దాడులు జరుగుతు న్నాయని టీడీపీ నాయకత్వం క్యాంపెయిన్ చేయటం కూడా చూసాం. తిరుమల తిరుపతి దేవ స్థానంలో పూజల్లో పాల్గొని తాను హిందూ దేవాలయంలో పూజలు జరిపించానని చూపించుకునే ప్రయత్నం జగన్ చేసారు. ఒకవైపు టీడీపీ, మరోవైపు వైసీపీలు బీజేపీ సహకారంతో ఒకరినొకరు దెబ్బకొట్టాలని ఎత్తుగడలు వేస్తున్నారు. పిల్లీ పిల్లీ కొట్లాటలో కోతికి తోడ్పడకూడదన్న స్పృహలేదు. తెలంగాణలో ఐపీఎస్ పదవి వదులుకుని బీఎస్పీ నాయకత్వ బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్ కుమార్ గానీ, ఇటీవల తెలంగాణలో పార్టీ పెట్టిన షర్మిల గానీ బీజేపీ ప్రమాదాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఉభయ రాష్ట్రాలలో కులసంఘాల నాయకులు బీజేపీకి దగ్గరయ్యేందుకు ఏమాత్రం వెనుకాడటంలేదు.

పై పరిణామాలన్నీ మనకు ఏం నేర్పు తున్నాయి! బూర్జువా పార్టీల మీద ఆధారపడి మతోన్మాదానికి అడ్డుకట్ట వేయటం సాధ్యపడదు. ఇందుకు భిన్నంగా, వర్గపోరాటం మతోన్మాదుల కుయుక్తులకు బ్రేకులు వేయగల్గుతున్నది. కార్మిక చట్టాల రద్దుకు వ్యతిరేకంగా సాగిన కార్మికవర్గ సార్వత్రిక సమ్మె, ఇతర పోరాటాలు చూసాం. మరోవైపు ఏడాదిగా సాగుతున్న రైతాంగ పోరాటం దేశ రాజకీయాల మీద, శ్రామికవర్గ పోరాటాల మీద మంచి ప్రభావం చూపింది. కార్మికుల సమస్యలను రైతాంగ పోరాట నాయకత్వం గుర్తించింది. రైతాంగ సమస్యలను కార్మికోద్యమ నాయకత్వం గుర్తించింది. పరస్పరం సహకరించుకుంటూ ఉద్యమం సాగుతున్నది. పౌరసత్వ సవరణ చట్టం, ఎన్‌పిఆర్, ఎన్ఆర్‌సీల పేరుతో మతపరమైన విభజన ప్రయత్నాలకు, మతోన్మాదుల కుట్రలకు ఈ పోరాటం కొంతమేరకు బ్రేకులు వేయ గల్గింది. జాతీయస్థాయిలో బీజేపీకి ప్రత్యామ్నా యంగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ కాదు, రైతాంగం, కార్మికులు సాగిస్తున్న వర్గ పోరాటం మాత్రమే ఆమేరకు ఫలితం సాధించింది. మూడు రైతువ్యతిరేక చట్టాలను కేంద్రం ఉపసంహరించుకుంటానని ప్రకటించక తప్పని స్థితిని సృష్టించింది. ఎంపీలు, శాసనసభ్యుల సహకారంతో కాదు, తమ ఐక్య పోరాటమే తమను ముందుకు నడిపింది. పార్లమెంటు రైతాంగానికి అన్యాయం చేసే చట్టాలు చేసింది. రైతాంగ పోరాటం పార్లమెంటు నిర్ణయాన్ని మార్చుకునే విధంగా వత్తిడి చేయగల్గింది. ప్రజాప్రతినిధులు లేకుండా ప్రజాపోరాటాలు సాధ్యం కాదన్న భ్రమలు వీడాలని ఈ పోరాటం నేర్పుతున్నది. అంతేకాదు, వర్గ పోరాటాలూ, ప్రజాపోరాటాలే ప్రజా ప్రయోజనాలనూ, శ్రామికుల ప్రయోజనాలనూ, రాజకీయ ఫలితాలను కూడా నిర్దేశిస్తాయన్నది చారిత్రక సత్యం. రైతాంగ పోరాటం కొనసాగుతుండగా భావోద్వేగాలు ముందుకు తేవటం సులభం కాదని కూడా మోడీ భావించి ఉండవచ్చు. రైతు చట్టాలను వెనక్కి తీసుకుంటానని ప్రకటించ డానికి ఇది కూడా ఒక కారణం కావచ్చు. ఇలాంటి సమయంలో మద్దతు ధరను చట్టబద్ధం చేయాలనీ, విద్యుత్తు సవరణ బిల్లు ఉపసం హరించాలని రైతులు పట్టుదలతోఉండటం మంచి పరిణామం. వర్గ పోరాటాలు, ప్రజా ఉద్యమాలు తీవ్రతరం చేస్తూ, అన్ని రంగాలలో మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలను సమీక రించటం తక్షణ కర్తవ్యంగా సాగాలి.

❋

మతతత్వం

# ‘దేవుళ్ళను’ ఆయుధాలుగా వాడుకుంటున్న సంఘ్‌పరివారం



రచయిత సామాజిక కార్యకర్త

**అపూర్వానంద్**

ముస్లింలు ఏ ఒక్కరినీ ఇబ్బంది పెట్టకుండా దశాబ్దాలుగా బహిరంగ ప్రదేశాల్లో చేసుకుంటున్న సామూహిక ప్రార్థనలను దుండగులు వివాదాస్పదంగా మార్చి హింసకు దిగుతుంటే ప్రభుత్వం వారిని బుజ్జగిస్తోంది. నేను ఈ వాక్యాలు రాస్తుండగా గుర్గావ్‌లో సెక్టర్ 12 ఎ లోని బహిరంగ ప్రదేశంలో జరిగిన ఒక సంఘటనకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో వచ్చిన చిత్రాలు, వీడియోల దృశ్యాలు ఒక్కసారిగా నాకళ్ళ ముందుక ొస్తున్నాయి.

అక్కడ పెద్ద ఎత్తున ఒక కార్యక్రమం జరుగుతుండగా చాలా మంది కాషాయ దుస్తులు ధరించిన వారు కూర్చుని ఉన్నారు. ఒక యువకుడు యుద్ధానికి సిద్ధం అన్నట్లు కాషాయ జండా ఎత్తి పట్టుకుని తన సెల్‌ఫోన్‌తో బిజీగా ఉండటం కనబడుతోంది. అక్కడ చేరిన వాళ్ళు చాలా హడావుడిగా ఉన్నారు. “రామ్ సియా రామ్...” అన్నపాటని లౌడ్ స్పీకర్లు హోరెత్తిస్తున్నాయి. ఒక ఛోటా బిజెపి నాయకుడి మొహం కెమెరాలో కనపడింది. క్రితం సంవత్సరం ఢిల్లీలో ముస్లింలకు వ్యతిరేకంగా హింసను రెచ్చగొట్టి, విద్వేష ప్రచారంలో బరితెగించి మాట్లాడటం వల్ల అతను అపకీర్తి సంఘ్ పరివార్‌లో కీర్తి సంపాదించుకున్నాడు. ఆయనే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి. ఈ రోజుల్లో ముస్లింలను ఎంత ఎక్కువగా తిడితే హిందుత్వ సమూహాల్లో అంత ఎత్తుకు ఎదుగుతారు.

అక్కడ జరుగుతున్నది గోవర్ధన పూజ అని మాకు చెప్పారు. కానీ ఈ పద్ధతిలో గోవర్ధన పూజ చెయ్యడం నేనెప్పుడూ చూడలేదు. గోవర్ధన పూజ మహిళలది, నిజానికి అక్కచెల్లెళ్ళది అని నేననుకునే వాణ్ణి. సోదరులతో తమ బంధానికి సంబంధించినది కాబట్టి ఇది వారికి చాలా భావోద్వేగాలు కలిగించే సందర్భం. మహిళలంతా కలసి ఆవుపేడ, రంగులు, పత్తితో ప్రతిమలు చేసి కొంత కర్మకాండ ఆచరిస్తారు. అక్కచెల్లెళ్ళు ముళ్ళ వంగ మొక్క ముల్లు తీసుకుని ఆచారానికి గుర్తుగా ఆ ముల్లుని మృదువుగా తమ సోదరుల నాలుకలకు తాకిస్తారు. సోదరులని కోల్పోయిన అక్కచెల్లెళ్ళు వణికే గొంతుతో పాటలు పాడతారు. అటువంటి సమయంలో నేను వారి కళ్ళలో కన్నీళ్లు చూశాను.

బీహార్, తూర్పు ఉత్తర ప్రదేశ్‌లో కొన్ని చోట్ల ఈ కార్యక్రమాన్ని గోధన్ పూజ అని అంటారు. చాలా సంవత్సరాల కిందట నేను ఢిల్లీకి మారినప్పుడు షాపూర్ జాట్‌లో కూడా దీనిని ఆచరించటం చూశాను. ఈ పూజలో మగవారు కనపడటం చాలా అరుదు. మరి గుర్గావ్‌లో ఏం జరుగుతోంది? ఇది నిజంగా గోవర్ధన పూజేనా లేక మరొకటేదైనానా? కృష్ణుడికి సంబంధించిన ఈ రోజున భారత్‌లోని ఇతర ప్రాంతాలలో కృష్ణుడిని పూజిస్తుంటే ఇక్కడ ఎందుకని పెద్దగా రామ నామస్మరణ జరుగుతోంది?

కృష్ణుడు గోవర్ధన గిరిని ఎత్తి, వానదేవుడైన ఇంద్రుడి గర్వం అణిచి, ప్రజల్ని రక్షించాడని అంటారు. హిందువుల మనస్సుల్లో రాముడే కృష్ణుడు, కృష్ణుడే రాముడయినా ఎవరి గౌరవ స్థానం వారికుంది అనేది నిజం. రాముడు ప్రతిచోట మోచేతుల్తో నెట్టుకుంటూ ముందు కొచ్చి ఆడ దేవతలతో పాటు అందరు దేవుళ్ళని పక్కకి నెట్టేయటం ఇప్పుడు మనం చూస్తున్నాం. వాళ్ళ పేరున ఉన్న పర్వ దినాలన్నీ రాముడే సొంతం చేసుకోవటం వారికి దిగులుగా ఉండచ్చు. కానీ దేవుళ్ళను ఎప్పుడూ వాళ్ళ భక్తులే నియంత్రిస్తారని మనకి తెలుసు. తులసీదాస్ రాముడికి తప్ప మరే దేవుడికీ నమస్కరించడం కష్టమనుకునే రోజులు, సూరదాస్ కృష్ణ లీలలు మాత్రమే పాడే రోజులు వెళ్ళిపోయాయి. 21 శతాబ్దపు ‘భక్తులు’ సూరదాస్ చేత బలవంతంగా జై శ్రీరామ్ అని భజన చేయించటం ఊహించుకుంటే భయం, జుగుప్స కలుగుతోంది.

గుర్గావ్‌లో జరుగుతున్న కార్యక్రమాన్ని గురించి నిలదీసే కృష్ణ భక్తులు ఒక్కరు కూడా అక్కడ లేరు. సెక్టార్ 12 ఎ లో జరిగిన కార్యక్రమం పవిత్రమైనది కాదు అని దీన్నిబట్టి నేనర్థం చేసుకుంటున్నాను. ఇది దేవుళ్ళకి సంబంధించినది కాదు. దేవుళ్ళని తమ ఆయుధాల్లా వాడుకుంటూ ఇతరులను భయభ్రాంతులను చేసేవారికి సంబంధించినదే ఈ కార్యక్రమం అని స్పష్టమౌతున్నది. ఇతరుల మీద పెత్తనం చెలాయించి అణగదొక్కుదామనుకుంటున్న వారికి సంబంధించినది. సెక్టార్ 12 ఎ ఇప్పుడు శత్రువులకు స్వాధీనమైన భూభాగంలా ఉన్నది.

ముస్లింలు మధ్యాహ్నం వేళ రివాజుగా జుమా నమాజ్ చేయటం కోసం క్రితం శుక్రవారం వరకు ఈ చోటుకు చేరుతుండేవారు. కానీ ఈ రోజు నుండి ఈ స్థలం వద్దకు చేరటానికి వారికి అవకాశం ఉండదు. వారు బయటకు తోసి వేయబడ్డారు. ఇక్కడ మాత్రమే కాక గుర్గావ్‌లోని మరో పదిహేను ఇతర స్థలాలలో కూడా ముస్లింలను నమాజు చేయకుండా నిరోధిస్తున్నారు. అక్కడ కూడా గోవర్ధన పూజ జరుగుతోందా? ఇది 2021 కథ. 2017 నుండి లెక్కవేస్తే ఇంచుమించు 70 ప్రదేశాలలో ముస్లింలు నమాజు చేసుకోవటానికి అవకాశం లేకుండా చేశారు.

ఈ స్థలాలన్నీ బహిరంగ ప్రదేశాలు. శుక్రవారాలు ఒకటో, రెండో గంటలు సామూహిక నమాజ్ చేసుకునేందుకు ముస్లింలు ఎప్పటి నుండో వీటిని వాడుకుంటున్నారు. ఇది వారికి మతపరమైన విధి. ఇది ముస్లింలు కాని వారందరికీ తెలిసినదే. శుక్రవారం అన్ని రోజుల లాంటిదే. కానీ ముస్లింలు శుక్రవారం మధ్యాహ్నం అందరూ కలసి సామూహికంగా జుమా చేస్తారు. దగ్గరలో ఉన్న మసీదు, లేదా ఖాళీ ప్రదేశంలో ముస్లింలు అందరూ చేరి, ప్రశాంతంగా ప్రార్థన చేసుకోవటం మనలో ముస్లిం కానివారు కూడా చిన్నప్పటి నుండి చూసే

> **❝ రోజులు మారిపోయాయి. కలిసి నమాజ్ చేస్తున్న ముస్లింలు హిందువులకు ముప్పు అన్నట్లు ఇప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఒక చోట కూడిన ఏ ముస్లిం సమూహమైనా ప్రమాదకారి అని అనుకునేటట్టు హిందువులను తయారు చేశారు. వ్యక్తిగా ఒక ముస్లిం మంచి వాడే కానీ, ఒక సమూహంగా వారిని నమ్మకూడదు అనేది హిందువుల బుర్రల్లోకి ఎక్కించారు. ఆరెస్సెస్, బిజెపి రాజకీయాలకు ఈ వివక్ష ఎంతగానో ఉపయోగపడుతున్నది. ❞**

ఉంటారు. కొన్నిచోట్ల మసీదు లోపల ఉన్న స్థలం అందరికీ సరిపోనప్పుడు అక్కడి రోడ్ల మీదకు కూడా వాళ్ళు రావటం జరుగుతుంది. మనలో చాలామందికి ఈ శుక్రవార దృశ్యాలు పరిచయమే. ప్రతి ఆదివారం సామూహికంగా పూజ చేసే ఆచారం క్రైస్తవులకు ఉంది. కానీ హిందువులకు సామూహికంగా ప్రార్థనలు చేసే సంప్రదాయం లేదు. వారు అన్ని సమయాల్లో గుళ్ళకి వెళతారు, అలానే వారి ప్రార్థనలకి ప్రత్యేకంగా ఒక రోజు లేదా ఒక గంట అంటూ లేవు.

సాధారణంగా హిందువులు తమ మతపరమైన ఆచారాలలోని ఈ సరళత, అనుకూలత గురించి గొప్పగా చెప్పటం, ఇతర మతాలలో నిర్దేశించిన నియమావళిని విమర్శించటం చేస్తుండేవారు. మతోన్మాద శక్తులు చేస్తున్న ప్రచారం ఫలితంగా ఈ 'గర్వం' అసూయ, ఓర్వలేనితనం, తరవాత కోపంగా మారింది. ఇదంతా ఒక పెద్ద పథకంలో భాగం. ఇస్లాం, క్రైస్తవం అనుసరించే వారితో హిందువులు చాలాకాలం నించి కలసి బతకటంతో వారి ఆచార వ్యవహారాలను ప్రశంసించడం కూడా నేర్చుకున్నారు. వారి మత ఆచారాలను కొన్నిసార్లు వినోదంగానూ, కొన్నిసార్లు చికాకుతోనూ చూసినా, పనిగట్టుకుని వాటిని పాటించనివ్వకూడదు అన్న ఆలోచన ఎప్పుడూ చేయలేదు.

రోజులు మారిపోయాయి. కలిసి నమాజ్ చేస్తున్న ముస్లింలు హిందువులకు ముప్పు అన్నట్లు ఇప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఒక చోట కూడిన ఏ ముస్లిం సమూహమైనా ప్రమాదకారి అని అనుకునేటట్టు హిందువులను తయారు చేశారు. వ్యక్తిగా ఒక ముస్లిం మంచి వాడే కానీ, ఒక సమూహంగా వారిని నమ్మకూడదు అనేది హిందువుల బుర్రల్లోకి ఎక్కించారు. ఆరెస్సెస్, బిజెపి రాజకీయాలకు ఈ వివక్ష ఎంతగానో ఉపయోగపడుతున్నది.

గుర్గావ్‌కి తిరిగి వెళదాం. ప్రస్తుతం దీనిని అధికారికంగా గురుగ్రామ్ అని పిలుస్తున్నారు. విభిన్న సంప్రదాయాలను వదిలేస్తూ హిందూత్వను ఎలా స్వీకరించామో అలానే ఈ పేరు మార్పును కూడా అణకువగా అంగీకరించాం. దాన్ని పక్కనపెడితే గుర్గావ్ చుట్టూ పల్లెలున్నాయి. దీన్ని భవిష్యత్ నగరం అని కూడా పిలుస్తున్నారు. విభిన్న సంస్కృతులు కలగలిసిన ఈ పట్టణం దేశ రాజధాని విస్తరించే ప్రాంతంగా ఉన్నది. వృత్తి నిపుణులు, చేతి వృత్తుల వారితో కూడిన సంప్రదాయ సామూహిక మనస్తత్వం, పట్టణీకరించిన ప్రదేశాల కలయిక గుర్గావ్. ఈ పట్టణంలో హిందువులు, ముస్లింలు, సిక్కులు కలిసిమెలిసి ఉంటారు.

గుర్గావ్‌లో దేవాలయాలు పుష్కలంగా ఉన్నాయి. కానీ కేవలం 10 మసీదులు మాత్రమే ఉన్నాయి. పాత ప్రాంతాల్లో ఎనిమిది ఉండగా, జనంతో నిండిన కొత్త ప్రాంతాల్లో రెండు ఉన్నాయి. ఇక్కడ ఇంచుమించు ఐదు లక్షల మంది ముస్లింలు ఉండగా శుక్రవారాలు బహుశా ఒక లక్ష మంది నమాజ్ చేస్తారు. వివిధ ప్రదేశాలలో పని చేస్తుంటారు కాబట్టి కొంతమంది తాము పనిచేసే ప్రదేశాల దగ్గరే నమాజుకు చోటు చూసుకుంటారు. కొందరు కొద్ది దూరం వెళ్ళవలసి వస్తుంది. ముస్లింలు నమాజు చేసుకోవటం వలన ప్రజలకు ఎప్పుడూ అసౌకర్యం కలుగలేదు. గుర్గావ్‌ని ప్రక్షాళన చేస్తామని ప్రకటిస్తూ 2018 సంవత్సరంలో ఒక గ్రూపు బయల్దేరటంతో సమస్యలు మొదలయాయి.

క్రితం సంవత్సరం స్నిగ్ధ పూనమ్ హిందూస్థాన్ టైమ్స్‌కి రాసిన వ్యాసంలో ఈ విధంగా చెప్పారు:

"ముస్లింల మీద యుద్ధం ప్రకటించటానికి ఒక హిందూ పూజారి, అతని అనుచరులు జూన్ 10వ తేదీన గురుగ్రామ్ (ఇంతకుముందు గుర్గావ్) లోని ఒక చౌకరకం మద్యం దుకాణంలో కలిశారు. మద్యం బదులు శాకాహార బఫే పెట్టారు. లోపలి చీకటి పోయేందుకు కిటికీలు, తలుపులు బార్లా తెరిచారు. పత్రికా సమావేశానికి వీలుగా అక్కడి బల్లలు, కుర్చీలు అమర్చారు. కానీ ఇంకా చౌకరకం విస్కీ వాసన ఘాటుగా తగుల్తోంది.

"సందర్భానికి సరిపోని ఆ పరిసరాల్ని పట్టించుకోకుండా నరసింఘానంద్ సరస్వతి అక్కడ చేరిన పత్రికల వారి కేసి కఠినంగా చూసి "మనం గుర్గావ్ గడ్డ మీద ఒక విప్లవం ప్రారంభించబోతున్నాం" అని ప్రకటన చేశాడు. బహిరంగ నమాజ్‌కి నిరసనగా హర్యానా ముఖ్యమంత్రి ఇంటిముందు ఆత్మాహుతి ప్రయత్నం చేసి అరెస్ట్ అయి అప్పుడే బయటికివచ్చిన సరస్వతి ''హిందువుల శత్రువులను నాశనం చేయడానికి" తాను ఒక మహాయజ్ఞం నిర్వహించబోతున్నట్లు చెప్పాడు.

అప్పటి నుండి నరసింఘానంద్ ప్రతిష్ట ఒక్కసారిగా పెరిగిపోయింది. ఆయనను ఈమధ్యనే జునా పీఠాధిపతిగా పట్టాభిషేకం చేశారు. హింసకు ప్రోత్సహించేలా రెచ్చగొట్టే భాష మాట్లాడతాడని పేరు పడిన ఆయన బిజెపి మహిళా నేతల మీద కూడా అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసినప్పటికీ ప్రభుత్వం ఆయనను యధేచ్ఛగా వదిలేసింది. సంస్కృతి పేరుతో చేస్తున్న కార్యక్రమాల నుండి భారీగా రాజకీయ ప్రయోజనాలు పొందటానికి సంఘ్ పరివార్ ఈయనను బాగా ఉపయోగించుకుంటున్నదని స్పష్టంగా తెలుస్తోంది.

2018లో వేర్వేరు చోట్ల యువకుల ముఠాలు జుమా నమాజ్‌కి భంగం కలిగించడం మేము చూశాం. పోలీసులు వారిని ఆపాలని నిజంగానే ప్రయత్నించారు. ఈ దుండగుల్లో కొంతమంది అరెస్టు అయ్యారు. కానీ తొందరలోనే వారిని వదిలేశారు. ఆ దాడులు కొనసాగాయి. ముస్లింలు మసీదుల్లోనే నమాజు చేసుకోవాలనీ, బహిరంగ ప్రదేశాలలో చేయరాదనీహర్యానా ముఖ్యమంత్రి చెప్పాడు. భూములను ఆక్రమించేందుకు ఈ బహిరంగ నమాజ్‌ను ఉపయోగించుకుంటున్నారని మరో మంత్రి అన్నాడు.

ముస్లింలను అడ్డుకోకపోతే వారు నమాజ్ చేస్తున్న చోట్ల మసీదులు కడతారన్న ప్రచారోద్యమం మొదలైంది. ఇలాంటి సమయంలోనే గుర్గావ్‌లో బాధ్యతకల పౌరులు జోక్యం చేసుకున్నారు. వారి చొరవతో గుర్గావ్ ఐక్య పౌర సమితి వేదిక ఏర్పాటైంది. శాంతి నెలకొనేందుకు, నమాజ్ చేసుకొనే ముస్లింలను వేధించకుండా ఉండేందుకు వారు ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపారు. అధికారులు

తీవ్రమైన రాజకీయ వత్తిడి కింద నలుగుతున్నట్లు స్పష్టమైంది. కొంతమంది అధికారులు తమ బాధ్యత నిర్వర్తించేందుకు ప్రయత్నించారు.

ఏ ఒక్కరినీ ఇబ్బంది పెట్టకుండా బహిరంగ ప్రదేశాల్లో దశాబ్దాలుగా జరుగుతున్న సామూహిక నమాజ్‌ను రెండు, మూడు వారాల్లోనే వివాదాస్పదంగా మార్చారు. బహిరంగ ప్రదేశాలకి మరో హక్కుదారుడు బయల్దేరాడు. హింసకు పాల్పడుతున్న దుండగులను హిందువులకు నిజమైన ప్రతినిధులుగా ముద్రవేసి, వారిని చర్చలకు ఆహ్వానించారు.

ప్రభుత్వం శాంతి కావాలంది. కానీ శాంతికి భంగం కలిగిస్తున్నదెవరు? నమాజ్ చేస్తున్నవారా లేక వారిపై దాడి చేస్తున్న దుండగులా? దానికి సమాధానం తెలుస్తూనే ఉంది. కానీ పరిస్థితిని అర్థం చేసుకోవాలని ముస్లింలను కోరుతున్నారు. ప్రభుత్వం అన్నిచోట్లా రక్షణ కల్పించడం కుదరదని చెప్పి ప్రార్థనా ప్రదేశాల సంఖ్యను 37కి కుదించింది. మాలో కొంతమందిమి నమాజ్ జరుగుతున్న ప్రదేశాలకు వెళ్ళి దాడుల నుంచి ముస్లింలకు రక్షణ కల్పించటం కోసం మానవహారంగా ఏర్పడిన సందర్భాలు నాకు గుర్తున్నాయి.

సంపూర్ణ ప్రశాంతతతో ప్రార్థన చేసుకోవటం కోసం ముస్లింలు ఒకచోట చేరుతుండగా, హింసాకాండ జరిగే ప్రమాదం వారిని చుట్టుముడుతున్నది. పోలీసులు కాపలాగా నిలబడుతున్నారు. అతి మామూలు విషయమైన నమాజ్‌ను ముస్లింలకు వ్యతిరేకంగా కూడగట్టటానికి ఉపయోగించుకుంటున్నారు.

అప్పుడొక పెద్ద చర్చ నడిచింది. ఇది జరగటానికి ఏది కారణమో అర్థం చేసుకోవటానికి మానవ శాస్త్రం, సామాజిక శాస్త్రం, సామాజిక మనోవైజ్ఞానిక శాస్త్రం, అన్ని విజ్ఞాన శాస్త్రాలను ఉదహరించారు. ఈ సమస్యకి వలసలు కారణమా, జనసంఖ్యలో మార్పులు జరిగాయా అంటూ చర్చను ప్రారంభించారు. ఖాళీగా ఉన్న బహిరంగ ప్రదేశాలలో ప్రార్థన చేయటం ముస్లిం ప్రాథమిక హక్కు కాదు అని వాదించటం మొదలు పెట్టారు. ఇక్కడ సమస్య బహిరంగ ప్రదేశాలను (తాత్కాలికంగా) ఉపయోగించటం కాక, హిందుత్వ గ్రూపుల రాజకీయ ప్రయోజనాలు అన్న విషయం మర్చిపోయారు. హజ్ హౌస్, ఉర్దూ, ఆహారం తదితర ముస్లింలకు సంబంధించిన వాటన్నింటినీ వివాదాస్పదం చేశారు. కొంతమంది స్థానికులను కూడగట్టుకున్న దుండగుల గుంపులు నమాజ్

> ❝ ప్రభుత్వం శాంతి కావాలంది. కానీ శాంతికి భంగం కలిగిస్తున్నదెవరు? నమాజ్ చేస్తున్నవారా లేక వారిపై దాడి చేస్తున్న దుండగులా? దానికి సమాధానం తెలుస్తూనే ఉంది. కానీ పరిస్థితిని అర్థం చేసుకోవాలని ముస్లింలను కోరుతున్నారు. ప్రభుత్వం అన్నిచోట్లా రక్షణ కల్పించడం కుదరదని చెప్పి ప్రార్థనా ప్రదేశాల సంఖ్యను 37కి కుదించింది. మాలో కొంతమందిమి నమాజ్ జరుగుతున్న ప్రదేశాలకు వెళ్ళి దాడుల నుంచి ముస్లింలకు రక్షణ కల్పించటం కోసం మానవహారంగా ఏర్పడిన సందర్భాలు నాకు గుర్తున్నాయి. ❞



గుర్‌గాంవ్‌లో మైనారిటీల షాపులపై దాడులు

జరుగుతున్న ఒకచోటు నుంచి మరో చోటుకి తిరుగుతూ కనబడుతున్నారు. ముస్లింలపై హిందువుల మనస్సుల్లో ఉన్న అనుమానాన్ని వాడుకుని నమాజ్ అంటే భూమిని ఆక్రమించే కుట్ర అనీ, అది 'హిందూ ప్రయోజనాలకి' ప్రమాదమని చిత్రిస్తున్నారు.

ప్రభుత్వం ఎట్టి పరిస్థితి లోనైనా సరే శాంతి కావాలంటోంది. అందుకని హింసాత్మక గ్రూపులను బుజ్జగిస్తోంది. ముస్లింలు తామున్న సున్నితమైన పరిస్థితిని అర్థం చేసుకోవాలని అంటోంది. వారు నమాజ్ చేస్తున్న మరికొన్ని ప్రదేశాలను వదులుకోవాలని ఒప్పిస్తోంది. వాళ్ళు ఒప్పుకోకపోయినట్లైతే అన్నిచోట్లా వాళ్ళకి అనుమతి నిరాకరిస్తామని బెదిరిస్తోంది. శాంతి కంటే నమాజ్ విలువైనదా అన్న ప్రశ్నను ముందుకుతెస్తున్నారు.

ఈ విజయంతో హిందుత్వ గ్రూపులు ఉత్సాహభరితులయ్యారు. శుక్రవారాలు డప్పులు కూడా చేర్చి సామూహిక ప్రార్థన చేస్తామని అంతకుముందే ప్రకటించారు. దేవుడి దయ వల్ల ఈ సంవత్సరం గోవర్ధన పూజ నవంబర్ మొదటి శుక్రవారమే వచ్చింది. శుక్రవారం మధ్యాహ్నంలో మతపరమైన పూజ చేసే ఒక కొత్త ఆచారాన్ని ఇప్పటి నుంచి గుర్గావ్ లోని హిందువులు చూస్తారు. కాని పూజచేసే వారి పెదవుల మీద ఉండేది దేవుని నామం కాదు. ముస్లింల మీద వాళ్ళ మనసుల్లో ఉన్న ద్వేషానికి సరిపడే దుర్భాషలు వారి నోటి నుండి వస్తున్నాయి. ఈ విధమైన పూజలతో ఈ 'భక్తులు' ప్రచారం చేస్తున్న మతం నించి దేవుళ్ళు పారిపోయారు.

ఈ దౌర్జన్యాలు చేసే మూకల ఒత్తిళ్లకు పోలీసులు, పౌర అధికారులు లొంగిపోతే వారు తమ విలువను తామే తగ్గించుకున్నట్లవుతుందని మనం తప్పనిసరిగా చెప్పాలి. వాళ్ళు ముస్లింలను బలవంతంగా ఒప్పిస్తారు. కానీ హింసాత్మక గ్రూపులపై చర్య తీసుకోలేరు. వాళ్ళు తమ మనసులో అధికారంలో ఉన్న రాజకీయ నాయకులను నిందిస్తారనటంలో సందేహం లేదు. కాని దానితో శాంతిని పరిరక్షించటం సాధ్యం కాదు.

**(అనువాదం: కురెళ్ళ పుష్పవల్లి)**

చరిత్ర

# మత విప్లవాలు

ఎంవిఎస్ శర్మ



రచయిత ప్రజాశక్తి సంపాదకులు

భారత ఉప ఖండంలో తాత్విక వివేచన క్రీ.పూ. 1000 సంవత్సరాల నాడు మొదలైందని చెప్పాలి. రుగ్వేదం పదవ మండలం ఆ కాలంలో రూపొందింది. అందులోని 129వ సూక్తం ఆనాటి తాత్విక చింతన ఏ విధంగా ఉండేదో సూచిస్తుంది. అందులో లేవనెత్తిన అంశాలు ఈ విధంగా ఉన్నాయి:

"ప్రకృతి తత్వాన్ని ఎరిగినవాడెవ్వడు? దానిని ఎవడు వర్ణించగలడు? ఏ కారణం వలన ఈ సృష్టి జరిగింది? సృష్టి ఎక్కడ మొదలైంది? ఎవడికి తెలుసు?

విభిన్నమైన ఈ సృష్టి ఎక్కడినుంచి జరిగింది? ఈ సృష్టి చేసినదెవడు? చేయనిదెవడు? ఈ సంగతి పైలోకంలో ఉండేవారికే తెలుసు. వారికి సైతం తెలుసునో? తెలియదో?

అదంతా అనిశ్చితం. నిశ్చితం ఎలా అవుతుంది? అనిశ్చితంగానే ఉంటుంది. ఇది సత్యం."

ఇలా ప్రాచీన కాలంలో తాత్విక వివేచన అంతా అపనమ్మకాలతో, సందేహాలతో, విశ్వాసాలతో, ప్రశ్నలతో సాగింది. బుద్ధుడి కాలం నాటికి అనేక సిద్ధాంతాలు పుట్టుకొచ్చాయి. ఈ విశ్వం ఆవిర్భావం గురించి, ఆత్మ స్వభావం గురించి, ఇతర అంశాల గురించి వచ్చిన తాత్విక సిద్ధాంతాలలో పరస్పర విరుద్ధంగా ఉండేవి చాలానే ఉన్నాయి.

బ్రాహ్మణ మతం ఆనాటి తాత్విక సిద్ధాంతాలను "ఆస్తిక", "నాస్తిక" అనే రెండు తరగతులుగా విభజించింది. "ఆస్తిక" అంటే దైవాన్ని విశ్వసించేవారు అన్న అర్థంలో జరిగిన విభజన కాదు. అలాగే "నాస్తిక" అంటే దైవాన్ని విశ్వసించనివారు అని కూడా బ్రాహ్మణమతం భావించలేదు. వేదాలు ప్రామాణికమైనవి అని అంగీకరించిన తాత్విక సిద్ధాంతాలు "ఆస్తిక" సిద్ధాంతాలు అని, వేద ప్రమాణాన్ని తిరస్కరించిన సిద్ధాంతాలు "నాస్తిక" సిద్ధాంతాలు అని పరిగణించింది.

వేద ప్రమాణాన్ని తిరస్కరించిన సిద్ధాంతాలను నీచమైనవిగాను, వేద ప్రమాణాన్ని అంగీకరించినవి గొప్పవిగాను బ్రాహ్మణ మతం భావించింది. ఆది శంకరుని అనుయాయి, 14వ శతాబ్దానికి చెందిన మాధవాచార్యుడు శృంగేరి పీఠాధిపతిగా ఉంటూ "సర్వ దర్శన సంగ్రహం" అనే గ్రంథాన్ని రచించాడు. అందులో 16 మత, తాత్విక దర్శనాల గురించి పేర్కొన్నాడు. వేదాంత దర్శనానికి ఎంత దగ్గరగా ఉంటే అంత గొప్ప తాత్విక దర్శనంగాను, ఎంత వ్యతిరేకంగా ఉంటే అంత నీచమైన దర్శనంగాను అతడు పేర్కొన్నాడు. ఆ విధంగా వేదాంత దర్శనం అత్యంత ఉత్తమమైన దర్శనంగాను, చార్వాక దర్శనం అత్యంత నీచమైన దర్శనంగాను మాధవాచార్యుడు ప్రకటించాడు.

బ్రాహ్మణ మతంలో వ్యక్తమైన (ఇప్పటికీ వ్యక్తమౌతున్న) ఈ అసహనం మనకు బౌద్ధంలో గానీ, జైనంలో గానీ కనపడదు. తాము ప్రతిపాదించిన తాత్విక సిద్ధాంతాలను వారు సైతం ఉత్తమమైనవిగా పరిగణించినప్పటికీ, తక్కిన సిద్ధాంతాలను తమకన్నా విభిన్నమైనవిగా పేర్కొన్నారే తప్ప నీచత్వాన్ని ఆపాదించలేదు.

తన కాలంలో ఉనికిలో ఉన్న వివిధ తాత్విక సిద్ధాంతాలలో వ్యక్తమైన పరస్పర భిన్నత్వాలను బుద్ధుడు క్రింది విధంగా క్రోడీకరించాడు:

1. (అ) ప్రతీదీ ఉనికిలో ఉంది

(ఆ) ఏదీ ఉనికిలో లేదు.

2. (అ) ప్రతీదీ ముందుగానే నిర్ణయించబడింది.

(ఆ) దేనికీ కారణం లేదు. ఏదీ మన చేతిలో లేదు.

3, (అ) ఎవడు చేసిన పనిలో ఉండే నైతికత (మంచి, చెడు) బట్టి వాడికి ఆసందం గాని దు:ఖం గాని కలుగుతాయి.

(ఆ) ఆనందం గాని దు:ఖంగాని మన చేతుల్లో లేవు.

4. (అ) మన ఇంద్రియాలకు ఆనందాన్ని, సుఖాన్ని కలిగించడమే జీవిత లక్ష్యం

(ఆ) ఇంద్రియ సుఖాలను వదులుకోవడం ద్వారా మాత్రమే ముక్తి సాధించవచ్చు.

పైన వ్యక్తం అయిన భిన్నత్వాల నడుమ అనేక తాత్విక భావాలు సిద్ధాంతాలుగా పుట్టుకొచ్చాయి. బౌద్ధ, జైన గ్రంథాలలో దాదాపు 360కి పైగా తాత్విక సిద్ధాంతాల గురించి ప్రస్తావనలు ఉన్నాయి.

తలరాత లేదా విధి, కాలం, స్వభావ వాదం, యాదృచ్ఛికత, వంటి తాత్విక భావనలు ప్రతిపాదించబడ్డాయి. దేవుడొక్కడే అనేవారు, దేవుళ్ళు చాలామంది అనేవారు, విశ్వసృష్టి వాదులు, ఇంద్రియానుభూతులే ప్రధానం అనేవారు, పదార్థమే ప్రధానం అనేవారు, దృగ్గోచరాలు మాత్రమే వాస్తవం అనేవారు, ఎవడి కర్మకు వాడే బాధ్యుడు అనేవారు, సర్వం నాశనమైపోతుంది అనేవారు, విశ్వం శాశ్వతం అనేవారు – ఇలా పలురకాల తాత్విక వాదులు వచ్చారు.

సాంప్రదాయ తాత్విక సిద్ధాంతం, పరమాత్మ ఈ సృష్టికి మూలం అని ప్రతిపాదించింది. తాను ఒక్కడే ఉండిపోవడాన్ని భరించలేక పరమాత్మ తనను తాను ప్రకృతిగాను, పురుషునిగాను విభజించుకున్నాడు. మానవుల రూపంలో, ఇతర జంతువుల రూపంలో ప్రకృతితో పురుషుడు సంగమించిన ఫలితంగా ఈ విశ్వం రూపొందింది. – ఈ సారాంశం వివిధ

> “ బ్రాహ్మణమతం లేదా వైదిక మతం చేసే సాంప్రదాయ వాదాన్ని తిరస్కరిస్తూ తమదైన సిద్ధాంతాలను, మతాలను ప్రతిపాదించిన వారిలో మహావీరుడు, బుద్ధుడు ముఖ్యులు. ఈ ఇద్దరే కాకుండా ఇంకా ఇతరులు కూడా ఉన్నారు. అశోకుడి కాలంలోను, ఆ తర్వాత అతడి మనవడు దశరధుడి కాలం (క్రీ.పూ.210) వరకూ అజివికులు అనే సన్యాసులు ఉండేవారు. దాదాపు 300 ఏళ్ళు వీరి సాంప్రదాయం కొనసాగింది. ”



బుద్ధిజం భారత దేశంలో అణచివేయబడింది. ఇతర అనేక దేశాల్లో స్థిరపడింది: జపాన్‌లోని కమకురాలో భారీ బుద్ధ విగ్రహం

రూపాలలో అనంతర కాలంలో కొనసాగుతూవచ్చింది.

ఇక సాంప్రదాయ విరుద్ధమైన తాత్విక సిద్ధాంతాలు పరమాత్మ ఉనికిని గుర్తించడానికి నిరాకరించాయి. నీటినుండే ఈ విశ్వం పుట్టిందని, గాలినుండి, నిప్పు నుండి, ఆకాశం (?) నుండి ఈ ప్రపంచం పుట్టిందని ఆ సిద్ధాంతాలు ప్రతిపాదించాయి. మరికొందరు అణువుల కలయికనుండి ఈ విశ్వం పుట్టిందని, అణువులు నాశనం కావని చెప్పారు. బుద్ధుడు సృష్టి ఎలా మొదలైందన్న చర్చ చేయడం వృధా అని చెప్పాడు.

బ్రాహ్మణమతం లేదా వైదిక మతం చేసే సాంప్రదాయ వాదాన్ని తిరస్కరిస్తూ తమదైన సిద్ధాంతాలను, మతాలను ప్రతిపాదించిన వారిలో మహావీరుడు, బుద్ధుడు ముఖ్యులు. ఈ ఇద్దరే కాకుండా ఇంకా ఇతరులు కూడా ఉన్నారు.

### అజివికులు

అశోకుడికాలంలోను, ఆ తర్వాత అతడి మనవడు దశరధుడి కాలం (క్రీ.పూ.210) వరకూ అజివికులు అనే సన్యాసులు ఉండేవారు. దాదాపు 300 ఏళ్ళు వీరి సాంప్రదాయం కొనసాగింది. పాణిని రచించిన వ్యాకరణానికి భాష్యం చెప్పిన పతంజలి (క్రీ.పూ.150) రచనలలో కూడా అజివికుల ప్రస్తావన ఉంది. అజివికులు రచించిన గ్రంధాలేవీ లభ్యం కాలేదు కాని వారి గురించి బౌద్ధ, జైన గ్రంధాలలోను, మాధవాచార్యుడి సర్వదర్శన సంగ్రహంలోను ఉన్న ప్రస్తావనలను బట్టి అజివికుల తాత్విక బోధనల గురించి నిర్ధారించవచ్చు.

పురాణ కశ్యపుడు, పకుధ కాత్యాయనుడు, మక్కలిపుత్ర గోశాలుడు ఈ సాంప్రదాయాన్ని ప్రచారం చేసిన ప్రముఖులు. కోసల రాజ్యంలోను, పరిసర ప్రాంతాల్లోను ఈ సాంప్రదాయం వ్యాపించివుండేది.

పశువుల పాకలో జన్మించినందున గోశాలుడు అనే పేరు వచ్చిందని, అతడు ఒక సేవకుడిగా జీవిస్తూ, తన యజమాని నిర్బంధాన్ని వ్యతిరేకించి దూరంగా పారిపోయి జీవించాడని చెప్తారు. అజివికులు ఇతరుల పెత్తనాన్ని అంగీకరించని స్వతంత్రులు అని, అందరూ భుజించే ఆహారాన్ని తప్ప తమకోసం ప్రత్యేకంగా ఆహారాన్ని తయారుచేస్తే స్వీకరించేవారు కాదని, కరువు కాటకాల సమయంలో ఆహార సేకరణ చేసేవారు కాదని, మాంసాహారాన్ని గాని, మత్తు పదార్థాలను గాని స్వీకరించేవారు కాదని మనకు తెలుస్తోంది. బుద్ధఘోషుడు (క్రీ.శ.5వ శతాబ్దం) రచనల్లో అజివికుల ప్రస్తావన ఉంది. పతంజలి రచనల్లో కూడా వీరిగురించి ప్రస్తావించారు. అజిత కేశ కంబళుడు ఈ అజివికులలో ఒకడు. ప్రతీదీ నశించేదే కనుక ప్రతీకారేచ్ఛ ఉండకూడదని అతడు ప్రబోధించాడు. మనం చేసిన కర్మను బట్టే మనకు ఫలితాలు లభిస్తాయని గోశాలుడు చెప్పాడు. ద్రవిడ ప్రాంతంలో అజివిక తత్వం క్రీస్తుశకం తొలి కాలంలో ప్రచారంలో ఉండేది. అప్పటికి గోశాలుడు ఆరాధ్య దైవమే అయ్యాడు.

అజివికులు అష్ట ‘మహానిమిత్తములు’, ‘రెండు మార్గాలు’ బోధించారని జైన గ్రంధాలు సూచిస్తున్నాయి. ఐతే ఆ వివరాలు లభించలేదు.


### జైనం

జైన మతాన్ని ప్రతిపాదించినది మహావీరుడు కాదు. జైన సాంప్రదాయంలో గురువులను తీర్థంకరులు అంటారు. జైన తీర్థంకరులలో మహావీరుడు 24వ వాడు, ఆఖరివాడు. ఇరవైనాలుగు తీర్థంకరులలో రిషభనాధుడు, అరిష్టనేమి అనేవారిద్దరిపేర్లూ మనకు రుగ్వేదంలో కూడా కనిపిస్తాయి. ఐతే వాళ్ళూ, వీళ్ళు ఒక్కరే అన్న నిర్ధారణ చేయడం కష్టం. 23వ తీర్థంకరుడు పార్శ్వ నాధుడు మహావీరుడికన్నా 250 సంవత్సరాలకు ముందు జీవించాడు. మహావీరుడి తల్లిదండ్రులు పార్శ్వనాధుడి అనుయాయులుగా ఉండేవారు.

మహావీరుడి చిన్నప్పటి పేరు వర్ధమానుడు. వైశాలి (నేటి బీహార్‌లో ఒక ప్రాంతం) కి చెందిన లిచ్ఛవీ గణానికి జ్ఞాతులుగా ఉన్న ఒక గణానికి నాయకుడిగా ఉన్న సిద్ధార్థుడు వర్ధమానుడి తండ్రి. గణరాజ్యానికి యువరాజుగా వర్ధమానుడు ఉన్నప్పటికీ చిన్ననాటినుండే తాత్విక అన్వేషణ మెండుగా ఉండడంతో తన 30వ ఏట భార్యాబిడ్డలను విడిచిపెట్టి ‘నిర్గ్రంతుల’ బృందం (ఏ బంధాలూ లేనివారు అని అర్థం) లో చేరి 12 సంవత్సరాలపాటు తిరిగాడు. ఆ

> "ఈ విశ్వం ఉనికికి, నడవడికకు దైవంతో సంబంధం లేదు అని జైనం చెప్తుంది. ఆ విధంగా చూసినప్పుడు జైనాన్ని నిరీశ్వర వాదం అని చెప్పవచ్చు. వాస్తవ పరిస్థితిని ఎప్పుడూ సాపేక్షంగానే అర్థం చేసుకోగలమని జైనం ప్రతిపాదించింది. ఇది భారతీయ తర్కానికి గొప్పగా దోహదపడింది. జైనం చెప్పే స్యాద్ వాదం ప్రతీ అంశంలోని అనుకూల, ప్రతికూల పార్శ్వాలను పరిగణన లోకి తీసుకుంటుంది."

సమయంలోనే అతడు గోశాలుడిని కూడా కలిశాడు. ఇద్దరి తాత్విక భావాలకూ పొంతన కుదరలేదు. దానివలన విడిపోయి జైనుడయ్యాడు. (జిన అంటే జయించినవాడు అని అర్థం) 30 ఏళ్ళపాటు తన బోధనలను ప్రచారం చేశాడు. మగధ రాజధాని రాజగృహ వద్ద ఉన్న పావ అనే పట్టణంలో మరణించాడు. అప్పటికి బుద్ధుడు ఇంకా జీవించేవున్నాడు. మహావీరుడు బహుశా క్రీ.పూ.500 ప్రాంతంలో మరణించివుండవచ్చునని పాళీ గ్రంధాల ఆధారంగా నిర్ధారించవచ్చు. "పంచ మహా వయ్య" (ఐదు గొప్ప శపథాలు) అని మహావీరుడు బోధించినవి అహింస, సత్యం, ఆస్తేయ (పరుల సొమ్ము దొంగిలించకుండా వుండడం), బ్రహ్మచర్యం, అపరిగ్రహ (ఏ సంపదనూ కలిగివుండకపోవడం). జైన మతం ప్రచారంలో పెట్టిన త్రిరత్నాలు సమ్యక్ జ్ఞానం (సమ్యక్ అంటే సరైన) సమ్యక్ తాత్విక సిద్ధాంతం, సమ్యక్ నడవడిక. జీవులకు, నిర్జీవ పదార్థానికి నడుమ జరిగే సంయోగమే 'కర్మ'. ఈ కర్మ ద్వారావిశ్వం నిరంతరం కొనసాగుతూవుంటుంది. కోపం, గర్వం, మోసం, దురాశ అనేవి లేకుండా వ్యవహరించడమే సమ్యక్ నడవడిక.



క్రీస్తు శకం 11వ శతాబ్దం నాటి జైన శ్వేతంబర తీర్థంకరుని ప్రతిమ

ఈ విశ్వం ఉనికికి, నడవడికకు దైవంతో సంబంధం లేదు అని జైనం చెప్తుంది. ఆ విధంగా చూసినప్పుడు జైనాన్ని నిరీశ్వర వాదం అని చెప్పవచ్చు. వాస్తవ పరిస్థితిని ఎప్పుడూ సాపేక్షంగానే అర్థం చేసుకోగలమని జైనం ప్రతిపాదించింది. ఇది భారతీయ తర్కానికి గొప్పగా దోహదపడింది. జైనం చెప్పే స్యాద్ వాదం ప్రతీ అంశంలోని అనుకూల, ప్రతికూల పార్శ్వాలను పరిగణన లోకి తీసుకుంటుంది.

పెళ్ళి. చావు, పుట్టుక వంటి సందర్భాలలో జైనులు దాదాపు వైదిక పద్ధతులనే అనుసరించారు. క్రమంగా జైనులు కులవ్యవస్థలో అంతర్భాగం అయిపోయి వివిధ కులాలుగా రూపొందారు.

**శ్వేతాంబరులు - దిగంబరులు**

జైనుల్లో రెండు ప్రధానమైన సాంప్రదాయాలు ఉన్నాయి. తెల్లని దుస్తులు ధరించే శ్వేతాంబరులు, ఆకాశాన్ని దుస్తులుగా చేసుకున్న (దిగంబరంగా ఉన్న) దిగంబరులు ఆ రెండు సాంప్రదాయాలను పాటిస్తారు. భిక్షాపాత్రలో ఆహారాన్ని స్వీకరించడం, తెల్లని దుస్తులు మాత్రమే ధరించడం శ్వేతాంబరుల పద్ధతి. మహిళలు కూడా ముక్తి (నిర్వాణం) పొందగలరని వీరు భావిస్తారు. ఇక దిగంబరులు నగ్నంగానే ఉంటారు. తమ చేతులతోటి మాత్రమే భిక్షను స్వీకరిస్తారు. వేరే భిక్షాపాత్రను ఉపయోగించరు. మహిళలు ముక్తి సాధించగలరన్న అభిప్రాయాన్ని వీరు అంగీకరించరు.

లభించిన చారిత్రిక ఆధారాలను బట్టి క్రీ.పూ. 3వ శతాబ్దం వరకూ జైన తీర్థంకరులు నగ్నంగానే సంచరించినట్టు తెలుస్తోంది. క్రీ.పూ.5 వ శతాబ్దికి చెందిన రిషభ తీర్థంకరుడు దుస్తులు ధరించినట్టు శిలా ఫలకాల ఆధారాలు తెలియజేస్తున్నాయి. మొత్తంమీద చూసినప్పుడు జైనులలో భిన్న సాంప్రదాయాలుగా చీలిపోవడం వెనుక వారు పాటించిన ఆచారాల విషయంలో వచ్చిన తేడాలే ప్రధానంగా కానవస్తున్నాయి తప్ప సైద్ధాంతిక విభేదాలు ప్రధానం కాదు.

సాధారణ కుటుంబ జీవితం నుండి వేరుపడి ఒక కొత్త తరహాలో, సామూహిక కట్టుబాట్లతో నిరాడంబరంగా జీవించడం జైన స్వాముల పద్ధతి.

జైన మత సాంప్రదాయాలను, సిద్ధాంతాలను తెలియజేసే రచనలను ఆగమాలు అంటారు. మొదటి తీర్థంకరుల నుండి 24వ తీర్థంకరుడు వర్ధమాన మహావీరుని వరకూ చెప్పిన ప్రవచనాలనే ఆగమాలుగా రూపొందించారు. వీటిలో దాదాపు వేయి సంవత్సరాల కాలానికి చెందిన గాథలు, తాత్విక ధోరణులు, పాటించవలసిన నియమాలు వంటివి ఉన్నాయి. ఐతే ఈ ఆగమాలు రాతపూర్వకంగా లభిస్తున్నవి మాత్రం క్రీ.శ. 11వ శతాబ్దం నాటినుండే.

**(బౌద్ధం గురించి వచ్చే సంచికలో)**

**'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

పుస్తక సమీక్ష

# చౌదరి తేజేశ్వరరావు గారి అనుభవాలు, జ్ఞాపకాలు: ఒక పరిశీలన




**చెరుకూరి సత్యనారాయణ**

"శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటం'' అనే పేరు 1968 నుండి దేశవ్యాపితంగా ఊదర కొట్టబడుతున్నది. నా మటుకు నేను ఈ పదబంధాన్నే అంగీకరించను. ఎందుకంటే 68 నుండి అక్కడ జరిగిందని చెప్పబడే ఈ "పోరాటం"లో పోరాటమేమీ లేదు. ఉన్నదంతా వర్గశత్రు నిర్మూలన పేరిట దుందుడుకు వాదులు చేసిన హత్యలు, తప్పిదాలు వాటిని ఉపయోగించుకుని రాజ్యం ప్రజలపై జరిపిన తీవ్ర హింసాకాండ మాత్రమే. ఈ ప్రహసనాన్నే విముక్త ప్రాంతమనీ, భారతదేశపు యునాన్ అనీ చారు మజుందార్ నాయకత్వంలోని పార్టీ అభివర్ణించింది. నిజానికి 1968 వరకు శీకాకుళం గిరిజనోద్యమం తీవ్ర అణచివేతను ఎదుర్కొని ప్రజా ఉద్యమంగా సాగింది. కానీ నగ్జలైట్లు అతివాద దుందుడుకు వాదంతో చేసిన పొరపాట్ల వల్ల ప్రజలపై అణచివేత మరింత తీవ్రమైంది. అతివాద దుస్సాహసికుల చర్యలు ప్రజలను ప్రేక్షక పాత్రలోకి నెట్టాయి. దాంతో పోలీసు, సైన్యం సహాయంతో ఉద్యమాన్ని అణచివేయడానికి రాజ్యానికి అవకాశం చిక్కింది. ఈ అణచివేతలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు.

"శ్రీకాకుళం సాయుధ పోరాటానికి" ఆసాంతమూ నాయకత్వం వహించిన చౌదరి తేజేశ్వరరావు గారు తన "అనుభవాలు – జ్ఞాపకాలు" గ్రంధస్తం చేయగా ప్రజాశక్తి బుక్‌హౌస్ వారు ఈ నవంబర్‌లో ప్రచురించారు.

తాను నాయకత్వం వహించి నడిపిన ఉద్యమం అనే ప్రేమ కావచ్చు. తన సహచరులైన నాయకులనేకమంది చేసిన బలిదానాల స్మృతుల కారణంగా కావచ్చు, 85 సంవత్సరాల వయస్సులో కొంత జ్ఞాపకశక్తి తగ్గిన కారణం కావచ్చు ఈ ఉద్యమాన్ని ఎక్కడా కించపరచకుండా వాస్తవాలు ప్రకటించటానికే (Statement of Facts) తేజేశ్వరరావు గారు పరిమితమయ్యారు. తరిమెల నాగిరెడ్డి స్మారక కమిటీ తరపున అనేక కుట్ర కేసుల సమాచారంతో కూడిన "సూర్యోదయం కుట్రకాదు'' పుస్తకాన్ని 2015లో నేను ప్రచురించాను. దీనికి అవసరమైన సమాచారం కోసం ఆనాటి "ఉద్యమ" ప్రాంతాలన్నీ తిరిగి, ఆనాటి నాయకులందరినీ కలిసి చాలా విషయాలు సేకరించాను. చౌదరి తేజేశ్వరరావు గారిని కూడా చాలా విస్తృతంగా ఇంటర్వ్యూ చేశాను. ఆ తర్వాత కూడా ఫోన్ చేయటం ద్వారా ఆయన్నుండి కొన్ని అనుమానాలు తీర్చుకున్నాను. అప్పుడే తన జ్ఞాపకాల్ని రాయమని అడిగాను. కాని అనారోగ్య పరిస్థితి కారణంగా ఆయన దానిపై అంత ఉత్సాహం చూపించలేదు. కొంచెం ఆలస్యంగా అయినా ఈ జ్ఞాపకాలు ప్రజలకందటం సంతోషం. ఈ అనుభవాల్నే పది, పదిహేను సంవత్సరాల క్రితం రాసివుంటే జ్ఞాపక లోపం కారణంగా ఒకటి రెండు చిన్న పొరపాట్లు కూడా జరక్కుండా వుండేవి. ఉద్యమంలో జరిగిన తీవ్రమైన తప్పులు ఎత్తిచూపి వాటి నుండి గుణపాఠాలు తీసి వుంటే బాగుండేది.




ఆయన్ని నేను ఇంటర్వ్యూ చేసినప్పుడు చివర్లో ఒక ప్రశ్న అడిగాను. "ఇన్ని తప్పులు జరుగుతుంటే మీ అందరిలో ఎవరికైనా తప్పు చేస్తున్నామని అనిపించలేదా?'' అన్నాను. దానికి తేజేశ్వరరావు గారు ఎవరికీ అలా అన్పించ లేదు. కాని పంచాది కృష్ణమూర్తి మాత్రం అలాంటి అభిప్రాయాలు వ్యక్తపరిచేవాడని, ఆయన కూడా ఆ విషయాలపై ఎప్పుడూ తీవ్రంగా చర్చించలేదని అన్నాడు.

తేజేశ్వరరావు గారు తన రెండేళ్ళ అజ్ఞాతవాసం, పదమూడున్నర ఏళ్ల జైలు జీవితం గడిపి విడుదలై వచ్చి సి.పి.యంలో చేరిన తర్వాత పార్టీ పనులపై బస్సులో వెళు ండగా నక్సలైట్లు జరిపిన కాల్పుల్లో తీవ్రంగా

❝ 1969 మార్చి 1, 2 తేదీల్లో గుంటూరు జిల్లా గుత్తికొండ బిలంలో జరిగిన సమావేశానికి కొండపల్లి సీతారామయ్య వచ్చాడని రాశారు. అది వాస్తవం కాదు. సీతారామయ్య గారి కొడుకు చంద్రశేఖర్ అలియాస్ చందు మాత్రమే వచ్చాడు. ఎప్పుడో ఉమ్మడి పార్టీ కాలంలో నైతిక కారణాల రీత్యా పార్టీ నుండి బహిష్కరింపబడ్డ సీతారామయ్యని వారి పార్టీలోకి ఆహ్వానించాలని ఆ సమావేశంలోనే నిర్ణయించారు. తేజేశ్వర రావు గార్ని రాష్ట్ర కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ❞

గాయపడ్డారు. మెదడుకి దెబ్బ తగిలినందున కొంత జ్ఞాపకశక్తిని కూడా కోల్పోయారు. ఈ కారణంగా జరిగిన రెండు లోపాలు ఈ పుస్తకంలో వున్నాయి.

1969 మార్చి 1, 2 తేదీల్లో గుంటూరు జిల్లా గుత్తికొండ బిలంలో జరిగిన సమావేశానికి కొండపల్లి సీతారామయ్య వచ్చాడని రాశారు. అది వాస్తవం కాదు. సీతారామయ్య గారి కొడుకు చంద్రశేఖర్ అలియాస్ చందు మాత్రమే వచ్చాడు. ఎప్పుడో ఉమ్మడి పార్టీ కాలంలో నైతిక కారణాల రీత్యా పార్టీ నుండి బహిష్కరింపబడ్డ సీతారామయ్యని వారి పార్టీలోకి ఆహ్వానించాలని ఆ సమావేశంలోనే నిర్ణయించారు. తేజేశ్వరరావు గార్ని రాష్ట్ర కన్వీనర్‌గా ఎన్నుకున్నారు.

అలాగే శ్రీకాకుళం జిల్లా మల్లివీడులో జరిగిన జంట హత్యల సంఘటన గూర్చి పూర్తి వివరాలు ఇవ్వకపోగా తేజేశ్వరరావు గారు తనకు మరణశిక్ష పడిందని రాశారు. అది తప్పు. ఆయనకి ఆ కేసులో పడింది జీవిత కాలపు శిక్షే. అదీ హైకోర్టులో కొట్టివేయబడింది. ఎందుకో తెలియదు గాని అయనను జైల్లో ఒంటికొట్టులో (Solitary Confinment) కొంతకాలముంచారు. ఇది ఉరిశిక్ష పడిన ఖైదీలను పెట్టే సెల్లు.

ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు కూడా తేజేశ్వరరావు గారు ఎందుకనో రాయలేదు. 21-7-1969 రాత్రి వెంపటాపు సత్యనారాయణ గారి నాయకత్వంలో షుమారు 100 మంది గిరిజనులు ఈ దాడిలో పాల్గొన్నారు. గ్రామంలో భూస్వాములైన కోట సంగంనాయుడు, నేతల అప్పలస్వామి మరికొందరు భూస్వాముల ఇళ్లపై దాడి చేశారు. కానీ అప్పలస్వామి, సంగంనాయుడులు లేకపోవటంతో వారి కొడుకులైన బావాజి నాయుడు, చిరంజీవులు నాయుడుల్ని చంపేశారు. ఎవరో ఒకర్ని చంపాలనే కొత్త కార్యకర్తల ఉత్సాహం, నాయకత్వం వహించిన వ్యక్తి మూర్ఖత్వం కారణంగా ఈ హత్యలు జరిగాయి. కమ్యూనిస్టు పార్టీ ఈ నాటికి ఆ ప్రాంత ప్రజల వ్యతిరేకతను ఎదుర్కొంటున్నది. హత్యకు గురైన చిరంజీవులు నాయుడు పార్టీ సానుభూతిపరుడు, పార్టీ యువజన విభాగంలో పనిచేశాడు. పైగా అప్పటికి వారం క్రితమే పెళ్లి అయింది. చంపే సమయంలో అతని మంచంపై ''రక్తాక్షరాలు'' ''అమ్మ'' పుస్తకాలున్నాయట. అయినా ఈ మూర్ఖులు వదిలిపెట్టకుండా చంపేశారు. పార్వతీపురం కుట్రకేసులో 34వ ముద్దాయిగా వున్న బైరాగి నాయుడు గార్ని (కుంటిభద్ర గ్రామం) నేను ఇంటర్వ్యూ చేసినప్పుడు ఆ ప్రాంతమంతా తనకు బంధువులున్నారనీ, ఆనాటి నుండి ఇప్పటి వరకు వారెవ్వరూ తమను శుభ కార్యాలకు పిలవకుండా వెలివేశారనీ చెప్పాడు. "వర్గ శత్రు నిర్మూలన" వికృత రూపానికి ఈ సంఘటన పరాకాష్ట. ఈ ఘటన సమయంలో తేజేశ్వర రావు వుండి వుంటే ఈ హత్యలు జరిగేవి కాదని కూడా అక్కడివారు చెప్పారు. దురదృష్టం ఏమిటంటే తనకేమాత్రం తెలియని ఈ హత్య కేసులో ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష పడటం.

నక్సలైటు ఉద్యమంలో నాగభూషణం పట్నాయక్, నాగళ్ల శేఖర్‌లకు విశాఖ జిల్లా నక్కవానిపాలెంలో జరిగిన ఒక హత్య కేసులోనూ, ఇంతా రమణారెడ్డికి నెల్లూరు జిల్లాలోని ఒక హత్యకేసులోనూ, తర్వాత అదిలాబాద్ జిల్లాలో భూమయ్య, కిష్టగౌడ్‌లకు మాత్రమే ఉరిశిక్షలు పడ్డాయి. ఇంతా రమణారెడ్డి కేసుని హైకోర్టులో మళ్లీ విచారించిన జస్టిస్ చిన్నపరెడ్డి గారు మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చగా, ప్రజాందోళన కారణంగా పట్నాయక్, శేఖర్‌ల ఉరిశిక్షను రాష్ట్రపతి యావజ్జీవ శిక్షగా మార్చారు. కాగా హక్కుల సంఘాలు భారీస్థాయిలో పోరాడినా ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో భూమయ్య, కిష్టగౌడ్‌లను సికింద్రాబాద్ జైల్లో ఉరితీశారు.

హైకోర్టులో ఇలా తిరిగి విచారణ

'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

జరపటం రాజన్ కేసులో కేరళలోనే జరిగిందని ఇటీవల విడుదలైన 'జైభీమ్' సినిమాలో చెప్పారు. కానీ దానికి చాలాకాలం క్రితమే ఆ రకమైన విచారణ మన హైకోర్టులో జరిగింది. డా॥. ముత్యం రాసిన పాణిగ్రాహి, గంటి రాజేశ్వరరావుల జీవిత చరిత్రలు, శ్రీకాకుళం సాహిత్యంపై ఆయనే రాసిన మరో పుస్తకంలో కొంత సమాచారం ఇచ్చారు. అనేక అంశాలను శోధించి, సేకరించిన సమాచారం వలన రాజన్ కేసు కంటే చాలాకాలం ముందే మన హైకోర్టులోనే ఇలాంటి విచారణ జరిగిందని స్పష్టమైంది.

నిజాం పాలనలో ఆ జిల్లాని "చిఖాకోల్" అనేవారని, శిస్తు డబ్బుల సంచులు తెరిచే ప్రదేశం అనేది దాని అర్థమని, అది క్రమంగా సిక్కోలు, శ్రీకాకుళంగా మారిందని, చౌ అంటే నాలుగు కంటే ఎక్కువ గ్రామాల్లో శిస్తు వసూలు చేసే అధికారి అని, అదే కాలక్రమంలో చౌదరిగా మారిందన్న కొన్ని కొత్త విషయాలు ఈ పుస్తకం ద్వారా తెల్సుకోగలిగాం.

**"నిజాం పాలనలో ఆ జిల్లాని "చిఖాకోల్" అనేవారని, శిస్తు డబ్బుల సంచులు తెరిచే ప్రదేశం అనేది దాని అర్థమని, అది క్రమంగా సిక్కోలు, శ్రీకాకుళంగా మారిందని, చౌ అంటే నాలుగు కంటే ఎక్కువ గ్రామాల్లో శిస్తు వసూలు చేసే అధికారి అని, అదే కాలక్రమంలో చౌదరిగా మారిందన్న కొన్ని కొత్త విషయాలు ఈ పుస్తకం ద్వారా తెల్సుకోగలిగాం."**

శ్రీకాకుళం జిల్లా ఉద్యమాన్ని సమగ్రంగా వివరిస్తూ గతంలో చాలా పుస్తకాలొచ్చాయి. ఇందులో డా॥. బి. శివరామిరెడ్డి గారు రాసిన 'మహత్తర శ్రీకాకుళం గిరిజన పోరాటం', ఆదిభట్ల విద్యాసాగర్ అలియాస్ వెంకట్ రాసిన 'శ్రీకాకుళం గిరిజన ఉద్యమం', వసంతాడ రామలింగాచారి గారి కోర్టు స్టేట్మెంటు ముఖ్యమైనవి. "సూర్యోదయం కుట్రకాదు" పుస్తకంలో నేను కూడా కొంత సమాచారం ఇవ్వగలిగాను. డా॥. ముత్యంరాసిన పాణిగ్రాహి, గంటిల జీవిత చరిత్రలు శ్రీకాకుళం సాహిత్యంపై ఆయనే రాసిన మరో పుస్తకం కూడా కొంత సమాచారం ఇచ్చినా అవన్నీ శోధించి, సేకరించి రాసినవే. తేజేశ్వరరావు లాంటి వారి చేతిలో నుండి వచ్చిన పుస్తకం ప్రత్యక్ష సాక్షి వాంగ్మూలం లాంటిది. ఈ పుస్తకం సమగ్రమైనది కాకపోయినా అన్ని విషయాలు పైపైన తడమబడ్డాయి. అయినా చెప్పిన విషయాల్లో సాధికారికత ఉంది. కనుకనే ప్రచురించిన నెలలోనే మూడు ముద్రణలు పొందగలిగింది.

10-12 తుపాకులు, (అవీ పోలీసుల నుండి స్వాధీనం చేసుకున్నవి) ఏమాత్రం నాణ్యతలేని నాటుబాంబులు, విల్లంబులు, బరిసెలు పట్టుకొని కాళ్లకు చెప్పులు కూడా లేని గెరిల్లాలు అధునాతన ఆయుధాలు కల్గిన సుశిక్షితులైన 7 వేలమంది పోలీసులపై తలపడిన ఈ "పోరాటాన్ని" గూర్చి 1969 అక్టోబరులో ఏజెన్సీ ప్లీనంలో వెంపటాపు సత్యనారాయణ 300 గ్రామాలకు పార్టీ విస్తరించిందనీ, 40 గెరిల్లా దళాలున్నాయనీ, 1,100 గ్రామ సంగ్రామ దళాలున్నాయనీ, ముగ్గురు పోలీసులు అధికారుల్ని, 80 మంది పోలీసుల్ని, 6 గురు ఇన్ఫార్మర్లని, 11 మంది "వర్గ శత్రువుల్ని" "ఖతం" చేశామనీ నివేదించారు. 11 మంది "వర్గ శత్రువుల్ని" సంహరించటం తప్ప మిగిలినవన్నీ అవాస్తవాలే.

ఆనాటి నాయకత్వం ఇంకా చాలా దారుణాలు చేసింది. దూరంగా వున్న పోలీసులు తుపాకులని భ్రమించేట్లుగా కర్రలకు పుల్లలు తగిలించుకొని దళ సభ్యులం తిరిగేవారమని ఒక మహిళా దళ సభ్యురాలు నాకు చెప్పింది. ఏజెన్సీ ప్రాంతంలో "లొజ్జోడు" అనే "మాంత్రికులు" వుండేవారు. వీరిలో ఎక్కువ మంది నపుంసకులై వుంటారు. అడవుల్లో వీరే వైద్యులు, పూజారులు, పురోహితులు, మంత్రగాళ్లు. పోలీసుల తుపాకులు పేలకుండా లొజ్జుడితో మంత్రం వేయించామని, మన తుపాకులే పేలతాయని గిరిజనుల్ని నమ్మిస్తే అమాయకంగా వారు పోలీసులకెదురెళ్లి చనిపోయారని ఒక ఏజెన్సీ నాయకుడు చెప్పాడు.

చాలామంది నాయకులు చనిపోయిన సంఘటనలు తేజేశ్వరరావు గారు పేర్కొన్నారు. ఎక్కువమంది నాయకులు విద్రోహం వల్లనో, సాంకేతికపరమైన జాగ్రత్తలు తీసుకోకపోవటం వల్లనో పోలీసుల వల్ల చంపబడ్డారు. కనీసమైన సాంకేతికపరమైన జాగ్రత్తలు తీసుకోని కారణంగా దజన్ల సంఖ్యలో అమూల్యమైన కార్యకర్తలు చనిపోవటానికి ఈ నాయకత్వం కారణమైంది. శ్రీకాకుళం మొత్తం మరో 6 నెలల్లో విముక్తమవుతుంది, ఈ ప్రాంతం "భారతదేశపు యునాన్" అని చారు మజుందార్ నాయకత్వంలోని ఆ పార్టీ కేంద్ర నాయకత్వం ఊదరకొడ్తుంటే "వసంత మేఘం గర్జిస్తుందని" చైనా పార్టీ నాయకత్వం మరింత ఎగదోసింది. అంతా నాశనమైన తర్వాత నింపాదిగా "మా ఛైర్మన్ మీ ఛైర్మన్ ఎలా అవుతాడు" అని చైనా వెళ్లిన సౌరన్ జోస్తో మాట్లాడారు.

"వర్గ శత్రవు రక్తంలో చేతులు ముంచనివాడు విప్లవకారుడు కాదని", "1975 కల్లా భారతదేశం విముక్తమై ఎర్రరాజ్యం స్థాపించబడుతుందని" కాకి లెక్కలు వేసిన చారు మజుందార్ నాయకత్వ స్థాయి అర్థమైనా దేశంలోనూ, తెలుగు రాష్ట్రాలలోనూ అసంఖ్యాకమైన మేధావులు ఈ వరవడిలో ఎలా కొట్టుకుపోయారో అర్థంకాని విషయం.

అనితరమైన త్యాగాలు చేసిన ఆ మేధావుల్ని 'పారనాయిడ్ స్కిజోఫ్రేనియా', అంటే భ్రమలో కొట్టుకుపోయారు అని అనలేం. కాని వారి తొందరపాటు చర్యలతో రాజ్యం ప్రజలపై తీవ్రమైన దాడులకూ, హింసాకాండకూ పాల్పడ్డానికి అవకాశం ఇచ్చారు. దీనివల్ల కారణంగా కార్యకర్తలు, నాయకులూ, ప్రజలూ, ముఖ్యంగా గిరిజనులూ బలైపోవటం విషాదకరం.

"జ్ఞానానికి వ్యతిరేకం అజ్ఞానం కాదు. జ్ఞానానికి సంబంధించిన భ్రమ" అని సరిపెట్టుకోవటమే.

**(ఈ వ్యాసంలోని అభిప్రాయాలు కేవలం నా వ్యక్తిగతం -రచయిత)**

అంతర్జాతీయం

# కాప్26: వాతావరణ చర్చల వైఫల్యం

ఎస్ వెంకట్రావు



రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటర్

గత అక్టోబర్ 31వ తేదీ నుండి నవంబర్ 13వ తేదీ వరకు బ్రిటన్‌లోని గ్లాస్గో నగరంలో 'కాప్26' పేరుతో జరిగిన వాతావరణ చర్చలు సాధించిందేమిటి అన్న ప్రశ్నకు రకరకాల సమాధానాలు వస్తున్నాయి. 197 దేశాలు పాల్గొన్న ఈ సమావేశాల్లో కుదిరిన 'గ్లాస్గో వాతావరణ ఒప్పందాన్ని' కొందరు ఆశావహులు గుడ్డికన్నా మెల్ల మేలు అని ఆహ్వానిస్తున్నారు. కానీ 'భూ తాపం' (గ్లోబల్ వార్మింగ్) సమస్య తీవ్రతరమై ప్రపంచానికి తీవ్ర ప్రమాద సంకేతాలు పంపిస్తుంటే ఈ సమస్యను పరిష్కరించడానికి ఒప్పందం ఏమాత్రం సరిపోదనీ, కాప్26 కార్పొరేట్ శక్తుల చేతిలో బందీగా మారినందునే అది విఫలమైందని అనేక మంది నిపుణులు, పర్యావరణ వేత్తలు నిరసిస్తున్నారు. గ్లాస్గో చర్చలు విఫలం అయ్యాయంటే అర్థం రానున్న కొద్ది కాలంలోనే ప్రపచం మానవాళి వాతావరణ దృష్ట్యా అనేక వినాశకర పరిణామాలను చవిచూస్తుందనే. గత రెండేళ్ల కాలంలోనే ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లోనూ సంభవించిన వాతావరణ వైపరీత్యాలను అంటే అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా ఖండాల్లో అదుపుచేయలేని దావానలాలు, ఐరోపా, ఆసియా, దక్షిణమెరికా ఖండాల్లో వెల్లువెత్తిన వరదలు, అనేక చోట్ల భరించలేని వడగాడ్పులు మొదలైన వాటిని పరిశీలిస్తే రానున్న కాలంలో ఇంకెంత వినాశకరంగా ఉంటుందో అర్థం చేసుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

1992లో బ్రెజిల్‌లోని లియో నగరంలో ఐరాస ఆధ్వర్యంలో 192 దేశాలు 'ధరిత్రీ సదస్సు' జరిగిన తర్వాత వాతావరణ సమస్యపై ఆయా దేశాలు, సంస్థలతో ఏటేటా సదస్సులు జరుగుతూ వస్తున్నాయి. ఈ సదస్సులను కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ – కాప్ అని పిలుస్తున్నారు. రియోలో జరిగిన కాప్ సదస్సు తరువాత గ్లాస్గోలో జరిగింది 26వ సదస్సు గనుక దీన్ని కాప్ 26 అని పిలుస్తున్నారు. రియో సదస్సు తరువాత 1997లో జపాన్‌లోని క్యోటో నగరంలో జరిగిన కాప్ 3 సదస్సులో 192 దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఆ తరువాత 2009లో కోపెన్‌హాగన్ నగంరంలో జరిగిన కాప్15 సదస్సులో 115 దేశాల అధినేతల మధ్య ఒప్పందం కుదిరింది. దీనికి కొనసాగింపుగా 2015లో ప్యారిస్‌లో జరిగిన కాప్21 సదస్సులో 196 దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. గ్లాస్గో సదస్సు పారిస్ ఒప్పందం తరువాత జరిగిన ప్రధానమైన సదస్సు. అయితే ఆ గత సదస్సుల్లో కుదిరిని ఒప్పందాల మాదిరిగానే గ్లాస్గో సదస్సు కూడా భూ తాపాన్ని, దాని వల్ల వచ్చే విపరిణామాలనూ నివారించడంలో తగిన ఫలితాలు సాధించలేకపోయిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఆ వివరాల్లోకి వెళ్లే ముందు అసలు 'భూ తాపం' (గ్లోబల్ వార్మింగ్) అంటే ఏమిటో, దాని వల్ల మానవ జాతికి వచ్చే ప్రమాదం ఏమిటో క్లుప్తంగా తెలుసుకుందాం!

## ప్రమాద సంకేతాలు

మన భూమి మీద వాతావరణం చాలా సున్నితమైనది. ఇది సూర్యరశ్మిచేత నిత్యం ప్రభావితమవుతుంది. పగలు–రాత్రులు, రుతువులను బట్టి ఉష్ణోగ్రతల్లో మార్పులొస్తాయి. కాని సగటు ఉష్ణోగ్రత మాత్రం స్థిరంగా ఉంటుంది. అలా లేకుంటే భూమి మీద జీవులు నివసించడం అసాధ్యం. ఉదాహరణకు, మన భూమి కేంద్రంలో 7000 సెంటీగ్రేడ్ డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. కాని మన భూమిమీద పగలు ఉష్ణోగ్రత అత్యధికంగా 50 డిగ్రీలు దాటితే మనం వేడికి తట్టుకోలేం. సున్నా డిగ్రీలకన్నా తగ్గిపోతే చలికి తట్టుకోలేం. సైబీరియా లాంటి ప్రదేశాల్లో ఉష్ణోగ్రతలు మైనస్ 50 డిగ్రీలకు చేరుకుంటే జీవితం నరకప్రాయం అవుతుంది. కాని మన భూమికి అతి దూరంగా ఉన్న ప్లూటో గ్రహం మీద ఉష్ణోగ్రత ఎంతో తెలుసా! మైనస్ 230 డిగ్రీలు.

భూమిమీద వంద డిగ్రీల ఉష్ణోగ్రత తేడా (50 నుండి –50 డిగ్రీలు) మనకు చాలా పెద్ద మార్పుగా కనిపిస్తోంది. కాని విశ్వంలో ఉండే ఉష్ణోగ్రతా తేడాలతో పోల్చినప్పుడు ఇది చాలా తక్కువ. భూమ్మీద ప్రస్తుత సగటు ఉష్ణోగ్రత 15 డిగ్రీల సెల్సియస్ (61 డిగ్రీల ఫారిన్‌హీట్). భూమి వాతావరణం యొక్క ఉష్ణోగ్రతల మీద ఆధారపడి వర్షాలు, తుపానులు, హరికేన్లు, వేడి గాలులు, చలిగాలులు, ఇసుక తుపానులు వగైరా వగైరా సంభవిస్తుంటాయి. ఉష్ణోగ్రతల్లో మార్పులు స్థిరంగా ఉంటే ఈ వాతావరణ క్రమం సక్రమంగా ఉంటుంది. ఉష్ణోగ్రత మార్పులు స్థిరంగా లేకుంటే వాతావరణం కూడా క్రమం తప్పి వ్యవహరిస్తుంది. వాతావరణం క్రమం తప్పితే దానిపై ఆధారపడిన మనిషి, ఇతర జీవజాతుల జీవనం కూడా క్రమం తప్పుతుంది. వాతావరణ సమతుల్యత నాశనమైతే మానవ జాతే నాశనమవుతుంది.

భూమి మీద సగటు ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతున్నదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 1950వ సంవత్సరంలో సగటు ఉష్ణోగ్రత 13.0 డిగ్రీల సెలిషియస్ ఉండగా 2000 ఏడాదికి అది 14.6 డిగ్రీలకు పెరిగింది. దీన్నే 'గ్లోబల్ వార్మింగ్' అంటున్నారు. సగటు ఉష్ణోగ్రత ఎందుకిలా పెరుగుతోంది? సూర్యుని నుండి వచ్చే కిరణాలు భూమిమీద పడి తిరిగి అంతరిక్షంలోకి పూర్తిగా వెళ్లిపోకుండా భూమి వాతావరణంలోని కొన్ని వాయువులు అడ్డుకుంటాయి. అందుకనే మనకు రాత్రి పూట కూడా కొంత ఉష్ణోగ్రత ఉంటోంది. ఈ వాయువులే అడ్డు లేకుంటే పగలు ఉష్ణానికి, రాత్రిళ్లు చలికి బతకలేం. ఈ రకంగా

సూర్యరశ్మిని అడ్డుకుని నిలిపి ఉంచే ప్రక్రియను 'గ్రీన్ హౌస్ ఎఫెక్ట్' అంటారు. అలా అడ్డుకునే వాయువులను 'గ్రీన్‌హౌస్ వాయువులు' అంటారు. నీటి ఆవిరి, కార్బన్ డై–ఆక్సైడ్, మిథేన్, నైట్రస్ ఆక్సైడ్‌లు 'గ్రీన్‌హౌస్ వాయువులు'. భూమి మీద ఈ వాయువులు సమతుల్యంగా ఉంటే సగటు ఉష్ణోగ్రత స్థిరంగా ఉంటుంది. కానీ ఈ వాయువుల ఉద్గారాలు పెరిగితే సగటు ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఈ ఉద్గారాలు పెరగడానికి రెండు కారణాలున్నాయి. మొదటిది, అగ్నిపర్వతాలు బద్దలు కావడం వంటి సహజసిద్ధమైన కారణాలు. 'గ్లోబల్ వార్మింగ్' మీద వీటి ప్రభావం తక్కువ. రెండవది, మానవుని కార్యకలా పాలు. భూమి సగటు ఉష్ణోగ్రత పెరగడానికి మానవ కార్యకలాపాలు ప్రధాన కారణం. పరిశ్రమల నుండి వచ్చే వాయువులు, కార్లు, ఇతర మోటారు వాహనాల నుండి వచ్చే వాయువులు ప్రధానంగా భూమి వేడెక్కడానికి కారణమవుతోంది. ముఖ్యంగా పెట్రోలియం, బొగ్గు వంటి శిలాజ ఇంధనాలు వినియోగిస్తే కార్బన్ డై–ఆక్సైడ్ ఇతర 'గ్రీన్‌హౌస్ వాయువులు' వెలువడతాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెంది పారిశ్రామిక విప్లవం వచ్చిన తరువాతనే భూ తాపానికి కారణమైన ఉద్గారాలు గాలిలోకి విడుదల చేయడం ప్రారంభమైంది. తొలుత బొగ్గు, తరువాత పెట్రోలు ఇతర శిలాజ ఇంధనాలు మండించడం, పారిశ్రామిక కార్యకలాపాలు, రవాణా పెరగడం, పశు సంపద అధికం కావడం మొదలైన అనేక కారణాల వల్ల అంతకుముందు సహజంగా ఉండే వాతావరణంలోకి మానవ కార్యకలాపాల వల్ల ఉత్పత్తి అయ్యే ఉద్గారాలు వెలువడడం ప్రారంభమైంది. గత నాలుగు వందల సంవత్సరాల్లో పారిశ్రామిక దేశాలు విడుదల చేసిన ఉద్గారాల వల్ల వాతావరణం వేడెక్కడం ప్రారంభమైంది. ప్రపంచీకరణ తరువాత ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా ఉద్గారాలు విడుదల చేయడం ప్రారంభమైంది. మొత్తం మీద గత 200 సంవత్సరాల కాలంలో వాతావరణంలోకి కార్బన్ డై–ఆక్సైడ్ విడుదల 30 శాతం పెరిగిందని అంచనా వేశారు. మరోవైపు అడవులు నరకడం, పచ్చని పొలాలను నివాస, పారిశ్రామిక ప్రాంతాలుగా మార్చడం వల్ల గాలిలోని కార్బన్ డై–ఆక్సైడ్‌ను పీల్చుకునే మొక్కలు తరిగిపోతున్నాయి. దీని వల్ల 'గ్రీన్‌హౌస్ ప్రభావం' పెరిగి పెద్దదై ప్రకృతి విలయాలు సృష్టించే స్థితికి చేరుకుంది.

> **" గ్రీన్ హౌస్ వాయువుల విడుదలను పెంచుకుంటూ పోతే భూమి ధృవాల వద్దనున్న మంచుకరిగి సముద్రమట్టం పెరుగుతుంది. కోస్తా ప్రాంతాలు సముద్రంలో కలుస్తాయి. దుర్భిక్షాలు, అధికవరదలు, తుపానులు, హరికేన్లు వంటి ప్రకృతి విలయాలు అధికమవు తాయి. మానవుల ఆరోగ్యంలో పెద్ద మార్పులొస్తాయి. జీవజాతులు నాశనమవుతాయి. అందువల్ల 2050 నాటికి శిలాజ ఇంధన వినియోగం 60 శాతం తగ్గించుకోవాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. లేకుంటే ప్రళయాలు తప్పవు. "**

గ్రీన్‌హౌస్ వాయువులు విడుదల చేసే దేశాల్లో అమెరికా అగ్రస్థానంలో ఉంది. ప్రపంచ జనాభాలో 5 శాతం ఉన్న అమెరికన్లు 25 శాతం ఇంధనం వాడుతున్నారు. మిగిలిన ఇంధనాన్ని యూరప్, ఇతర అభివృద్ధి చెందిన దేశాలు వినియోగిస్తున్నాయి. ఐక్యరాజ్య సమితిలో సుమారు 200 దేశాలుండగా 40 దేశాలు 85 శాతం ఉద్గారాలను విడుదల చేస్తున్నాయి. ప్రస్తుతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న చైనా, భారత్‌లు ఉద్గారాల విడుదలలో మొదటి, మూడో స్థానాల్లో ఉన్నాయి. అమెరికా రెండో స్థానంలో ఉంది. అయితే తలసరి ఉద్గారాల విడుదలలో అమెరికా, ఇరత పారిశ్రామిక దేశాలే బాగా ముందున్నాయి. ఇందులో వర్ధమాన దేశాల తలసరి వాటా చాలా తక్కువ.

గ్రీన్ హౌస్ వాయువుల విడుదలను పెంచుకుంటూ పోతే భూమి ధృవాల వద్దనున్న మంచుకరిగి సముద్రమట్టం పెరుగుతుంది. కోస్తా ప్రాంతాలు సముద్రంలో కలుస్తాయి. దుర్భిక్షాలు, అధికవరదలు, తుపానులు, హరికేన్లు వంటి ప్రకృతి విలయాలు అధికమవు తాయి. మానవుల ఆరోగ్యంలో పెద్ద మార్పులొస్తాయి. జీవజాతులు నాశనమవుతాయి. అందువల్ల 2050 నాటికి శిలాజ ఇంధన వినియోగం 60 శాతం తగ్గించుకోవాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. లేకుంటే ప్రళయాలు తప్పవు. ఈ పని ముందుగా అమెరికా, యూరప్, జపాన్ తదితర దేశాలు చేయాలి.

### వాతావరణ చర్చలు

దీనికోసమే 1997లో జపాన్‌లోని క్యోటో నగరంలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఒప్పందం (క్యోటో ఒప్పందం) కుదిరింది. దీనికి అన్ని దేశాలూ అంగీకరించాయి కాని అమెరికా మాత్రం అంగీకరించలేదు. ఈ ఒప్పందంలో అంగీకరించిన చర్యలు తీసుకోవడంతో ప్రపంచ దేశాలు వెనుకబడిపోవడంతో భూతాప ప్రభావం మరింత పెరుగుతూ వచ్చింది. క్యోటో ఒప్పందం నాటికి శాస్త్రవేత్తల హెచ్చరికలను పట్టించుకోని, లేక వాటిని తేలికగా తీసి పారేసిన ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తులు కూడా తరువాత జరిగిన శాస్త్రీయ పరిశోధనలు, ప్రత్యక్ష అనుభవాలు వెల్లడించిన వాస్తవాలతో కళ్లు తెరిచారు. భూతాపం వల్ల వస్తున్న నష్టాలు సుదూర ప్రమాదం కాదనీ, ఇప్పటికే ప్రమాదం అనేక విధాల ముంచుకొచ్చిందని వాతావరణ మార్పుల వల్ల సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలు తెలియజేశాయి. భూమి ధృవాల్లో మంచు కరగడం వల్ల తీర ప్రాంతాలు మునిగిపోవడం, హిమాలయాల్లో మంచు కరిగిపోయి సరస్సులు కట్టలు తెగి జలప్రళయాలు సంభవించడం, భూమ్మీద కొన్ని చోట్ల భారీ వరదలు, మరికొన్ని చోట్ల తీవ్ర దుర్భిక్షం, అదుపులేని దావానలాలు వంటి వన్నీ భూతాపం పెరగడం వల్ల సంభవిస్తున్న పెను విపత్తులేనని గుర్తించారు. వాతావరణ పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాలు పెరిగాయి. అన్ని దేశాల ప్రభుత్వాలపై ప్రజల నుండి ఒత్తిడి పెరిగింది. దాంతో 2015లో పారిస్‌లో ఐక్య రాజ్య సమితి ఆధ్వర్యంలో జరిగిన కాప్ 21 సదస్సుకు హాజరైన 197 భాగస్వామ్య దేశాలు భూ తాపాన్ని పారిశ్రామిక విప్లవం నాటితో పోలిస్తే ఈ శతాబ్దం మధ్యనాటికి అంటే 2050 నాటికి 1.5 డిగ్రీల సెలిసియస్‌కు మించి పెరగకుండా చూడాలని నిర్ణయించాయి. దానికి గాను రెండు దశల్లో చర్యలు తీసుకోవాలని సదస్సు నిర్ణయించింది. మొదటిది, అన్ని దేశాలూ పై లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని 2030 నాటికి ఎంతమేర ఉద్గారాలను తగ్గిస్తారో స్వచ్ఛందంగా ప్రకటించాలి. వీటిని స్వల్పకాలిక లక్ష్యాలు అంటున్నారు. సగటు ఉష్ణోగ్రత 2 డిగ్రీలు మించి పెరగకుండా ఉండేట్లు ఈ స్వల్పకాలిక లక్ష్యాలు ఉండాలి. ఇంకా అవసరమైతే 1.5 డిగ్రీలకు మించకుండా

> ❝ ఇప్పటికే భూమి సగటు ఉష్ణోగ్రత పారిశ్రామిక విప్లవం ముందునాటితో పోలిస్తే 1.2 శాతం పెరిగింది. అది మరో రెండు దశాబ్దాల్లో 1.5 డిగ్రీలు దాటిపోతుంది. ఐక్యరాజ్యసమితి వాతావరణ కార్యక్రమం (యుఎన్ఇపి) విశ్లేషణ ప్రకారం పారిస్ ఒప్పందంలో ఇచ్చిన హామీలను అన్ని దేశాలూ తూ.చ తప్పక పాటించినప్పటికీ భూమి సగటు ఉష్ణోగ్రత ఈ శతాబ్దం అంతానికి 2.7 డిగ్రీలు అదనంగా పెరుగుతుంది. ❞

లక్ష్యాలు తీసుకోవాలి. దాన్ని జాతీయంగా నిర్దేశించుకున్న లక్ష్యాలు (నేషనల్లీ డిటెర్మైన్డ్ కంట్రిబ్యూషన్స్) అన్నారు. పారిస్ ఒప్పందం ప్రకారం అన్ని దేశాలూ ఉద్గారాలను తగ్గించడానికి జాతీయంగా నిర్దేశించుకున్న లక్ష్యాలు ప్రకటించాయి. కానీ ఏ దేశమూ లక్ష్యాలకనుగుణంగా ఉద్గారాలను తగ్గించలేదు. పేద దేశాలకు ప్రకటించిన సహాయమూ అందించలేదు. వాస్తవానికి పారిస్ ఒప్పందం ప్రకారం అన్ని దేశాలూ ఉద్గారాలను ఖచ్చితమైన మోతాదులో తగ్గించినా భూతాపం 2 డిగ్రీలు దాటుతుందని నిపుణులు అంచనా వేశారు. అలా అన్ని దేశాలూ ఖచ్చితంగా అమలు చేయాలంటే ఈ దశాబ్దంలోనే వాతావరణంలోకి విడిచిపెట్టే ఉద్గారాలు 45 శాతం మేరకు తగ్గాలి. కానీ ఆయా దేశాలు వాగ్దానాలైతే చేశాయి గానీ పాటించే విషయం పట్టించుకోలేదు. పైగా ప్రపంచంలోనే అత్యంత భారీ కాలుష్యాలు వెదజల్లే అమెరికా, పారిస్‌ఒప్పందంనుండి వైదొలగుతున్నట్లు నాటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దాంతో ఒప్పందం అమలు ప్రశ్నార్థకమైంది. జో బైడెన్ అధికారంలోకి వచ్చిన తరువాత అమెరికా మళ్లీ ఒప్పందంలో చేరింది. ఏదేమైనా పారిస్ ఒప్పందానికి న్యాయపరంగా కట్టుబడి ఉండాలని లేదు కాబట్టి అన్ని దేశాలూ స్వచ్ఛందంగా అమలు చేయాలని ఉంది కాబట్టి ఆయా దేశాలు జాతీయ అభివృద్ధి అంశాలను ముందుకు తీసుకువచ్చి ఉద్గారాల తగ్గింపును వెనక్కు నెట్టేశాయి.

గ్లాస్గో సదస్సులో పారిస్ ఒప్పందం అమలును సమీక్షించి ఉద్గారాల తగ్గింపుకు కొన్ని నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. వాస్తవానికి ఈ సదస్సు 2020లో జరగాల్సింది. కానీ కోవిడ్ మహమ్మారి వల్ల ఏడాది ఆలస్యంగా జరిగింది. ప్రతి అయిదేళ్లకు ఆయా దేశాలు ఉద్గారాల తగ్గింపును పెంచుతూ పోవాలని అప్పుడే భూ తాపాన్ని 1.5 డిగ్రీల పరిధిలోపు ఉంచగలమని పారిస్ ఒప్పందంలో పేర్కొన్నారు. 2050 నాటికి ఉద్గారాలను నెట్ జీరో చేయడానికి అనుగుణంగా గ్లాస్గో సదస్సులో అన్ని దేశాలూ కోటాలు పెంచాల్సి ఉంది. వీటిని దీర్ఘకాలిక లక్ష్యాలు అంటున్నారు. నెట్ జీరో అంటే వాతావరణంలోకి వెళ్లే ఉద్గారాలు, వాతావరణం నుండి ఆయా దేశాలు తొలగించే ఉద్గారాలు సమానం కావాలి. అంటే శిలాజ ఇంధనాల వాడకం పూర్తిగా నిలిపివేసి పునరుత్పాదక ఇంధనాలవైపు మళ్లాలి, లేదా వాతావరణంలోకి విడుదల చే కార్బన్ డై-ఆక్సైడ్ ను మరో చోట (అడవుల పెంపకం, కార్బన్ డై-ఆక్సైడ్‌ను ఒడిసి పట్టే టెక్నాలజీ ద్వారా) వాతావరణం నుండి తొలగించాలి.

**లెక్కలు సరిపోవడం లేదు**

కానీ గ్లాస్గో సదస్సులో దేశాలు ప్రకటించిన దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలను పరిశీలిస్తే భూతాపం ప్రమాదకర స్థాయికి పెరగడం ఖాయం అని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే భూమి సగటు ఉష్ణోగ్రత పారిశ్రామిక విప్లవం ముందునాటితో పోలిస్తే 1.2 శాతం పెరిగింది. అది మరో రెండు దశాబ్దాల్లో 1.5 డిగ్రీలు దాటిపోతుంది. ఐక్యరాజ్యసమితి వాతావరణ కార్యక్రమం (యుఎన్ఇపి) విశ్లేషణ ప్రకారం పారిస్ ఒప్పందంలో ఇచ్చిన హామీలను అన్ని దేశాలూ తూ.చ తప్పక పాటించినప్పటికీ భూమి సగటు ఉష్ణోగ్రత ఈ శతాబ్దం అంతానికి 2.7 డిగ్రీలు అదనంగా పెరుగుతుంది. కానీ ఆయా దేశాలు ముఖ్యంగా పారిశ్రామిక దేశాలు ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చడంలో క్షమించరాని నిర్లక్ష్యం వహిస్తున్నందున సగటు ఉష్ణోగ్రత ఇంకా అధికంగానే పెరిగే అవకాశం ఉంది. 1.5 డిగ్రీలు దాటి పెరిగిన తరువాత వాతావరణంలో వెనక్కు తీసుకోడానికి వీలులేని పెను మార్పులొస్తాయని పలువురు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇంక అది 2 డిగ్రీలు అంతకు మించి పెరిగితే వచ్చే విపరిణామాలను అంచనా వేయడం సాధ్యం కాదు. వాస్తవ పరిస్థితులు ఇలా ఉంటే ఆయా దేశాలు లాభనష్టాలను చూసుకుని ఉద్గారాల తగ్గింపుకు మీనమేషాలు లెక్కిస్తున్నాయి.

**ధనిక దేశాలు, వర్ధమాన దేశాలు**

గ్లాస్గో సమావేశంలో సాధించిన ఫలితాలు అత్యంత విచారకరంగా ఉండటానికి ధనికదేశాల ధోరణి, బొగ్గు ఇతర శిలాజ ఇంధనాలు, గ్యాస్ పరిశ్రమలే కారణమని ఏ మాత్రం పరిశీలన చేసినా అర్థమౌతుంది. అభివృద్ధి చెందిన దేశాలు గ్లాస్గో సమావేశానికి సన్నాహాల సందర్భంగా చేసిన ప్రకటనలకు మించి కర్బన ఉద్గారాలను తగ్గించటానికి సమావేశంలో అదనంగా ఎటువంటి ప్రకటనలూ చేయలేదు. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, కెనడా, ఇతర అభివృద్ధి చెందిన దేశాలు 2050 నాటికి కర్బన ఉద్గారాలను సున్నా స్థాయికి తగ్గిస్తామని దీర్ఘకాలిక లక్ష్యాలను ప్రకటించాయి. దాని వలన పెద్దగా ఉపయోగం ఉండదని, 2030 నాటికి ఉద్గారాలను భారీగా తగ్గించటానికి చర్యలు తీసుకోవాలని నిపుణులందరూ చెబుతున్నప్పటికీ వారు అటువంటి వాగ్దానం చేయలేదు. పారిస్ ఒప్పందంలో తిరిగి పాలుపంచుకుంటున్న బైడెన్ నాయకత్వంలోని అమెరికా 2030 నాటికి జాతీయంగా నిర్ణయించుకున్న లక్ష్యాలను 2005 స్థాయి కన్నా 26 నుండి 50 శాతానికి తగ్గించటం, 2035 నాటికి విద్యుత్‌శక్తిని పూర్తిగా శిలాజరహిత ఇంధనాలతో ఉత్పత్తి చేస్తామని, 2050 నాటికి ఉద్గారాల విడుదలను సున్నా స్థాయికి తగ్గిస్తామని ప్రకటించింది. అయినప్పటికీ 1990తో పోల్చుకున్నపుడు 2030 నాటికి 55 శాతం ఉద్గారాలను తగ్గిస్తామన్న యూరోపియన్ యూనియన్ కన్నా అమెరికా ఇంకా 27 శాతం వెనుకబడే ఉన్నది. భారత దేశం 2070 నాటికి, చైనా 2060 నాటికి సున్నా స్థాయికి తీసుకువస్తామని ప్రకటించాయి.

అభివృద్ధి చెందిన దేశాలు పర్యావరణ మార్పులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం పురోగమించటానికి ఏ మాత్రం సహకరించలేదు. బొగ్గుతో తయారు చేస్తున్న విద్యుదుత్పత్తికి ముగింపు పలకాలని గ్లాస్గో ఒప్పందం నిర్దేశించింది. కానీ అమెరికా, యూరోపియన్ యూనియన్‌లకు ఎక్కువగా అందుబాటులో ఉన్న ఇంధనాలైన చమురు, సహజవాయువుల

వినియోగానికి ముగింపు పలకాలని మాత్రం కోరలేదు. బొగ్గుకు సబ్సిడీలు ఇవ్వకూడదని ఒప్పందంలో పేర్కొన్నారు. కాని చమురు, సహజవాయువు గురించి చెప్పలేదు. వాస్తవానికి గ్లాస్గో సమావేశానికి అన్నిటికంటే పెద్ద సంఖ్యలో 450 మందికి పైగా ఆయిలు, ఇతర ఇంధన పరిశ్రమల ప్రతినిధులే వచ్చారంటే ఈ సమావేశంపైనా, ఒప్పందంపైనా వారి ప్రభావం ఎంతగా ఉందో అర్ధమవుతుంది.

**అభివృద్ధి చెందుతున్న దేశాలపై శీతకన్ను**

అభివృద్ధి చెందుతున్న దేశాలకు సహాయం అందించే విషయంలో కూడా అభివృద్ధి చెందిన దేశాలు గతంలో చేసిన వాగ్దానాల నుండి వెనక్కుతగ్గాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు సంవత్సరానికి 10,000 కోట్ల డాలర్ల సహాయం అందిస్తామని మొదటిసారిగా పారిస్ ఒప్పందంలో చేసిన వాగ్దానాన్ని వాయిదా వేస్తూ వస్తున్నాయి. ఇపుడు గ్లాస్గో సమావేశంలో దానిని 2023 వరకు వాయిదా వేశారు. 2019 సంవత్సరం నుండి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవటం కోసం ఇచ్చే సహాయాన్ని సంవత్సరానికి 2,000 కోట్ల డాలర్ల నుండి 4,000 కోట్ల డాలర్లకు పెంచటం, అదీ 2025 నుండి అమలు చేస్తామని అభివృద్ధి చెందిన దేశాలు ప్రకటించటాన్ని గొప్ప విజయంగా ప్రచారం చేస్తున్నారు. పర్యావరణ పరంగా జరిగిన మార్పుల వలన ఇంతకు ముందు జరిగిన నష్టానికి, పూర్తిగా కోల్పోయిన వాటికి పరిహారం చెల్లించాలన్న అంశాలను ఒప్పందంలో చేర్చాలని తక్కువ అభివృద్ధి చెందిన, దీవులుగా ఉన్న దేశాలు తీవ్రమైన ప్రయత్నాలు చేశాయి గానీ వాటి ప్రయత్నాలు ఫలించలేదు. పారిశ్రామిక దేశాల ఉద్గారాల వల్ల వర్ధమాన దేశాలకు జరిగిన నష్టానికి పరిహారం ఇవ్వాలన్న డిమాండును అభివృద్ధి చెందిన దేశాలు, ముఖ్యంగా అమెరికా ఎప్పుడూ అంగీకరించలేదు. చివరికి అభివృద్ధి చెందిన దేశాలు పేద దేశాలకు అందిస్తామన్న ఆర్థిక సహాయం కూడా ఇవ్వకుండా నానబెడు తున్నారు.

**భారత్ తొట్రుపాటు: ప్రపంచ దేశాల ముందు విలన్‌గా నిలిచిన వైనం**

ప్రస్తుతం వాతావరణంలోకి గ్రీన్‌హౌస్ వాయువులు విడుదల చేసే దేశాల్లో చైనా మొదటి స్థానంలో, అమెరికా రెండో స్థానంలో, భారత్ మూడో స్థానంలో ఉన్నాయి. ఐరోపా యూనియన్‌లోని దేశాలు విడివిడిగా చూస్తే చైనా, భారత్ ఇతర అభివృద్ధి చెందుతున్న

**“ అభివృద్ధి చెందుతున్న దేశాలకు సహాయం అందించే విషయంలో కూడా అభివృద్ధి చెందిన దేశాలు గతంలో చేసిన వాగ్దానాల నుండి వెనక్కుతగ్గాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు సంవత్సరానికి 10,000 కోట్ల డాలర్ల సహాయం అందిస్తామని మొదటిసారిగా పారిస్ ఒప్పందంలో చేసిన వాగ్దానాన్ని వాయిదా వేస్తూ వస్తున్నాయి. ఇపుడు గ్లాస్గో సమావేశంలో దానిని 2023 వరకు వాయిదా వేశారు. ”**



**కాప్26 సదస్సు సందర్భంగా ఐక్యరాజ్య సమితిలో 'ప్రసంగిస్తున్న డైనోసార్': ఆధునిక టెక్నాలజీతో సృష్టించిన ఈ గ్రాఫిక్ డైనోసార్ ప్రపంచాధినేతలు కళ్లు తెరవకపోతే తమ లాగే మానవాళి కూడా త్వరలో అంతమై పోతుందని హెచ్చరించింది.**

దేశాలతో పోలిస్తే తక్కువ ఉద్గారాలు విడుదల చేస్తున్నట్లు కనిపిస్తుంది. కానీ తలసరి ఉద్గారాల విడుదలలో అమెరికా, ఐరోపా దేశాలు వర్ధమాన దేశాలకన్నా ముందున్నాయి. సగటున ఒక అమెరికన్ ఏడాదికి 15.52 టన్నుల కార్బన్ డై-ఆక్సైడ్ వాతావరణంలోకి విడుదల చేస్తుంటే భారతీయుడు 1.91 టన్నులు విడుదల చేస్తున్నాడు. ఐరోపావాసుల సగటు ఉద్గారాల విడుదల కూడా చాలా ఎక్కువ. పైగా పారిశ్రామిక విప్లవం తొలుత ఐరోపాలో వచ్చింది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందే క్రమంలో పశ్చిమ దేశాలు వాతావరణాన్ని గ్రీన్‌హౌస్ ఉద్గారాలతో నింపేశాయి. ఇప్పుడు వర్ధమాన దేశాలు అభివృద్ధి చెందాలంటే అవి ఉద్గారాలను విడుదల చేయక తప్పని పరిస్థితి వచ్చింది. అలా విడుదల చేయకుండా అవి అభివృద్ధి చెందాలంటే పశ్చిమ దేశాల వద్ద ఉన్న సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక వనరులను వాటికి బదలా ఇంచాల్సి ఉంటుంది. కానీ పశ్చిమ దేశాలు సాంకేతిక పరిజ్ఞానం బదలాయించకుండా, వనరులను ఇవ్వకుండా భారత్, చైనా, ఇతర వర్ధమాన దేశాలపైకి నెపం నెట్టేసి వాతావరణ కాలుష్య తగ్గింపు బాధ్యత నుండి తప్పుకోజూస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా, ఇతర పశ్చిమ దేశాల నాటకాలను ఎండగట్టడంలో భారత్ విఫలం కావడమే కాకుండా గ్లాస్గో తుది నివేదికలో మన దేశం చివరి నిముషంలో చేసిన సవరణ మన దేశాన్ని బోనులో నిలిపేట్లు చేసింది.

భారత్ ఒత్తిడితో.... బొగ్గుతో జరిగే విద్యుత్ ఉత్పత్తిని 'పూర్తిగా రద్దుచేస్తామన్న' మాటల స్థానంలో 'క్రమంగా తగ్గిస్తాం' అని తుది ఒప్పందంలో చేర్చారు. అంటే బొగ్గుతో చేస్తున్న విద్యుత్ ఉత్పత్తిని పూర్తిగా లేకుండా చేయటం కాకుండా క్రమంగా తగ్గించుకుంటూ వస్తామని చెప్పారు. భారతదేశంలోని పేద

**❝ నాటి బొలీవియా అధ్యక్షుడు ఇవో మోరెల్స్ వాతావరణ మార్పుల గురించి ఐక్యరాజ్య సమితిలో చేసిన ప్రసంగాన్ని ఈ సందర్భంగా ఉటంకిచాల్సి ఉంది: "అదుపులేని పెట్టుబడిదారీ వ్యవస్థ, దాని లాభాపేక్ష భూగోళాన్ని నాశనం చేస్తోంది. వాతావరణ మార్పులు మొత్తం మానవాళి ముందు రెండే మార్గాలను ఉంచింది: ఒకటి, పెట్టుబడిదారీ మార్గంలో ప్రయాణించి చావును కొని తెచ్చుకోవడం, రెండోది, ప్రకృతితో సమతుల్యం సాధించి మానవాళిని కాపాడుకోవడం". ❞**

గృహస్తులు వినియోగిస్తున్న వంటగ్యాస్‌కు సబ్సిడీలను కొనసాగిస్తారన్న మాటలను కూడా తుది ఒప్పందంలో చేర్చారు. పశ్చిమదేశాల వార్తా పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, అంతర్జాతీయ ఎన్‌జిఒలు, అనేక ప్రధానమైన ప్రతినిధివర్గాలు ఈ పరిణామాలకు భారతదేశమే కారణమని నిందించాయి. రాజీ పడటానికి దారితీసిన ఈ మాటలను అమెరికా ప్రతిపాదించిందని ఈ మధ్య భారతదేశ అధికారులు వెల్లడించినప్పటికీ దాని ఫలితాన్ని మాత్రం దేశం అనుభవించాల్సి వచ్చింది. గ్లాస్గో సమావేశంలో సాధించిన ఫలితాలు అత్యంత విచారకరంగా ఉండటానికి ధనికదేశాలు, శిలాజ ఇంధనాలు, గ్యాస్ పరిశ్రమలే కారణమని ఏ మాత్రం పరిశీలన చేసినా అర్థమౌతుంది.

### ప్రమాదాన్ని ఆపాలంటే వ్యవస్థను మార్చాల్సిందే

నాటి బొలీవియా అధ్యక్షుడు ఇవో మోరెల్స్ వాతావరణ మార్పుల గురించి ఐక్యరాజ్య సమితిలో చేసిన ప్రసంగాన్ని ఈ సందర్భంగా ఉటంకిచాల్సి ఉంది: "అదుపులేని పెట్టుబడిదారీ వ్యవస్థ, దాని లాభాపేక్ష భూగోళాన్ని నాశనం చేస్తోంది. వాతావరణ మార్పులు మొత్తం మానవాళి ముందు రెండే మార్గాలను ఉంచింది: ఒకటి, పెట్టుబడిదారీ మార్గంలో ప్రయాణించి చావును కొని తెచ్చుకోవడం, రెండోది, ప్రకృతితో సమతుల్యం సాధించి మానవాళిని కాపాడుకోవడం".

మోరెల్స్ చెప్పింది అక్షర సత్యం అని గ్లాస్గోలో జరిగిన కాప్26 సదస్సు మరోమారు నిరూపించింది. గ్లాస్గో సదస్సులో అన్ని దేశాలు ప్రకటించిన ఉద్గారాల తగ్గింపు భూమిని వినాశనం నుండి తప్పించడానికి ఏమాత్రం సరిపోదని ఐక్యరాజ్య సమితి వాతావరణ కార్యక్రమం స్పష్టం చేసింది. అన్ని దేశాలూ ఇవే విధానాలు కొనసాగిస్తే ఈ శతాబ్దం చివరికి భూతాపం సగటున 2.7 నుండి 3 డిగ్రీల సెల్సియస్ పెరుగుతుంది. అంటే మానవాళి త్వరలోనే ప్రళయాలను ఎదుర్కోనున్న దన్నమాట. వాతావరణ సదస్సులో పశ్చిమ దేశాలు ఇచ్చిన హామీలకూ, వాటి ఆచరణకూ పొంతన లేని విషయాన్ని అందరికన్నా ఎక్కువగా కాలుష్యాన్ని వెదజల్లుతున్న అమెరికా వైఖరి తేట తెల్లం చేస్తున్నది. గ్లాస్గో సమావేశానికి బయలు దేరే ముందు బైడెన్ ఒక ప్రకటన చేస్తూ ఈ దశాబ్దం చివరి నాటికి తమ దేశం గ్రీన్‌హౌస్ ఉద్గారాలను 2005 సంవత్సరం స్థాయిలో సగానికి తగ్గించనున్నట్లు, 2050 నాటికి ఉద్గారాలను సున్నాకు తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. కానీ దీని కోసం ఆయన ప్రభుత్వం కేటాయించిన సొమ్ము ఎంతో తెలుసా? రానున్న పదేళ్లలో ఖర్చు చేయడానికి 55,000 కోట్ల డాలర్లు. ఈ మొత్తం అమెరికా ఒక ఏడాది యుద్ధ సన్నాహాలకు చేసే ఖర్చులో చిన్న భాగం. అదీ కాకుండా భౌగోళికంగా తన సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని నిలుపుకోడానికి వాతావరణ సంక్షోభాన్ని కూడా ఉపయోగించుకోవాలని అమెరికా పథకం రచిచింది. దాన్ని బైడెన్ నవంబర్ 11న తన ప్రసంగంలో బహిరంగంగానే ప్రకటించారు. "21వ శతాబ్దంలో చైనా, ప్రపంచంలోని ఇతర అన్ని దేశాల మీదా ఆర్థిక పోటీలో నెగ్గడానికి ఆర్థిక సంక్షోభాన్ని ఒక అవకాశంగా ఉపయోగించుకోవాలి" అని ఆయన పేర్కొన్నారు.

అందువల్ల అమెరికా, అది అనుసరిస్తున్న విధానాలు భూ తాపాన్ని తగ్గించడానికి ఉపయోగపడకపోగా ప్రమాదాన్ని మరింత పెంచుతాయి. ఈలోగా భూగోళాన్ని వినాశనం నుండి కాపాడాలంటే అన్ని దేశాలూ 2050 నాటికి ఖచ్చితంగా ఉద్గారాలను సున్నా స్థాయికి (నెట్ జీరో) తగ్గించాలని అంతర్జాతీయ ఇంధన సంస్థ పేర్కొంటూ ఈ లక్ష్యాలు సాధించాలంటే ప్రపంచం రానున్న తొమ్మిదేళ్లలో, అంటే ఈ దశాబ్దం అంతానికి సమిష్టిగా ఈ కింది చర్యలు తీసుకోవాలని సూచించింది.

– కొత్త చమురు, సహజవాయు క్షేత్రాలు, బొగ్గు గనులకు అనుమతివ్వడం తక్షణం నిలిపివేయాలి.

– మొత్తం ఇంధన వినియోగంలో పునరుత్పాదక ఇంధనాన్ని 60 శాతానికి పెంచాలి.

– పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తికి వార్షిక పెట్టుబడులను మూడు రెట్టు పెంచాలి.

– ధనిక దేశాల్లోని భవనాలన్నిటి, వర్ధమాన దేశాల్లోని మూడొంతుల భవనాల వైశాల్యం తగ్గించాలి.

– ప్రపంచ వ్యాపితంగా బ్యాటరీల ఉత్పత్తిని ఏడాదికి రెండు రెట్లు చొప్పున పెంచాలి.

– సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను అయిదు రెట్లు పెంచాలి.

– 2019లో మొత్తం కార్లలో 2.5 శాతంగా ఉన్న విద్యుత్ కార్లను దశాబ్దం చివరికి 50 శాతానికి పెంచాలి.

ప్రపంచంలోని పెట్టుబడిదారీ దేశాలు ఈ పని చేయగలవా? అసలు వాటికా సామర్థ్యం ఉందా? ఈ పని చేయడం మాట అలా ఉంచితే గ్లాస్గో సమావేశానికి హాజరైన ఏ పెట్టుబడిదారీ దేశమూ తను ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చే స్థితి లేదు. ఆయా దేశాల్లోని పెట్టుబడిదారీ వ్యవస్థలు వాటి అమలుకు అడ్డుపడతాయి. ఎందుకంటే ఈ చర్యలన్నీ తీసుకోవాలంటే సామాజిక వనరులను లాభాల కోసం కాకుండా సామాజిక అవసరాల కోసం పెద్ద ఎత్తున పున:కేటాయించాలి. ఆర్థిక వ్యవస్థ తాళాలు ప్రయివేటు పెట్టుబడి చేతుల్లో పెట్టుకుని లాభాల కోసం పనిచేసే దేశాల్లో ఇంత త్వరగా, ఇంత పెద్ద ఎత్తున పునరుత్పాదక ఇంధనాలకు మళ్లడం సాధ్యం కాదు. అందువల్ల వాతావరణ సంక్షోభాన్ని నివారించడంలో వైఫల్యాలకు కారణం నిర్దిష్ట వ్యక్తులు, వారి ఆలోచనలు కాదు. దానికి కారణం ఒక నిర్దిష్ట ఆర్థిక వ్యవస్థ , పెట్టుబడిదారీ వ్యవస్థ. ఇవో మోరెల్స్ చెప్పినట్లు ఆ వ్యవస్థను మార్చి ప్రకృతితో సహజీవనం సాగించే సోషలిస్టు వ్యవస్థ సాధించినప్పుడే వాతావరణ సంక్షోభాన్ని నివారించడం, భూగోళాన్ని వినాశనం నుండి కాపాడ్డం సాధ్యమవుతుంది.

❋

# ఎన్‌కౌంటర్ల పేరుతో ప్రజలను కాల్చిచంపుతున్న యుపి పోలీసులు



రచయిత 'లీఫ్‌లెట్' అనే వెబ్‌సైట్ ఎడిటర్

వి. వెంకటేశన్

'తక్షణ న్యాయం' పేరుతో నకిలీ ఎన్‌కౌంటర్ల ద్వారా చంపటం ఇటీవల కాలంలో ప్రజల ఆమోదాన్ని పొందుతున్నది. ఈ నివేదికకు రాసిన ముందుమాటలో సుప్రీంకోర్టు మాజి న్యాయమూర్తి మదన్ బి లోకూర్ పేర్కొన్న విధంగా అత్యధిక కేసులలో పోలీసులు ఉద్దేశ్యపూర్వకంగా చేస్తున్న హత్యలు ఇవి. 2018 వరకు జరిగిన 17 సంఘటనల నివేదికలను సునిశితంగా పరిశీలించిన సంస్థలు సుప్రీంకోర్టు, జాతీయ మానవహక్కుల కమిషన్‌లు రూపొందించిన రక్షణలను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏ విధంగా ఉల్లంఘిస్తున్నదో పేర్కొన్నాయి. ఈ నేరాలను కప్పిపుచ్చుకోవటానికి చేస్తున్న ప్రయత్నాలను బట్టబయలు చేయటంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ అలసత్వం వహించటాన్ని కూడా నివేదిక వెల్లడించింది.

ఈ నివేదికను రూపొందించటం ద్వారా వాస్తవాలను వెలికితేవటం, నేరం చేసిన వారు తప్పించుకుపోవటానికి అవకాశం కల్పిస్తున్న చట్టాలలోని లోపాలను వెల్లడించటంలో హక్కుల కోసం పోరాడుతున్న మూడు సంస్థలు ప్రశంసనీయమైన పాత్ర నిర్వహించాయి. వీటిలో యూత్ ఫర్ రైట్స్ డాక్యుమెంటేషన్(వైహెచ్‌ఆర్‌డి) 2020లో ఈశాన్య ఢిల్లీలో మతపరమైన హింసాకాండ జరిగిన తర్వాత స్వతంత్ర సంస్థగా రూపుదిద్దుకుంది. అవకాశాలు లేని, సమాజంలో అట్టడుగున ఉన్న తరగతులకు విద్య, ఇతర అవకాశాలను కల్పించటం కోసం కృషి చేస్తున్న యువ న్యాయవాదులు, పరిశోధకులు, మానవహక్కుల కార్యకర్తలు, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న సంస్థలు, ప్రజా ప్రయోజనాల కోసం పనిచేస్తున్న వ్యక్తులు ఈ సంస్థలో ఉన్నారు. ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న సిటిజెన్స్ ఎగైనెస్ట్ హేట్(సిఎహెచ్) లో ప్రజాస్వామ్యం, లౌకికతత్వాల పరిరక్షణ, భారతదేశ ప్రయోజనాల కోసం పనిచేసే సంస్థలు, వ్యక్తులు ఉన్నారు. ద్వేషాన్ని రెచ్చగొట్టటం ద్వారా ప్రజలను సమీకరించటం, నేరాలకు పాల్పడటం, ముఖ్యంగా గుంపులుగా కూడి చట్టాన్ని అమలు చేసే పేరుతో హింసాకాండకు పాల్పడటం, వ్యక్తులను కొట్టిచంపటం ఎక్కువ అవుతున్న తరుణం 2017లో సిఎహెచ్ ఏర్పడింది. ఈ గుంపులు పాల్పడుతున్నన ఉల్లంఘనలను నమోదు చేయటం, బాధితులకు మద్దతు నివ్వటం, వారికి న్యాయాన్ని అందించటం, విధానపరమైన సంస్కరణల కోసం ఈ సంస్థ పనిచేస్తున్నది. భారతదేశంలో మానవహక్కుల పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న అగ్రగామి సంస్థలలో ఒకటైన పీపుల్స్ వాచ్ (పిడబ్ల్యు) మానవహక్కుల ఉల్లంఘనకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించేలా చేయాలని, మానవహక్కులను కాపాడే సంస్కృతిని సమాజంలో భాగంగా చేయాలని పేర్కొంది.

నేరాలను అదుపు చేయటం కోసమంటూ ఎన్‌కౌంటర్ల పేరుతో పోలీసులు చట్ట విరుద్ధంగా హత్యలు చేయటాన్ని నివేదికలో పొందుపరిచారు. ఈ నివేదికలో పేర్కొన్న హత్యలు 2017 మార్చి, 2018 మార్చి మధ్య జరిగాయి. చనిపోయిన 18 మంది కుటుంబాలకు చెందిన సభ్యులూ ఇవి పోలీసులు చేసిన చట్ట విరుద్ధ హత్యలేనని పేర్కొన్నారు. ఈ 17 కేసులకు 12లో పోలీసుల తప్పేమీలేదని ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆ కేసులను మూసివేసింది. ఒక కేసును యుపి రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌కు పంపింది. పోలీసులు చేసిన నకిలీ ఎన్‌కౌంటర్‌లో వ్యక్తి చనిపోయాడని ఒక్క కేసులో మాత్రమే ఎన్‌హెచ్‌ఆర్‌సి చెప్పింది.

**పోలీసుల ఎన్‌కౌంటర్ల వెనుక వాస్తవాలు**

ఎన్‌కౌంటర్లు అనుకోకుండా జరుగుతున్నవి కాదని, పోలీసులు ముందుగా రూపొందించిన పథకం ప్రకారం చేస్తున్నవేనని పౌర సమాజంలోని సంస్థలు చాలాకాలం నుండి వాదిస్తున్నాయి. ప్రజల నుండి ప్రశంసలు పొందటం లేదా రాజకీయంగానూ, నేరస్తులతోనూ ఉన్నతాధికారులకు ఉన్న సంబంధాలను మరింత బలపర్చుకోవటం కోసం ఈ ఎన్‌కౌంటర్లు చేస్తున్నారు. పోలీసులు వినియోగించే చట్ట వ్యతిరేక పద్ధతులను బలపరచటానికి, చట్టపరంగా సమాధానం చెప్పుకోవాల్సిన బాధ్యత నుండి వారిని తప్పించటానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని నివేదిక వెల్లడించింది. నేరస్తులు లేకుండా చేయటం కోసమంటూ పోలీసులు ఎన్‌కౌంటర్లు చేస్తూ చట్టాలను పట్టించుకోకుండా వ్యవహరించటం, మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడటాలను తక్షణ న్యాయాన్ని అమలుజరపటంగా ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. తక్షణన్యాయం పేరుతో ప్రజలను కొట్టిచంపే గ్రూపులు పెరగటానికి ఇది దోహదం చేస్తున్నది.

బిజెపి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 2017 మార్చి నుండి పోలీసులు చేస్తున్న హత్యలు భారీగా పెరిగాయి. 2017 మార్చి నుండి 8,472 సందర్భాలలో పోలీసులు కాల్పులు జరిపారు. వాటిలో నేరస్తులుగా పేర్కొన్నవారు 3,302 మంది పోలీసుల బుల్లెట్లు తగలటంతో గాయపడ్డారు. ఈ మధ్యకాలంలో వెల్లడించిన అధికారిక నివేదికల ప్రకారం ఈ కాల్పులలో 146 మంది చనిపోయారు. ఈ నివేదికలో పేర్కొన్న 17 సంఘటనలపై 2018 మేనెలలో

**❝ పోలీసుకాల్పులలో మరణాలు సంభవించిన 74 కేసులలో 2020 మే నాటికి మేజిస్ట్రీరియల్ విచారణ పూర్తయినట్లు ఈ నివేదికలో పేర్కొన్నారు. పోలీసులు నేరాలకు పాల్పడలేదని అన్ని కేసులలోనూ చెప్పారు. మరొక 61 కేసుల విచారణ ముగించటం కోసం పోలీసులు ఇచ్చిన నివేదికలను కోర్టులు అమోదించాయి. చట్టంలో ఉన్న ఆత్మరక్షణ అన్న అంశాన్ని ఆధారం చేసుకొని, తమపై విచారణ జరగటానికి అవకాశం లేకుండా చేసుకొని, తమకు తామే నిర్దోషులమని పోలీసులు సర్టిఫికెట్లు ఇచ్చుకొంటున్నారు. ❞**

ఎన్‌హెచ్‌ఆర్‌సి విచారణకు ఆదేశించినపుడు పోలీసుకాల్పులలో మరణించిన వారి సంఖ్య 50కి చేరింది. ఈ మరణాలకు కారణమౌతున్న పోలీసుల చర్యలను నేరాలను అరికట్టటం కోసం అమలుచేస్తున్న విధానంగా ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తున్నది.

పోలీసుకాల్పులలో మరణాలు సంభవించిన 74 కేసులలో 2020 మే నాటికి మేజిస్ట్రీరియల్ విచారణ పూర్తయినట్లు ఈ నివేదికలో పేర్కొన్నారు. పోలీసులు నేరాలకు పాల్పడలేదని అన్ని కేసులలోనూ చెప్పారు. మరొక 61 కేసుల విచారణ ముగించటం కోసం పోలీసులు ఇచ్చిన నివేదికలను కోర్టులు అమోదించాయి. చట్టంలో ఉన్న ఆత్మరక్షణ అన్న అంశాన్ని ఆధారం చేసుకొని, తమపై విచారణ జరగటానికి అవకాశం లేకుండా చేసుకొని, తమకు తామే నిర్దోషులమని పోలీసులు సర్టిఫికెట్లు ఇచ్చుకొంటున్నారు. కాని ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపటం పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఉండటానికి తగిన కారణం కాదని నివేదికలో పేర్కొన్నారు. చట్టవ్యతిరేక హత్యలపై రూపొందించిన నివేదికలో పరిశీలించిన 17 కేసులలో ఒక్కదానిలో కూడా పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. పోలీసులు చెప్పారు కాబట్టి ఎటువంటి విచారణ, ప్రశ్నించటం లేకుండా ఆత్మరక్షణ వాదనను అంగీకరిస్తున్నారు. నేరం చేసిన పోలీసులపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవటంతో ఘటనకు బాధ్యులైన పోలీసు అధికారులు సర్వీస్‌లో కొనసాగుతున్నారు. దానితో పోలీసులు కేసును తమకు అనుకూలంగా మలచుకోవటానికి, సాక్షులను బెదిరించి, సాక్ష్యాలను తారుమారు చేయటానికి అవకాశం కలుగుతున్నది.

ఈ 17 కేసులలోనూ పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయటానికి బదులుగా



యుపి ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్

సిఆర్‌పిసి లోని 307 సెక్షన్ కింద మరణించిన వారిపైనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ 17 కేసులలో మరణించిన వారు, వారితో ఉన్నవారిపై 45 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. జిఎస్ మణి, భారత ప్రభుత్వానికి మధ్య జరిగిన కేసులో పోలీసు కాల్పులలో హైదరాబాద్‌లో మరణించిన నలుగురిపైనా 307 సెక్షన్ కింద హత్యా ప్రయత్నం చేసినట్లు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, చనిపోయిన వారిని విచారించటం, శిక్షించటం సాధ్యకానపుడు ఇది అనవసరం అని 2020లో సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. ఈ 17 కేసులలో ఎఫ్ఐఆర్‌లు ఒకే విధంగా ఉన్నాయి. సమయం, తేదీ, ప్రదేశం, నేరస్తుని పేరు నమోదు చేయటానికి రెండు, మూడు వాక్యాలను ఉపయోగించారు. ఈ ఎఫ్ఐఆర్‌లలో ఒకే విధమైన సంఘటనలను పేర్కొన్నారు. నేరస్తులు పోలీసు అధికారులపై కాల్పులు జరిపారని, అనుకోకుండా జరిగిన ఈ సంఘటనలో ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరపటంతో నేరస్తులు చనిపోయారని చెప్పారు. పోలీసులు జరిపిన కాల్పులలో నేరస్తుడు గాయపడినపుడు అతనితో ఉన్నవారు తమ వాహనాలను, కొన్ని సంఘటనలలో ఆయుధాలను వదిలి తప్పించుకున్నారని ఈ 17 ఎఫ్ఐఆర్‌లలోనూ పేర్కొన్నారు. 17కు 16 లో సంఘటనకు ప్రత్యక్షసాక్షులు లేరని చెప్పారు. తప్పించుకున్నారని చెప్పటం ఎఫ్ఐఆర్‌ను కొనసాగించటానికి, తాము కనీస బలాన్నే వినియోగించామని చెప్పుకోవటానికి, నేరస్తులు తమ మధ్య తిరుగుతున్నారని ప్రజలను భయపెట్టటానికి పోలీసులకు ఉపయోగపడుంది.


చనిపోయిన వ్యక్తి తమపై హత్యాయత్నం, ఐపిసి కింద నేరాలు చేశాడని, తప్పించుకు పోయిన వారిపైనా పోలీసులు ఎక్కువ కేసులలో మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. చనిపోయిన వ్యక్తి ఆయుధాలు తీసుకొని తిరుగుతున్నాడని రెండో ఎఫ్ఐఆర్‌లో నమోదు చేస్తున్నారు. దోపిడి చేసిన డబ్బును కప్పిపుచ్చటం కోసం మూడో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారు. ఏదైనా సంఘటనపై భిన్నమైన వివరణలు ముందుకొచ్చినపుడే చట్టప్రకారం రెండో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి.

ఎన్‌హెచ్‌ఆర్‌సి, పియుసిఎల్ మార్గదర్శకాలకు భిన్నంగా నివేదికలో పేర్కొన్న మెజారిటీ కేసులలో నేరానికి పాల్పడిన పోలీసులున్న పోలీసుస్టేషన్‌కు చెందిన అధికారులే ప్రాథమిక విచారణను నిర్వహిస్తున్నారు. హత్యలకు పాల్పడిన అధికారుల స్థాయి అధికారులే దర్యాప్తు చేస్తున్నారు. పియుసిఎల్ మార్గదర్శకాలకు కట్టుబడి ఉన్నట్లు చూయించటం కోసం దర్యాప్తును తర్వాత మరొక పోలీసుస్టేషన్‌కు బదలాయిస్తున్నారు. నేరం జరిగిన ప్రాంతం నుండి సాక్ష్యాలు సేకరించటం, వాటిని భద్రపరచటం కోసం నేరం జరిగిన తర్వాతి గంటలు చాలా ముఖ్యమైనవి. స్వతంత్ర దర్యాప్తు జరగకుండా నేరం చేసిన పోలీసులున్న స్టేషన్ నుండే దర్యాప్తు జరిపితే తమ తోటివారిని కాపాడుకోవటానికి ప్రయత్నిస్తారు. ఇతర పోలీసుస్టేషన్ల నుండి దర్యాప్తు నిర్వహించిన వారు మొదటి పోలీసుస్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న విధంగా మరణించిన వారు నేరస్తులని, పోలీసులు బాధితులని అన్ని

కేసులలోనూ నివేదికలు ఇచ్చారు. నేరానికి పాల్పడిన పోలీసులు చెప్పినదే వాస్తవం అని దర్యాప్తు ప్రతిదశలోనూ రుజువు చేసి, ఆ నివేదికలను ఎన్‌హెచ్ఆర్‌సికి పంపారు.

వినుభాయ్ హరిభాయ్ మాలవీయ, గుజరాత్ ప్రభుత్వానికి మధ్య నడిచిన కేసులో సరైన దర్యాప్తు జరపటానికి మేజిస్ట్రేట్‌కు ఉన్న అధికారాలపై 2019లో ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు వివరణ ఇచ్చింది. మేజిస్ట్రేట్ ప్రధాన న్యాయాధికారి అని, పోలీసులు చేసిన దర్యాప్తు సక్రమంగానే ఉన్నదని ఆయన సంతృప్తి చెందాలని పేర్కొంది. నివేదికలో పరిశీలించిన 17కు 16 కేసులలో దర్యాప్తు అధికారులు కేసులను ముగిస్తూ న్యాయమూర్తులకు నివేదికలు అందజేశారు. న్యాయమూర్తులు తదుపరి విచారణ చేయకుండానే 11 కేసులను ముగించారు. పోలీసులు పెట్టిన ఎఫ్ఐఆర్‌కు, పోస్టుమార్టం, ఫోరెన్సిక్ రిపోర్టులలో వెల్లడైన వాస్తవాలకు మధ్య ఉన్న వైరుధ్యాలను కూడా పట్టించుకోకుండా దర్యాప్తు చేసిన వారు కేసులను ముగిస్తూ నివేదికలు ఇచ్చారు. మిగతా కేసుల పరిస్థితిపై తగిన సమాచారం లభించలేదు. పోలీసులు ఇచ్చిన కేసు ముగింపు నివేదికను తిరస్కరించే విచక్షణ న్యాయమూర్తులకు ఉన్నదని ఎపి పౌరహక్కుల కమిటి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మధ్య నడిచిన కేసులో ఎపి హైకోర్టు 2007లో తీర్పు ఇచ్చింది. ఎపి పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్, పౌరహక్కుల కమిటి మధ్య నడిచిన కేసులో 2019లో సుప్రీంకోర్టు ఎపి హైకోర్టు తీర్పును బలపరిచింది. పోలీసులు సమర్పించిన కేసు ముగింపు నివేదికను ఆమోదించాలని మేజిస్ట్రేట్ భావిస్తే ఆయన ఎఫ్ఐఆర్‌లోని ఫిర్యాదీదారులకు ముందుగా నోటీసు ఇచ్చి, వారి వాదనను చెప్పుకొనే అవకాశం ఇవ్వాలని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. కేసు ముగింపు నివేదికలోని అంశాలతో విభేదిస్తూ ఫిర్యాదీదారులు పిటీషన్ దాఖలు చేసుకో వచ్చునని చెప్పింది. ఈ కేసులలో సాంకేతికంగా పోలీసు అధికారులే ఫిర్యాదీదారులుగా ఉన్నారు కాబట్టి వాస్తవ బాధితులకు కాకుండా వారికే మేజిస్ట్రేట్ లు నోటీసులు పంపుతున్నారు. పోలీసు అధికారులు కేసును ముగించటానికి తమకేమీ అభ్యంతరం లేదని లేఖ పంపుతున్నారు. దానితో పోలీసు జరిపిన ఎదురు కాల్పులలో సంభవించిన మరణాలపై దర్యాప్తుకు తెరపడుతున్నది.

**❝ ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపామని పోలీసు అధికారులు చెప్పిన దానిని అంగీకరించి, కేసును ముగించటం న్యాయపరంగా సరైనది కాదు. నివేదికలో పరిశీలించిన వాటిలో మెజారిటీ కేసులలో కాల్పులు జరిపిన పోలీసులున్న పోలీస్ స్టేషన్ నుండే సాక్ష్యాలను సేకరించారన్న అంశాన్ని కూడా జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌లు విస్మరించారు. ఇది ఫిర్యాదిదారుడే విచారణ చేయటం అవుతుంది. తద్వారా సాక్ష్యాలను తారుమారు చేయటానికి, తప్పుడు సాక్ష్యాలను సృష్టించటానికి వారికి అవకాశం కలుగుతుంది. ❞**



**ఉత్తర ప్రదేశ్ పోలీసులు ఎన్‌కౌంటర్ పేరుతో సామాన్య ప్రజలను చంపుతున్నారని మానవ హక్కుల సంస్థలు చెబుతున్నాయి: 2017 నుండి 2020 జూన్ వరకు వారు 139 మందిని ఎన్‌కౌంటర్ చేసి చంపినట్లు అధికార వర్గాలు తెలిపాయి.**

ఈ విధంగా నివేదికలో పేర్కొన్న కేసులలో పోలీసు అధికారులు ఇచ్చిన నివేదికలపై కోర్టు పరిశీలించి, తన అభిప్రాయాలను వ్యక్తం చేయటం లేదు కాబట్టి ఒక కేసు విచారణను కొనసాగించాలా, ముగించాలా అన్నది హత్యకు పాల్పడిన పోలీసు అధికారుల అభిప్రాయంపై ఆధారపడి ఉంటున్నది. ఇటువంటి కేసులలో స్వతంత్రంగా విచారణ చేయటానికి అధికారాలు ఉన్న జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆధ్వర్యంలో ఇవి జరగటం ఆందోళన కలిగిస్తున్నది. పోలీసులు పాల్పడుతున్న చట్టవ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌లు చట్టబద్ధతను కల్పిస్తున్నారు. తాము పరిశీలించిన 11 కేసులలో పోలీసులకు వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయలేదన్న విషయాన్ని జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌లు నమోదు చేయలేదు. చట్టాన్ని ఉల్లంఘించటాన్ని గురించి పోలీసులను ప్రశ్నించలేదు. ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపామన్న పోలీసుల వాదనను అంగీకరించి, కేసులను ముగించటానికి అనుమతి ఇచ్చారు. పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపాదా లేదా అన్నది విచారణ సందర్భంలోనే రుజువవుతుంది. ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపామని పోలీసు అధికారులు చెప్పిన దానిని అంగీకరించి, కేసును ముగించటం న్యాయపరంగా సరైనది కాదు. నివేదికలో పరిశీలించిన వాటిలో మెజారిటీ కేసులలో కాల్పులు జరిపిన పోలీసులున్న పోలీస్ స్టేషన్ నుండే సాక్ష్యాలను సేకరించారన్న అంశాన్ని కూడా జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌లు విస్మరించారు. ఇది ఫిర్యాదిదారుడే విచారణ చేయటం అవుతుంది. తద్వారా సాక్ష్యాలను తారుమారు చేయటానికి, తప్పుడు సాక్ష్యాలను సృష్టించటానికి వారికి అవకాశం కలుగుతుంది.

నిందితులు మొదట విచక్షణా రహితంగా పోలీసులపై కాల్పులు జరిపారని, పోలీసులు ఆత్మరక్షణ కోసం తర్వాత కాల్పులు ప్రారంభించారని ప్రతి ఎఫ్ఐఆర్‌లోనూ ఉన్నది. ఈ 17మందిని పోలీసులు చంపిన ఘటనలలో సుమారుగా 280 మంది పోలీసులు పాల్గొన్నారు. వీరిలో 20 మందికే

> **"పోలీసులు అనుసరిస్తున్న 'ఎదురుకాల్పుల' విధానం, సత్వరన్యాయం పేరుతో జరుగుతున్న ప్రచారం ఈ విధమైన పద్ధతులను ఆమోదించే సామాజిక సంస్కృతికి దారితీస్తున్నది. ఇది న్యాయవ్యవస్థపై విశ్వాసం కోల్పోవటానికి కారణమౌతున్నది. న్యాయవ్యవస్థకు విరుద్ధంగా పాల్పడుతున్న హింసాకాండ నేరాలను తగ్గించటానికి దారితీయదు. హింసాత్మకమైన నేరాల నుండి ప్రజల దృష్టి మళ్ళించటానికి పోలీసులు ఇటువంటి కట్టుకథలను సృష్టిస్తున్నారు."**

గాయాలైనాయి. పరిశీలించిన 17కు 15 కేసులలో పోలీసుల కాళ్ళు, పాదాలకు గీసుకుపోవటం, రుద్దుకోవటం లాంటి స్వల్పగాయాలు మాత్రమే అయ్యాయని ఎఫ్ఐఆర్‌లు, మెడికల్ రిపోర్టులలో పేర్కొన్నారు. పోలీసులకు వ్యతిరేకంగా నేరస్తులు స్వల్పబలాన్ని మాత్రమే వినియోగించారని మెడికల్ రిపోర్టులు స్పష్టం చేస్తున్నాయి. పోలీసులు సంఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్నామని చెబుతున్న ఆయుధాలపై నేరస్తుల వేలిముద్రలు లేవని ఏడు కేసులలో నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. నిందితులు తమపై కాల్పులు ప్రారంభించారని పోలీసులు చేస్తున్న ఆరోపణలు అబద్ధాలని, నిందితుల వద్ద ఆయుధాలు లేవని ఇది స్పష్టం చేస్తున్నది. పోలీసులకు అయిన స్వల్పగాయాలు నిందితుల తుపాకుల నుండి వచ్చిన బులెట్లతోనే అయ్యాయని కూడా వారు రుజువు చేయలేకపోయారు.

పరిశీలించిన 17 లో 8 కేసుల దర్యాప్తును జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌కు బదులుగా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లు నిర్వహించారు. ఇది సిఆర్‌పిసిలోని సెక్షన్ 176(1-ఎ)ను, పియుసిఎల్ మార్గదర్శకాలను ఉల్లంఘించటం అవుతుంది. "సిఆర్‌పిసి సెక్షన్ 176 ప్రకారం పోలీసు కాల్పులలో మరణాలు సంభవించినపుడు దానిపై తప్పనిసరిగా మెజిస్టీరియల్ విచారణ జరగాలి. సెక్షన్ 190 ప్రకారం నివేదికను ఆ పరిధిలోని జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌కు పంపాలి" అని పియుసిఎల్ మార్గదర్శకాలలో పేర్కొన్నారు. మరణానికి సంబంధించిన కారణాలు, పరిసరాలను గురించి పరిశీలించటానికి, హత్యకు పాల్పడిన వారిని గురించి వివరంగా దర్యాప్తు జరపటానికి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ విచారణ తప్పనిసరి అని చెప్పారు. ఈ 8 కేసులపై దర్యాప్తు జరిపిన ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లు తమ పరిధిలో లేకపోయినప్పటికీ, పోలీసులు చేసిన హత్యలు 'న్యాయమైనవి' అని పేర్కొన్నారు. వీటిలో ఆరు కేసులలో సాక్ష్యాల శాస్త్రీయతపై మౌనం దాల్చారు. ఫోరెన్సిక్ నివేదిక, ఇతరంగా లభించిన సాక్ష్యాల విశ్లేషణ గురించి నివేదికలో పేర్కొనలేదు. హతులను చంపటానికి పోలీసులు ఉపయోగించిన ఆయుధాలను గురించి చెప్పలేదు. మృతుల బంధువులకు తమ వివరణలను ఇవ్వటానికి పూర్తి అవకాశం ఇవ్వాలని ఎన్‌హెచ్ఆర్‌సి మార్గదర్శకాలలో పేర్కొనగా, వారికి నామమాత్రంగా మాత్రమే అవకాశం ఇచ్చారు. రెండు కేసులలో మృతుల బంధువుల సాక్ష్యాలనే నమోదు చేయలేదు. నమోదు చేసిన వాటిని కూడా సాక్ష్యాలు లేవని లేదా నమ్మశక్యంగా లేవనే పేరుతో మేజిస్ట్రేట్‌లు తిరస్కరించారు.

ఎన్‌హెచ్ఆర్‌సి 12 కేసులను మూసివేయటానికి పోలీసు నివేదికలపై ఆధారపడింది. పోలీసులు జరిపిన విచారణలో మానవహక్కుల ఉల్లంఘనను గుర్తించటం, వాటిపై చర్య తీసుకోవటంలో ఎన్‌హెచ్ఆర్‌సి విఫలమైంది. పోలీసుల వివరణలను బలపరచటం, నివేదికలలోని లోపాలను మరుగుపరచటం ద్వారా విచారణ క్రమాన్ని దిగజార్చటాన్ని ఎన్‌హెచ్ఆర్‌సి న్యాయసమ్మతం చేసింది. పోలీసులు, ప్రభుత్వ అధికారులు చట్టవ్యతిరేకంగా బాధితులను బెదిరించటం, వారిపై హింసకు పాల్పడుతున్నపుడు ఎన్‌హెచ్ఆర్‌సి బాధితులకు చట్టపరంగా రక్షణ కల్పించటానికి పూనుకోలేదు. బాధితులు అణచివేయబడుతున్న మతాలకు చెందినవారు కావటం, వారిపై నేరస్తులుగా ముద్ర వేయటం మరింత ఆందోళన కలిగించే అంశం.

సాక్షుల రక్షణ పథకాన్ని రాజ్యాంగంలోని ఆర్టికల్ 141 కింద చట్టంగా రూపొందించాలని 2018 లో సుప్రీంకోర్టు చెప్పింది. బెదిరింపుల స్థాయిని బట్టి సాక్షులకు మూడు మాసాల పాటు రక్షణ కల్పించాలని ఈ పథకం చెబుతున్నది. బాధితుల కుటుంబాలు, సాక్షులు పోలీసుల బెదిరింపులు, హింసను ఎదుర్కొంటూ, రక్షణ కోసం తిరిగి ఆ పోలీసుల పైనే ఆధారపడాల్సి వస్తున్నది. చట్టవ్యతిరేక హత్యలకు గురైన బాధితుల కుటుంబాలను పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తుండగా, వారిపై అధికారులైన ఎసిపి లేక డిఎస్‌పిలు బెదిరింపుల విశ్లేషణ నివేదికలను రూపొందిస్తున్నారు. ఇది సహజన్యాయానికి విరుద్ధమైనది.

ఉత్తరప్రదేశ్ పోలీసులు అనేక సందర్భాలలో చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, ఇటువంటి అక్రమ పద్ధతులకు పాల్పడుతున్న పోలీసులు ఎటువంటి శిక్షలకు గురికావటం లేదని ఈ సంఘటనలపై విచారణ జరిపిన సంస్థలు రూపొందించిన నివేదికలు వెల్లడిస్తున్నాయి. హింసాకాండను సమర్థించటం, దీనిని కప్పిపుచ్చటానికి ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నదని స్పష్టమౌతున్నది. హత్యలకు పాల్పడిన పోలీసులను జవాబుదారీగా చేయటం, నేరస్తులను శిక్షించే విధానం పూర్తిగా విఫలమైనదని నివేదిక స్పష్టం చేస్తున్నది. రాజ్యం పాల్పడుతున్న హింసాకాండను ప్రశ్నించటంలో విఫలం కావటాన్ని ఇది వెల్లడిస్తున్నది.

పోలీసులు అనుసరిస్తున్న 'ఎదురుకాల్పుల' విధానం, సత్వరన్యాయం పేరుతో జరుగుతున్న ప్రచారం ఈ విధమైన పద్ధతులను ఆమోదించే సామాజిక సంస్కృతికి దారితీస్తున్నది. ఇది న్యాయవ్యవస్థపై విశ్వాసం కోల్పోవటానికి కారణమౌతున్నది. న్యాయవ్యవస్థకు విరుద్ధంగా పాల్పడుతున్న హింసాకాండ నేరాలను తగ్గించటానికి దారితీయదు. హింసాత్మకమైన నేరాల నుండి ప్రజల దృష్టి మళ్ళించటానికి, తక్షణన్యాయం పేరుతో అల్లరి మూకలు పాల్పడుతున్న హింసాకాండను, హత్యలను సమర్థించటానికి పోలీసులు ఇటువంటి కట్టుకథలను సృష్టిస్తున్నారు.

**(సంక్షిప్త, స్వేచ్ఛానువాదం: ఎ కోటిరెడ్డి)**

ఆర్థిక రంగం

# పారిశ్రామికీకరణ-నగదీకరణ

ఎ. కోటిరెడ్డి



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

కేంద్ర ప్రభుత్వం జాతీయ నగదీకరణ కార్యక్రమం (నేషనల్ మానెటైజేషన్ పైప్‌లైన్) ప్రకటించింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వరంగ సంస్థలు, వివిధ పరిశ్రమలు, ప్రజలకు సేవలందించే రోడ్లు, గ్యాస్ పైప్‌లైన్‌లు, విద్యుత్ సరఫరా లైన్‌లు, ఇంటర్‌నెట్‌ను అందించే ఆప్టిక్‌ఫైబర్ లైన్‌లు, టవర్లు, రైల్వేలైన్‌లు, వ్యాగన్‌లు, రైల్వే స్టేషన్‌లు, స్టేడియంలు, జాతీయస్థాయి నుండి గ్రామస్థాయి వరకు ఉన్న ప్రభుత్వ, ప్రభుత్వసంస్థల స్థలాలను అమ్మి సొమ్ము చేసుకోవటం, లేదా లీజుకు ఇవ్వాలని ప్రకటించారు. దీనినే నగదీకరణ కార్యక్రమమని చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంలోనివే కాకుండా రాష్ట్రాలు, జిల్లాలు, పంచాయితీల యాజమాన్యంలో ఉన్న పరిశ్రమలు, భూములు, ఆస్తులను కూడా అమ్మించటం లేదా లీజు కిప్పించటానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక ఇబ్బందులను ఉపయోగించుకొని, వారి రుణపరిమితిని పెంచాలంటే వారి ఆధీనంలోని ఆస్తులను లీజుకివ్వాలని ఒత్తిడి చేస్తున్నది. సరళీకరణ విధానాల అమలులో బూర్జువా రాజకీయ పార్టీలకు భిన్నాభిప్రాయాలు లేకపోవటం, తాము పాలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల వలన ఆ పార్టీల నాయకత్వంలోని ఎక్కువ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఒత్తిడికి లొంగిపోతున్నాయి.

ఆస్తులను నగదీకరణ చేయటానికి ప్రభుత్వం చెబుతున్న కారణాలు ఏ మాత్రం తర్కబద్ధంగా లేవు. కేంద్ర ప్రభుత్వం 111 లక్షల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రారంభిస్తున్న మౌలిక సదుపాయాల నిర్మాణ కార్యక్రమంలో వివిధ రకాలుగా సమాకూర్చుకొనే మొత్తంతో పాటు ఆస్తుల నగదీకరణ ద్వారా ఆరు లక్షల కోట్ల రూపాయలు సమీకరించుకోవాలని, అపుడే ఈ కార్యక్రమానికి అవసరమమైన నిధులు సమకూరతాయని ప్రభుత్వం చెబుతున్నది. మరోవైపున ప్రభుత్వం ఎటువంటి వ్యాపారాలు చేయదని, ప్రభుత్వరంగంలోని సంస్థలన్నింటినీ అమ్మివేస్తామని, కనీస ప్రభుత్వం, గరిష్ట పాలన ఆ విధంగానే సాధ్యమౌతుందని ప్రధాని ప్రకటించాడు. ఆస్తులను లీజుకు ఇచ్చి, ప్రభుత్వం నిర్ణయించిన కార్యక్రమాలను అమలు జరపాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది? దేశంలో సంపద ఉత్పత్తి కావటం లేదా? జిడిపి దిగజారిపోయిందా? ప్రపంచంలోని అన్ని దేశాల కన్నా దేశంలో జిడిపి పెరుగుదల ఎక్కువ ఉందని ప్రభుత్వమే చెబుతున్నది. మరి జిడిపి ఎక్కువగా పెరుగుతున్నపుడు ప్రభుత్వానికి వనరుల కొరత ఎందుకు ఎదురైంది? ఒకవైపున దేశంలోని శతకోటీశ్వరుల సంఖ్య, వారి సంపద వేగంగా పెరుగుతున్నది. కోవిడ్ కాలంలో దేశంలోని మెజారిటీ ప్రజలు ఉపాధి కోల్పోయి, తినటానికి తిండి దొరకని పరిస్థితులు ఒకవైపున ఉండగా, మరోవైపున 100 మంది శత కోటీశ్వరుల సంపద 12.97 లక్షల కోట్ల రూపాయలు పెరిగింది. ఈ విధంగా కోవిడ్ కాలంలో 100 మంది వద్ద పెరిగిన సంపదే ప్రభుత్వం మౌలిక సదుపాయాల నిర్మాణానికి నగదీకరణ కార్యక్రమం ద్వారా కోరుతున్న ఆరు లక్షల కోట్లరూపాయల కంటే రెట్టింపుకు పైగా ఉన్నది. అంటే దేశంలో ఉత్పత్తి పెరగకపోవటం, సంపద ఉత్పత్తి కాకపోవటం సమస్య కాదు. ఆ సంపద ప్రభుత్వం వద్దకు చేరకుండా ప్రైవేటు వారి వద్ద పోగుపడటమే నిధుల కొరతకు కారణం. అదే కారణాన్ని చూయించి నగదీకరణను ముందుకు తీసుకురావటం, ఆ పేరుతో సంపదను పోగుచేసుకున్న వారికే ప్రభుత్వ ఆస్తులను అప్పగించటానికి ప్రయత్నించటం ప్రభుత్వ బడా పెట్టుబడిదారీ అనుకూల విధానాలను వెల్లడిస్తున్నది.

## పెట్టుబడిదారుల వద్ద పోగుబడుతున్న సంపద

సరళీకరణ విధానాల అమలు ప్రారంభం కావటంతో పెట్టుబడిదారుల వద్ద సంపద పోగుపడటం పెరిగింది. ఎటువంటి ఆటంకాలు లేకుండా సంపదలను కొల్లగొట్టుకోవటానికి ద్రవ్య పెట్టుబడులకు అవకాశాలు కల్పించటమే సరళీకరణ విధానాల లక్ష్యం. అటువంటి అవకాశాలు కల్పించినందు వలననే బడా పెట్టుబడిదారులు, బహుళజాతి సంస్థల వద్ద సంపదలు పోగుపడుతున్నాయి. కార్పొరేట్, బహుళజాతి సంస్థలకు పన్ను రాయితీలతో పాటు వారు పరిశ్రమలు ఏర్పాటు చేయటానికి భూములు సేకరించి ఇవ్వటం, విద్యుత్, నీరు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించటంలో భారీగా రాయితీలు ఇవ్వటం, రుణాలు ఇవ్వటంలో ఉదారంగా వ్యవహరించటం, బ్యాంకుల వద్ద రుణాలు తీసుకున్నవారు చెల్లించకుండా ఎగ్గొట్టినా వసూలు చేయకుండా వదిలివేయటం, ప్రభుత్వరంగ సంస్థల వాటాలను కారుచౌకగా వారికి కట్టబెట్టటం తదితరాల ద్వారా సంపదలను విపరీతంగా కూడబెట్టుకొంటున్నారు. ఎగుమతి, దిగుమతులలో అక్రమాలు, దేశంలో తమ పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాల వలన సంపాదించిన లాభాలను పూర్తిగా వెల్లడించకపోవటం తదితర రూపాలలో అక్రమంగా సంపదలను పెంచుకొంటున్నారు. కాబట్టి కార్పొరేట్లు, బహుళజాతి సంస్థల వద్దకు అక్రమంగా చేరుతున్న సంపద నుండి ప్రభుత్వం తగిన మొత్తంలో పన్నులను వసూలు చేయటం, వారు ప్రభుత్వ బ్యాంకులు, ద్రవ్యసంస్థలకు ఎగ్గొడుతున్న రుణాలను రద్దు చేయకుండా వసూలు చేయటానికి చర్యలు తీసుకోవటం, వారికిస్తున్న రాయితీలను క్రమబద్ధీకరించటం, వారి అక్రమ కార్యకలాపాలను నిరోధించటం చేస్తే ప్రభుత్వానికి ఏ మాత్రం నిధుల కొరత ఉ

**“ ఇపుడు ప్రభుత్వం ప్రతిపాదించిన జాతీయ నగదీకరణ కార్యక్రమం ద్వారా ఆర్థికవ్యవస్థలో నాయకత్వ స్థానం ప్రభుత్వం నుండి ప్రైవేటురంగం చేతుల్లోకి మారటం మాత్రమే కాదు. ప్రైవేటురంగం నాయకత్వస్థానంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వానికి పరిపాలనపై మరింతగా పట్టు తగ్గిపోతుందనేది ఆందోళన కలిగించే అంశం. 1991 తర్వాత వివిధ సంస్థలను రెగ్యులేట్ చేసే స్వతంత్ర రెగ్యులేటరీ సంస్థలను ఏర్పాటు చేయటంతో ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకోవటం తగ్గిపోతున్నది. ”**

ఒడదు. ఇంకా అనేక కార్యక్రమాలు చేయటానికి అవసరమైన వనరులు కూడా సమకూరుతాయి. కాని మనదేశంలో కార్పొరేట్, బహుళజాతి సంస్థల నుండి చాలా తక్కువ శాతం పన్నులను వసూలు చేస్తున్నారు. సంపద పెరుగుతున్న చోటు నుండి ప్రభుత్వం వనరులను సమీకరించటం లేదు. పైగా ఆదాయలేమి పేరుతో ప్రభుత్వరంగ సంస్థలు, ప్రజల ఆస్తులను తిరిగి వారికే కట్టబెడుతున్నది. ప్రభుత్వం ద్రవ్య పెట్టుబడులకు సేవకునిగా వ్యవహరిస్తున్న తీరును ఇది వెల్లడిస్తున్నది.

### స్వాతంత్ర్యానంతరం పారిశ్రామికీకరణకు కృషి

వలస పాలన నుండి విముక్తి చెందిన తర్వాత దేశాన్ని పారిశ్రామికవంతం చేయటానికి పూనుకున్నపుడు అనేక ఆటంకాలు ఎదురైనాయి. పారిశ్రామికీకరణకు అవసరమైన వనరులు ప్రభుత్వం వద్దలేవు. మౌలిక సదుపాయాలు, సాంకేతిక నిపుణుల కొరత వెన్నాడుతున్నాయి. అంతర్జాతీయంగా ఆర్థిక, సాంకేతిక వనరులున్న బహుళజాతి కంపెనీలు, సామ్రాజ్యవాద దేశాలు దేశ పారిశ్రామికీకరణకు వ్యతిరేకంగా ఉన్నాయి. అటువంటి పరిస్థితులలో సోవియట్ యూనియన్, సోషలిస్టు దేశాల సహాయంతో పారిశ్రామికీకరణకు ప్రభుత్వం కృషి ప్రారంభించింది. తగిన ప్రణాళిక, ఉన్న పరిమిత వనరులను సక్రమంగా వినియోగించుకోవటం, దిగుమతులపై ఆంక్షలు విధించటం, స్వతంత్ర విదేశాంగ విధానం తదితరాల ద్వారా పారిశ్రామికీకరణ కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోయారు.

ఆ విధమైన కృషి, సోషలిస్టు దేశాల సహకారంతో దేశంలో ప్రభుత్వరంగ సంస్థల నిర్మాణం సాధ్యమైంది. ఉక్కు, ఇనుము, విద్యుత్, మందులు, రక్షణ, పరిశోధన, అభివృద్ధి, అంతరిక్షరంగం, అణురంగం తదితరాలలో ప్రభుత్వరంగ సంస్థలు ఏర్పడ్డాయి. ప్రజల నుండి ధనాన్ని సమీకరించి తమ స్వప్రయోజనాలకు వినియోగించుకొంటూ ప్రజలను మోసం చేస్తున్న పెట్టుబడిదారుల చేతుల్లో ఉన్న బ్యాంకులు, బీమాసంస్థలను జాతీయం చేశారు. ఆ విధంగా ప్రభుత్వం చేతిలోకి ఆర్థిక వనరులు వచ్చాయి. పంచవర్ష ప్రణాళికలను రూపొందించి, ప్రణాళికాబద్ధమైన కృషి చేయటం ద్వారా దేశంలో పారిశ్రామికాభివృద్ధిని సాధించటం సాధ్యమైంది. మోడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసింది.

ప్రభుత్వరంగంలో భారీ పరిశ్రమలు ఉండటం వలన వాటిని ఉపయోగించుకొని ప్రైవేటురంగం అభివృద్ధి సాధించగలిగింది. ప్రభుత్వరంగంలోని పరిశ్రమలు, వనరులు, రాయితీలను వినియోగించుకొని ప్రైవేటురంగం బలపడిన తర్వాత ప్రభుత్వరంగంలోని సంస్థలను మింగాలనే లక్ష్యంతో బడా పెట్టుబడిదారులు వాటిపై దాడి ప్రారంభించారు. ప్రభుత్వరంగంలోని సంస్థలు అసమర్ధంగా ఉన్నాయని, నష్టాల పాలవుతున్నాయని, ప్రైవేటురంగం సమర్ధవంతంగా పనిచేస్తున్నదని, కాబట్టి నష్టాలలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను మూసివేయాలని, లేదా ప్రైవేటు వారికి అప్పగించాలని డిమాండ్ చేయటం ప్రారంభించారు. వాస్తవంగా ప్రభుత్వరంగ సంస్థలే సమర్ధవంతంగా పనిచేస్తున్నాయి. కొన్ని ప్రభుత్వరంగ సంస్థలలో ప్రభుత్వం మితిమీరి జోక్యం చేసుకోవటం, ప్రైవేటు వారి ప్రయోజనాల కోసం కొన్ని సంస్థలను దివాళా తీయించే విధంగా వ్యవహరించటం జరుగుతున్నది. వీటిని కప్పిపెట్టి ప్రభుత్వరంగం అంతా నష్టాలలోనే ఉందని, వాటిని నడపటానికి ప్రజలు చెల్లించిన పన్నుల ద్వారా వచ్చిన డబ్బును వృథా చేస్తున్నారని సరళీకరణ విధానాలను బలపరిచే వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇపుడు జాతీయ నగదీకరణ కార్యక్రమం అమలు కోసం అదే వాదనను మోడి కూడా చేస్తున్నాడు.

ప్రభుత్వరంగ సంస్థలను, ఆస్తులను అమ్మటం, మౌలిక సదుపాయాలను లీజుకివ్వటం ద్వారా వచ్చిన ధనాన్ని ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తామని ప్రధాని చెబుతున్నాడు. పేదలకు ఇళ్ళు నిర్మించటం, గ్రామాలలో రోడ్ల నిర్మాణం, పాఠశాలలను ప్రారంభించటం, పరిశుభ్రమైన మంచినీటిని సరఫరా చేయటం కోసం ఈ నిధులను వినియోగిస్తామని పేర్కొన్నాడు. కాని ఈ నగదీకరణ కార్యక్రమం ద్వారా పరిశ్రమలు, భూములు, అడవులు, గనులు, రోడ్లు, ఇతర వనరులన్నీ ప్రైవేటు వారి చేతుల్లోకి వెళ్ళిన తర్వాత ఏం జరుగుతుంది? ఇప్పటికే దేశంలో అత్యంత వేగంగా సంపద కేంద్రీకరణ జరుగుతున్నది. దేశంలోని ఒకశాతం మంది చేతుల్లో 40 శాతంపైగా సంపద కేంద్రీకృతమై ఉంది. కొత్తగా ఉత్పత్తి అవుతున్న సంపదలో 73 శాతం ఒక్కశాతం మంది వద్దకు చేరుతున్నదని 2018 ఆక్స్‌ఫాం నివేదిక పేర్కొంది. ఇపుడు మోడి ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానాలతో సంపద మరింత వేగంగా కేంద్రీకృతమౌతుంది. అసమానతలు మరింత తీవ్రమౌతాయి. ఇప్పటికే ప్రభుత్వాలు బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా, వారి లాభాలను పెంపొందించే విధానాలను రూపొందిస్తున్నాయి. అదాని, అంబానిల కోసం ఎయిర్‌పోర్టులు, పోర్టుల ప్రైవేటీకరణ, విద్యుత్‌రంగంలో మార్పులు చేస్తున్నారు. ఎయిర్ ఇండియాను టాటాలకు కట్టబెట్టారు. వారి లాభాల కోసమే ప్రైవేటీకరణ, నగదీకరణ కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. ప్రభుత్వరంగం అంతమై పారిశ్రామికరంగం ప్రైవేటు వారి చేతుల్లో కేంద్రీకరింపబడటం, వనరులపై ప్రైవేటు వారి ఆధిపత్యం పెరగటం తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుంది.

దేశంలోని బడా పెట్టుబడిదారులు తమ లాభాల కోసం అంతర్జాతీయ పెట్టుబడులతో కలిసి వ్యవహరిస్తున్నారు. బడా పెట్టుబడిదారులు, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడులు తమకు లాభాలు తెచ్చిపెట్టే విధానాలను మాత్రమే అమలుచేయాలని ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తాయి. ఆర్థికరంగంలోని కీలక విభాగాలు ప్రభుత్వం చేతిలో ఉన్నాయి కాబట్టి వారి ఒత్తిడికి ప్రభుత్వాలు పూర్తిగా లొంగటం లేదు. కీలకరంగాలన్నీ ప్రైవేటు, విదేశీ పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్ళిన తర్వాత వారి ఒత్తిడిని ప్రతిఘటించగల శక్తి

ప్రభుత్వాలకు ఉండదు. అపుడు ప్రభుత్వాలు ప్రజల ప్రయోజనాలను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోవు. నగదీకరణ ద్వారా వచ్చిన నిధులను ప్రజల సంక్షేమం కోసం ఖర్చు పెడతామని ఇపుడు ప్రధాని చెబుతున్నాడు. కాని అవి నగదీకరణకు ప్రజలను ఒప్పించటానికి చెబుతున్న మాటలు మాత్రమే. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వ వనరులను ఖర్చు పెట్టటానికి కార్పొరేట్, బహుళజాతి సంస్థలు అంగీకరించవు. కాబట్టి ఆ మొత్తాన్ని కూడా తమకు లాభాలు కల్పించే విధంగానే ఖర్చు పెట్టాలని ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తారు.

ఉపాధి లేమి, ధరల పెరుగుదలతో పాటు సంక్షేమ పథకాల ద్వారా వచ్చే మొత్తం కూడా అందకపోవటంతో ప్రజల జీవితం దుర్భరంగా మారుతుంది. ప్రజలు తమ జీవనం కోసం అనివార్యంగా పోరాటాలు చేయవలసిన పరిస్థితికి నెట్టబడతారు. కాని ద్రవ్య పెట్టుబడుల ప్రతినిధులు ప్రజల పోరాటాలను పక్కదారి పట్టించటానికి, ప్రజలను కులాలు, మతాలు, జాతులు, భాషలు తదితర వైవిధ్యాల ఆధారంగా చీల్చటానికి పూనుకుంటారు. అప్పటికీ నిరాశచెందకుండా పోరాటాలలోకి వస్తున్న ప్రజలను అణచివేయటానికి నిరంకుశ విధానాలను అమలుచేస్తారు. రాజ్యాంగాన్ని, చట్టాలను పక్కన పెట్టి, ప్రజల పోరాటాలను పాశవికంగా అణచివేస్తారు. వీటన్నింటినీ ప్రస్తుతం బిజెపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలలో మనం చూస్తున్నాం. ఆర్థికాధిపత్యం పూర్తిగా ప్రైవేటు వారి చేతుల్లోకి చేరిన తర్వాత ఈ విధానాలు, అణచివేత మరింత తీవ్రం అవుతాయి.

ఇపుడు ప్రభుత్వం ప్రతిపాదించిన జాతీయ నగదీకరణ కార్యక్రమం ద్వారా ఆర్థికవ్యవస్థలో నాయకత్వ స్థానం ప్రభుత్వం నుండి ప్రైవేటురంగం చేతుల్లోకి మారటం మాత్రమే కాదు. ప్రైవేటురంగం నాయకత్వస్థానంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వానికి పరిపాలనపై మరింతగా పట్టు తగ్గిపోతుందనేది ఆందోళన కలిగించే అంశం. 1991 తర్వాత వివిధ సంస్థలను రెగ్యులేట్ చేసే స్వతంత్ర రెగ్యులేటరీ సంస్థలను ఏర్పాటు చేయటంతో ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకోవటం తగ్గిపోతున్నది. తీవ్రమైన పరిస్థితులు ఏర్పడినపుడు వాటిని ఎదుర్కోవటానికి, ధరలను అదుపుచేయటానికి, ప్రజలను దోపిడీ చేయటానికి ప్రయత్నం చేసే బహుళజాతి, కార్పొరేట్ సంస్థల లాభాపేక్షను అదుపుచేయటానికి మార్కెట్‌లో జోక్యం చేసుకోవటానికి అవసరమైన కీలకమైన యంత్రాంగం ప్రభుత్వం చేతిలో ఉండాలి. కాని 1991 తర్వాత పెట్టుబడిదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవటం ముఖ్యమనే విధానం ప్రాతిపదికగా ఆర్థిక విధానాలను రూపొందిస్తున్నారు. మార్కెట్‌ను, లాభాలను క్రమబద్ధీకరించటంలో ప్రభుత్వాలు వెనుకంజవేయటంతో ఆశ్రిత పెట్టుబడిదారులు రెగ్యులేటరీ సంస్థలతో కలిసి తమ దోపిడీని కొనసాగిస్తున్నారు.

> ❝ వృత్తిపరమైన పోటీతత్వం, ఆచరణ, సమర్ధత, విజయం సాధించటం కేవలం ప్రైవేటు సంస్థలకు మాత్రమే స్వంతమని ప్రచారం చేస్తున్నారు. కాని ఎన్ని ప్రైవేటు సంస్థలు నష్టాలలో కూరుకుపోయాయి, ప్రభుత్వరంగ బ్యాంకులు, ద్రవ్యసంస్థలకు ఎంత మొత్తాలను ఎగవేశాయనేది చూస్తే ఈ వాదనలోని బండారం బయటపడుతుంది. బ్యాంకింగ్, వైమానిక రంగాలలో ఈ దివాళాలు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. ❞

ఎయిర్ ఇండియాను అమ్మటంతో దేశంలోని పౌర విమానయాన రంగం అంతా ప్రైవేటు వారి చేతుల్లోకి పోయింది. వైమానికరంగంలో ప్రైవేటు సంస్థలు అనేకం దివాళా తీశాయి. అత్యవసర పరిస్థితులలో వినియోగించుకొనే అవకాశం, ఈ రంగానికున్న సాంకేతిక నైపుణ్యం, వర్క్‌షాపులు, శిక్షణ వ్యవస్థలను భారత వాయుసేన వినియోగించుకొంటుండటం వలన దీనికి దేశరక్షణ రీత్యా కూడా ప్రాధాన్యత ఉన్నది. విద్యుత్ రంగంలో అనుసరిస్తున్న విధానాలు కూడా ప్రమాదకరంగా మారుతున్నాయి. పునరుత్పాదక విద్యుదుత్పత్తిలో ప్రైవేటు వారి పాత్రను పెంచటానికి, వంపిణీని ప్రైవేటీకరించటంతో పాటు ట్రాన్స్‌మిషన్ విభాగాన్ని కూడా ప్రైవేటీకరించటానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. ఎన్ని రోజులలో చేస్తారనేది మినహా మొత్తం విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించటానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. కాని ప్రస్తుత పరిస్థితులలో విద్యుత్‌ను పొందటం అనేది మౌలికమైన హక్కుగా ఉన్నది. ఈ మౌలికమైన హక్కును అమలుచేయటంలో ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకొంటుందా? తప్పుకొంటే దాని ఫలితాలు తీవ్రంగా ఉంటాయనేది స్పష్టమే.

**ఆర్థికరంగంలో ప్రైవేటు సంస్థల గుత్తాధిపత్యం ఏర్పడుతుంది**

ప్రభుత్వ సంస్థలు ప్రైవేటుపరం కావటం, మౌలిక సదుపాయాలన్నీ ప్రైవేటు వారి చేతుల్లోకి వెళ్ళటంతో వివిధ రంగాలలో గుత్తాధిపత్యం ఏర్పడుతుంది. టెలికాం, విద్యుత్‌రంగంలో ఉన్న సంస్థలు బ్యాంకులకు 10 లక్షల కోట్ల రూపాయలు బకాయి పడివున్నాయి. ప్రస్తుతం ఉన్న టెలికాం సంస్థలు తాము చెల్లించాల్సిన పన్నులను చెల్లిస్తే రిలయన్స్ మినహా మిగతా సంస్థలన్నీ దివాళా తీస్తాయి. రిలయన్స్ గుత్తాధిపత్యం ఏర్పడుతుంది. సామాజిక రంగంలో పరిస్థితులు దిగజారుతున్నాయి. వైద్యరంగంలో కూడా గుత్తాధిపత్యం ఏర్పడుతున్నది. 2016-17 నుండి 2017-18 నాటికి ఒక సంవత్సర కాలంలో గ్రామీణప్రాంత ప్రజల రుణభారం 1.8 రెట్లు పెరిగి, 3.7 లక్షల కోట్ల రూపాయల నుండి 6.74 లక్షల కోట్ల రూపాయలకు చేరింది. భౌగోళిక రాజకీయాలు, జాతీయరక్షణ ప్రధానాంశాలుగా ఉండే పెట్రోలియం ఉత్పత్తుల లాంటి రంగంలో కూడా హ్రస్వదృష్టితో వ్యవహరిస్తూ శక్తివంతమైన బహుళజాతి సంస్థలు ఈ రంగంలోకి ప్రవేశించటానికి అవకాశం కల్పిస్తున్నది. గతంలో హెచ్‌పిసిఎల్ వాటాలను ఒఎన్‌జిసి కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఒత్తిడి చేసింది. హెచ్‌పిసిఎల్‌ను, ఒఎన్‌జిసిని కలిపి భారిస్థాయి ఆయిల్ కంపెనీని ఏర్పాటు చేయటం కోసం కాక, ఒఎన్‌జిసి వద్ద ఉన్న మిగులు నిధులను స్వంతం చేసుకోవటమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరించింది. ఆ తర్వాత ఒఎన్‌జిసి వద్ద ఉన్న హెచ్‌పిసిఎల్ షేర్లను అమ్మించారు. బిపిసిఎల్ షేర్లను కూడా అమ్మాలని ఒత్తిడి పెట్టటంతో ప్రైవేటు సంస్థలు ఈ రంగంలో కాలూనటానికి అవకాశం కలిగింది. కాని గతంలో జరిగిన సంఘటనలను ప్రభుత్వం మరచిపోతున్నది. 1971లో బంగ్లాదేశ్ విముక్తి కోసం పాకిస్తాన్‌తో యుద్ధం జరుగుతున్నపుడు అమెరికా కంపెనీగా ఉన్న కాల్టెక్స్ ప్రభుత్వంతో

**❝ వృత్తిపరమైన పోటీతత్వం, ఆచరణ, సమర్థత, విజయం సాధించటం కేవలం ప్రైవేటు సంస్థలకు మాత్రమే స్వంతమని ప్రచారం చేస్తున్నారు. కాని ఎన్ని ప్రైవేటు సంస్థలు నష్టాలలో కూరుకుపోయాయి, ప్రభుత్వరంగ బ్యాంకులు, ద్రవ్యసంస్థలకు ఎంత మొత్తాలను ఎగవేశాయనేది చూస్తే ఈ వాదనలోని బండారం బయటపడుతుంది. బ్యాంకింగ్, వైమానిక రంగాలలో ఈ దివాళాలు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. ❞**

సహకరించటానికి తిరస్కరించింది. ఆ సంస్థను ప్రభుత్వం జాతీయం చేయటానికి అది ప్రధాన కారణం.

పభుత్వం అమెరికాతో ద్వైపాక్షిక సంబంధాలతో పాటు సైనిక సంబంధాలను కూడా బలోపేతం చేసుకొంటున్నది. కాని అమెరికాకు విదేశాంగ విధానంలో కాని, ఇతర దేశాలతో సైనిక సంబంధాలను పెంపొందించుకోవటంలో కాని తన ప్రయోజనాలే ముఖ్యం మినహా ఎదుటి వారి ప్రయోజనాలు పట్టవు. ఎంతో సన్నిహితమైన సంబంధాలను నెరపిన దేశాలతో కూడా భిన్న ప్రయోజనాలు ముందుకొచ్చినపుడు తన ప్రయోజనాలే పరమావధిగా అమెరికా వ్యవహరిస్తూ ఆ దేశాలను నష్టపెట్టింది. అమెరికా ప్రభుత్వ విధానాలను అత్యంత సన్నిహితంగా పరిశీలిస్తున్న నోమ్‌చోమ్‌స్కీ అమెరికా వ్యవహార సరళిని గురించి ఒక సందర్భంలో ఇలా వ్యాఖ్యానించాడు. " జపాన్ సైనిక, పారిశ్రామిక కార్యకలాపాలను తమ ఇష్టానుసారం నిర్దేశించటానికి ఆ దేశం చేసుకొంటున్న ఆయిల్ దిగుమతులపై అమెరికా అదుపు ఉండటం ఉపయోగపడుతుందని ప్రణాళికా విభాగం ప్రధానాధికారి జార్జి కెన్నన్ 1949లో వ్యాఖ్యానించాడు. ఈ విధానానికి అనుగుణంగా జపాన్ పారిశ్రామికవంతం కావటానికి సహకరించారు. కాని జపాన్‌కు ఆయిల్ సరఫరాలపై అమెరికా అదుపు కొనసాగింది". ఈనాటికీ ఈ విధంగానే అమెరికా వ్యవహరిస్తున్నది. ఇతర దేశాలను తన అదుపులో ఉంచుకోవటాన్ని విదేశాంగ విధానంలో ప్రధానాంశంగా అమలు చేస్తూ, తన మాట వినని దేశాలపై ఆంక్షలు విధిస్తున్నది. ఇటువంటి పరిస్థితులలో భారతదేశం దీనిని ఏ విధంగా ఎదుర్కోగలుగుతుంది? దేశంలోని బడా కార్పొరేట్ సంస్థలు తమ ఆర్థిక ప్రయోజనాల కోసం తమ ఆధీనంలో ఉన్న సంస్థల వాటాలను బహుళజాతి సంస్థలకు అమ్ముతున్నాయి. రిలయన్స్ లాంటి సంస్థలు తమ ఆధీనంలోని ఆయిల్ కంపెనీలలోని వాటాలను బహుళజాతి సంస్థలకు అమ్మటంతో ఆర్థికంగా, రాజకీయంగా అత్యంత శక్తివంతమైన సంస్థలు ఈ కీలకమైన రంగాలలోకి ప్రవేశిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులలో వాటి కార్యకలాపాలను అదుపుచేయటానికి ప్రభుత్వం వద్ద ఏ విధమైన సాధనాలు లేని పరిస్థితి ఏర్పడుతున్నది.

### పారిశ్రామిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళిక కావాలి

దేశంలో పారిశ్రామికాభివృద్ధిని సాధించాలంటే ప్రభుత్వానికి దృఢ సంకల్పం, దీర్ఘకాలిక ప్రణాళిక కావాలి. పారిశ్రామికరంగాన్ని ప్రైవేటీకరించటం, ప్రైవేటు, విదేశీ పెట్టుబడులకు రాయితీలివ్వటం, సానుకూల వ్యాపార విధానాలు(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) అమలు చేయటం ద్వారా ర్యాంకులలో పైకి ఎగబాకటం వలన పారిశ్రామికీకరణను సాధించలేం. పారిశ్రామికీకరణ కోసం ప్రభుత్వరంగాన్ని ప్రధాన సాధనంగా వినియోగించుకోవాలి. ఈ విషయంలో భారత్, చైనాలను పోల్చవచ్చు. బిహెచ్ఇఎల్‌తో సమానమైన పరిశ్రమలు ప్రపంచంలో డజను దేశాలలో కూడా లేవు. కాని ప్రపంచబ్యాంకు, ఇతర విదేశీ సంస్థల పర్యవేక్షణలో అంతర్జాతీయ పోటీతో టెండర్లు వేసే విధానాన్ని భారతదేశం అనుసరిస్తున్నది. అంతిమంగా టెండర్‌ను ప్రపంచబ్యాంకు ఫైనల్ చేస్తుంది. చైనా ఈ రంగంలోకి ఆలస్యంగా అడుగుపెట్టింది. విదేశీ, స్వదేశీ సంస్థలు ఒకేవిధమైన షరతులు, నిబంధనలు విధిస్తే దేశీయ ఉత్పత్తిదారులకు చైనా ప్రాధాన్యత ఇస్తున్నది. మనదేశం ఆ విధంగా చేయటం కాక ప్రపంచబ్యాంకు నిర్ణయానికి అనుగుణంగా వ్యవహరిస్తున్నది. విద్యుత్ యంత్రాల ఉత్పత్తిలో అంతర్జాతీయంగా పోటి పెరిగినపుడు దేశీయ ఉత్పత్తిదారులకు చైనా ప్రాధాన్యత ఇచ్చింది. పర్యావరణ మార్పులపై ప్రపంచస్థాయిలో ఉద్యమం తీవ్రమవటాన్ని గమనించిన చైనా బొగ్గుతో విద్యుత్‌ను ఉత్పత్తి చేసే యంత్రాలను ఎగుమతి చేయటంలో అగ్రస్థాయికి చేరింది. బొగ్గుతో విద్యుత్‌ను ఉత్పత్తి చేయటం కోసం మనదేశంలో నెలకొల్పిన 34 కేంద్రాలకు యంత్రాలను పూర్తిగా చైనా నుండే దిగుమతి చేసుకున్నారు. ఇవి బిహెచ్ఇఎల్ నాలుగు సంవత్సరాల ఉత్పత్తితో సమానం.

### ప్రైవేటుసంస్థలే అసమర్థంగా ఉన్నాయి

వృత్తిపరమైన పోటీతత్వం, ఆచరణ, సమర్థత, విజయం సాధించటం కేవలం ప్రైవేటు సంస్థలకు మాత్రమే స్వంతమని ప్రచారం చేస్తున్నారు. కాని ఎన్ని ప్రైవేటు సంస్థలు నష్టాలలో కూరుకుపోయాయి, ప్రభుత్వరంగ బ్యాంకులు, ద్రవ్యసంస్థలకు ఎంత మొత్తాలను ఎగవేశాయనేది చూస్తే ఈ వాదనలోని బండారం బయటపడుతుంది. బ్యాంకింగ్, వైమానిక రంగాలలో ఈ దివాళాలు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఇతర రంగాలు కూడా దివాళాలకు అతీతంగా లేవు. చివరకు ఈ దివాళాల ఫలితంగా ప్రభుత్వరంగ బ్యాంకులలో పేరుకుపోతున్న కార్పొరేట్ రుణాలను పరిష్కరించటానికి ప్రభుత్వం బాడ్‌బ్యాంక్‌ను ఏర్పాటు చేయాల్సివచ్చిందంటే దివాళాలు ఏ స్థాయిలో ఉన్నాయనేది స్పష్టమౌతుంది. బాడ్‌బ్యాంక్‌ను ఏర్పాటు చేసింది ప్రభుత్వరంగ సంస్థల కోసమని చెప్పే ధైర్యం ప్రభుత్వానికి గాని, సరళీకరణ విధానాల సమర్థకులకు గాని లేదు. అంటే ప్రైవేటు సంస్థల కోసమే బ్యాడ్‌బ్యాంక్ అని స్పష్టమౌతున్నది. మరి ఇంత సమర్థవంతమైనవని చెబుతున్న కార్పొరేట్ సంస్థలు నష్టపోవటం, వాటి కోసం బాడ్‌బ్యాంక్‌ను ఏర్పాటు చేయాల్సివచ్చిందంటేనే ఈ ప్రచారంలోని డొల్లతనం వెల్లడౌతున్నది.

ప్రభుత్వరంగ సంస్థలు, మౌలిక సదుపాయాలు పూర్తిగా ప్రైవేటు పరమైతే దేశ ఆర్థికవ్యవస్థపై సామ్రాజ్యవాదుల పట్టు పెరుగుతుంది. ప్రజల కడగండ్లు తీవ్రమౌతాయి. దారిద్ర్యం, నిరుద్యోగం, అసమానతలు మరింతగా పెరుగుతాయి. సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడుతుంది. ఈ అంశాలను ప్రజలు గమనంలోకి తీసుకొని ప్రభుత్వరంగ పరిరక్షణ, దేశ వనరులను నగదీకరించే విధానాలకు వ్యతిరేకంగా పోరాడటానికి ముందుకురావాలి. ❊

# కార్మిక సంఘాలలో పార్టీ పని -1952

**(2వ పేజీ తరువాయి)**

నేర్చుకోవటానికి అవకాశం కల్పించాలి.

"తన లక్ష్య సాధనకు ఉద్యోగస్తులపైకి నిరుద్యోగులను ఉసిగొల్పే దోపిడీదారులకు వ్యతిరేకంగా ఇద్దరిలో ఐక్యతను పెంచడం నేర్చుకోవాలి.

"పరిశ్రమ లోపల కార్మికుల పోరాటాలకు నాయకత్వం వహించేందుకు అనువైన, భయంలేని, మిలిటెంట్‌గా, సదా అప్రమత్తంగా ఉండే తెలివైన కొత్త కార్యకర్తలను ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకోవాలి.

"కార్మికసంఘాల కార్యకర్తలు ప్రజా సమూహం నుంచి దూరంగా ముందుకు పోకూడదు; అదే సమయంలో వెనకపడి పోకూడదు. ఇది కేవలం అనుభవం, అధ్యయనాల వల్లనే సాధ్యం. కొన్నిసార్లు అనుభవంలేని సంఘ సభ్యులు దూకుడుగా పోతుంటే నిలవరించాలి; కొన్నిసార్లు స్తబ్దంగా ఉంటే ఉత్తేజితులను చేసి కార్యక్రమాలలో దించాలి.

"కార్మికసంఘ కార్యకర్తలు గత అనుభవాల ద్వారా ప్రజా పోరాటాలు నిర్వహించే ఎత్తుగడలను తెలుసుకోవాలి; పోరాటాలలో ప్రాంతీయ సంప్రదాయాలు, వాటి శక్తులను తెలుసుకుని, వాటి నుండి గుణపాఠాలు తీసుకోవాలి. సాధారణ దృక్పథాలను తెలుసుకోవడానికి తప్ప పోరాటాలలో అనుసరించవలసిన సూత్రాలు ముందే రూపొందించబడి సిద్ధంగా ఉండవు.

"పరిశ్రమ గనుక గ్రామంలో నిర్మించబడి ఉంటే మన కార్మికసంఘ కార్యకర్తలు రైతాంగం గురించి తెలుసుకోవాలి. అటువంటి ప్రదేశాలలో కార్మికులు గ్రామంలో నివసిస్తూ పరిశ్రమకు వచ్చి పనిచేస్తారు. అటువంటప్పుడు చుట్టూ ఉన్న రైతాంగంతో సమ్మె పోరాటాలు ముడిపడి ఉంటాయి. ఆ రైతుల సహాయాన్ని ఎలా తీసుకోవాలో ఎరిగి ఉండాలి; ఆ రైతుకి ఏ విధంగా సహాయం చేయాలో తెలియాలి. చెరకు పంట పొలాలు, టీ తోటలు, ఖనిజాల వెలికితీత వగైరా ప్రాంతాలలో చౌకగా కార్మికులు, భూమి లభించే సుదూర ప్రాంతాలలో కొత్త పరిశ్రమలు నిర్మిస్తారు. ఇటువంటి చోట్ల రైతాంగం అందించే సహకారం, వారితో ఉన్న సంబంధాలతో కార్మిక పోరాటాల విజయం ముడిపడి ఉంటుంది.

"కార్మికసంఘ కార్యకర్తలకు మార్క్సిస్టు దృక్పథం తెలిసి ఉండాలి.

"కార్మికసంఘ కార్యకర్త తనంత తానే సంస్కృతిని అభివృద్ధి చేయాలి; ప్రజలతో వినయంగా, ఓర్పుగా ఉండాలి. సయోధ్య కుదుర్చుకునే సమయంలో, మంతనాలు చేసేటప్పుడు శత్రువుతో బేరసారాలకు తలపడుతున్నప్పుడు కూడా దృక్పథంలో చురుకుగా, స్థిరంగా, గౌరవప్రదంగా, నమ్రతతో మెలగాలి. మోటుగా వ్యవహరించడం కార్మికవర్గ స్వభావం కానేకాదు.

" తప్పుడు పద్ధతులు, దుస్సాహసంతో కూడిన ఒంటెత్తు పోకడలు లేదా ఆత్మవిశ్వాసం లేని సంస్కరణవాదిగా కాకుండా, కార్మికుల సమస్యలపై ధైర్యంగా పోరాడే కార్యకర్తలను తయారు చేసుకోడంలో సఫలీకృతమైతే కార్మికోద్యమానికి తిరిగి నాయకత్వం వహించగలుగుతాం; అన్ని ప్రజాపోరాటాలకు నాయకత్వం వహించగలుగుతాం. ప్రజల, కార్మికుల డిమాండ్లను సాధించడంలో విజయపథంలో నడవగలుగుతాం.

"మన కర్తవ్యాలను పూర్తిచేయడం అన్నది ప్రధానంగా కార్మికవర్గం, కార్మికసంఘాల ఐక్యతను సాధించడంపై ఆధారపడి ఉంటుంది; పాలక వర్గాల ఎత్తుగడలు తెలుసుకోవడమే కాక పైన చెప్పినట్టు పార్టీ, కార్మిక సంఘాలు ఎలా నడుస్తాయో అవగాహన చేసుకోవడం, వాటి కార్యాచరణకు సలహాలివ్వడం అవసరం; వారు ఎక్కడ ఎలా మెలుగుతున్నారో, ఎక్కడ తప్పులు చేస్తున్నారో తెలుసుకోవాలి.

"కార్మిక సంఘాల ఐక్యత సాధించడానికి సంఘాల నిర్మాణాన్ని అర్థం చేసుకోవాలి; ఐక్యత కోరుకునే సంఘాల నాయకత్వాన్ని మనం అర్థం చేసుకోవాలి. కిందినుంచైనా, పైనుంచైనా ఐక్యతను సాధించడానికి అనుసరించవలసిన, అనుసరించకూడని పద్ధతులను కూడా అర్థం చేసుకోవాలి.

"మనం సాధారణంగా చేసే పొరపాట్లు ఏమిటి? ప్రజలతో సజీవ సంబంధాలు పెట్టుకోకపోవడం, పరిశ్రమల లోపలనే పెద్దసంఖ్యలో కార్యకర్తలు పనిచేయడం వలన కార్మికుల నాడిని తెలుసుకోలేకపోతున్నాం; వారి నిర్దిష్టమైన సమస్యలను అర్థం చేసుకోలేకపోతున్నాం. అందువల్లే కార్మికులే నాయకత్వం వహించేలా చేసి ముందుకు తీసుకెళ్లాలని అనుకుంటున్నప్పుడు అనుకున్న స్థాయిలో స్పందన తీసుకురాలేకపోతున్నాం. మనం పరిశ్రమలలోకి ప్రవేశించలేని చోట, ఒకవేళ ప్రవేశించినా సంఘం గుర్తింపు పొందినందు వల్ల కాక కార్మికసంఘ సభ్యత్వం ఉండడం వలన మాత్రమే ప్రవేశించగలిగిన చోట, కార్మికుల నివాస ప్రాంతాలలో విస్తృతంగా కృషిచేస్తే తప్ప అభివృద్ధి సాధ్యపడదు.

"పరిశ్రమలలో, పేటలలో, బజార్లలో ఉన్న కార్మికులు, ఉద్యోగులు, నిరుద్యోగులతో కార్మిక సంఘాల కార్యకర్తలందరూ సన్నిహితంగా మెలగాలి.

" కార్మిక సంఘాలలో నిర్వహించవలసిన కనీస కర్తవ్యాలను, కార్మికుల జీవితంలో ప్రతి పార్శ్వాన్ని కార్యకర్తలు తెలుసుకోవాలి. ఆహార భద్రత, సంక్షోభం, ఇతర రోజువారీ సమస్యలకు సంబంధించి కార్మికుల డిమాండ్లను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి.

"ప్రతి పరిశ్రమకి, వృత్తికి సంబంధించిన డిమాండ్లను వేర్వేరుగా రూపొందించాలి. అపరిమితమైన, అదుపులేని డిమాండ్లను రూపొందించుకోకూడదు.

"పోరాటాన్ని మొదలు పెట్టక ముందే కార్మికేతరుల మద్దతును కూడగట్టాలి. ముఖ్యంగా మునిసిపల్ సేవలు, రవాణా, ఇంటిపని, విద్యుత్ మొదలైన వాటి విషయంలో ఇది మరింత ముఖ్యం. సమ్మె సగం రోజా, పూర్తి రోజా లేక కొనసాగించవలసి ఉంటుందా అన్నది కార్మికుల సంసిద్ధత, ఐక్యత, నాయకత్వం కృషిపై ఆధారపడి ఉంటుంది. పోలీసుల దమనకాండ, యజమానుల గుండాల హింస నుండి వారిని రక్షించడం కూడా కార్మికుల ప్రయోజనాలు కాపాడడంలో భాగమే. కార్యాచరణకు ప్రజల సంసిద్ధత, ఏ విధంగా కృషి చేయాలన్నది పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

"కార్మిక సంఘాల పోరాటాలను రైతాంగ పోరాటాలకు ఎలా అనుసంధానం చేయాలన్నది ఆ ప్రాంతం, పరిశ్రమ, సంఘ నిర్మాణం, కార్మికులు, రైతాంగం సైద్ధాంతిక సంసిద్ధతపై ఆధారపడి ఉంటుంది.

"ప్రజాసంఘాల పనిలో అనుభవం, కార్మికవర్గ డిమాండ్లను ముందుకు తీసుకెళ్ళే కార్మిక సంఘాల నిర్మాణ నైపుణ్యం ముందు ఎటువంటి వివరమైన సూచనలు, బోధనలు కూడా దిగదుడుపే".

**(అనువాదం: కె ఉషారాణి)**

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-12-2021 (36 pages) Postal Regd. No D/VJ/172/2021-23

# భారతదేశంలో 35 కోట్ల మంది పేదలు

**- నీతి ఆయోగ్**



భారత దేశ జనాభాలో 25 శాతం మంది అంటే సుమారు 35 కోట్ల మంది ప్రజలు బహువిధ (మల్టీ–డైమెన్షనల్) పేదరికంలో బ్రతుకుతున్నారని సాక్షాత్తు కేంద్ర ప్రభుత్వానికి చెందిన నీతి ఆయోగ్ తెలిపింది. మామూలుగా పేదరికాన్ని కొలవడానికి దేశంలోని ప్రజల ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. కానీ బహువిధ పేదరికాన్ని కొలవడానికి ప్రజల ఆదాయం, వస్తు వినిమయంతో బాటు మరో మూడు ముఖ్యమైన అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు, అవి: విద్య, వైద్యం, జీవన ప్రమాణాలు అంటే పౌష్టికాహారం, పారిశుధ్యం, మంచినీరు, గృహ వసతి వంటివి. వీటన్నిటినీ పరిగణలోకి తీసుకున్నప్పుడు 2019లో భారత దేశంలో 28 శాతం అంటే సుమారు 36.4 కోట్ల మంది ప్రజలు పేదరికంలో ఉన్నారని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. నీతి ఆయోగ్ మొట్టమొదటి సారిగా దేశంలో బహువిధ పేదరికాన్ని అంచనా వేస్తూ ఐక్య రాజ్య సమితి పరిగణలోకి తీసుకున్న అంశాలతోబాటు మరో రెండు అంశాలా ప్రశూతి సదుపాయాలు, బ్యాంకు ఎకౌంట్లను చేర్చి బహువిధ పేదరికాన్ని అంచనా వేసింది. ఐక్య రాజ్యసమితి 109 దేశాల్లో సర్వే చేసి బహువిధ పేదరికం సూచీని తయారు చేయగా అందులో భారత దేశం 64వ స్థానంలో ఉంది.

బహువిధ పేదరికం దేశంలోని అన్ని రాష్ట్రాలతో పోలిస్తే బీహార్‌లో ఎక్కువగా ఉంది. అక్కడ 51.91 శాతం మంది పేదరికంలో మగ్గుతున్నారు. తరువాత ఝార్ఖండ్ 42. 16 శాతం, ఉత్తర ప్రదేశ్‌లో 37.79 శాతంతో రెండు మూడు స్థానాలు ఆక్రమించాయి. జిల్లాల వారీ పేదరికం వివరాలు పరిశీలిస్తే బహువిధ పేదరికం తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో కూడా జిల్లాల మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉందని తేలింది. బీహార్‌లో పేదరికం 60 శాతం దాటిన జిల్లాలు 11 ఉండగా ఉత్తర ప్రదేశ్‌లో పేదరికం 70 శాతం దాటిన జిల్లాలు మూడున్నాయి. దీన్ని పూర్తి భిన్నంగా వామపక్ష పాలనలో ఉన్న కేరళలోని మొత్తం 14 జిల్లాలకు గాను 9 జిల్లాల్లో పేదరికం ఒక్క శాతం కన్నా తక్కువగా ఉంది.


**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు..................................................

వీధి..................................................

గ్రామం..................................................

మండలం లేదా పట్టణం..................................................

జిల్లా..................................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.16, No.7. Published on December 1, 2021